ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

మహబూబ్‌నగర్ | fb.com/vaartha

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-2-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 21 పేజీలు: 10+4 వెల: 6.50

కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప 2లో

ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగ్గురికి బెయిలు 3లో

# 5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

## పేదలకోసం ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు

## 10 యేళ్లు బడుగులను విస్మరించిన గత ప్రభుత్వం

## కెసిఆర్, మోడీ పాలనపై బహిరంగచర్చకు సిద్ధమా?

## నారాయణ్‌పేట జిల్లాలో వెయ్యికోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన సిఎం రేవంత్

## మహిళా సమాఖ్య పెట్రోలు బంక్ ప్రారంభం



శుక్రవారం నారాయనపేట జిల్లా అప్పక్‌పల్లి సభలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** 12 నెలల్లో రాష్ట్రంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ఈ విషయంలో ప్రతిపక్షాలతో చర్చకు సిద్ధమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం నారాయణ పేట జిల్లా పర్యటన సందర్భంగా దాదాపు 1000 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ముఖ్యమంత్రి అప్పక్ పల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఆడ బిడ్డలకు ఆలంబన ఇవ్వాలని దేశంలో ఎక్కడ లేని విధంగా నేడు మహిళా సమాఖ్యల ద్వారా పెట్రోల్ బంక్ నడిపించుకునే విధంగా పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవం చేసుకోవడం జరిగిందన్నారు. ఆనాడు కాంగ్రెస్ హయంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం 10 సంవత్సరాలు బడుగు బలహీన వర్గాల ప్రజలను విస్మరించిందని విమర్శించారు. తిరిగి ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేశక ప్రతి నియోజక వర్గానికి 3500 ఇళ్ల చొప్పున >>2

# అంజనీ కుమార్ మరో ఇద్దరు వెంటనే రిలీవ్

## 24 గంటల్లోగా ఎపిలో రిపోర్ట్ చేయాలి

## ముగ్గురు ఐపిఎస్‌లకు కేంద్ర హోంశాఖ షాక్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి21:** తెలంగాణలో ఉన్న ముగ్గురు ఐపిఎస్ అధికారులకు కేంద్రం షాక్ ఇచ్చింది. తెలంగాణలో రోడ్ సేఫ్టీ డిజిగా కొనసాగుతున్న అంజనీకుమార్‌ను వెంటనే రిలీవ్ చేయాలని కేంద్ర హోం శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఎపి కేడర్ ఐపిఎస్ అధికారిగా ఉన్న అంజనీ కుమార్‌తోపాటు అభిలాష్ బిస్త్,అభిషేక్ మహంతి సైతం ఎపికి కేటాయించబడిన అధికారులు. అయితేవారు ఎపికి వెళ్లకుండా తెలంగాణలోనే ఉండిపోయారు. ప్రస్తుతం కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా మహంతి విధులు నిర్వహి స్తున్నారు. తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా బిస్త్ పని చేస్తున్నారు.

అయితే ఈ ముగ్గురిని ఎపి కేడర్‌లో 24 గంటల్లోగా రిపోర్ట్ చేయాలని కేంద్ర హోంశాఖ ఆదేశించింది. రాష్ట్ర విభజన సందర్భంగా ఆ ముగ్గురు ఐపిఎస్ అధికారులు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడ్డారు. ఈ ముగ్గురు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి తెలంగాణలో కొనసాగుతున్నారు.

# సంక్షేమ హాస్టళ్ల ఆహారంపై నివేదిక ఇవ్వండి

## ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందించే ఆహార మెనూవివరాలను వివరిస్తూ రెండు వారాల్లోగా నివేదిక సమర్పించాలని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్, న్యాయమూర్తి రేణుక యారాలతో కూడిన పిల్ బెంచ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లు, విద్యా భవనాల పరిస్థితి, నిర్వహణకు సంబంధించిన పిటిషన్లను విచారిస్తూ కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ హాస్టళ్లలోని వాస్తవ పరిస్థితులను నివేదిక ప్రతిబింబించాలని కోర్టు నొక్కిచెప్పింది. అలాగే నివేదికను రూపొందించడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలనిఆదేశించింది. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు మరియు ఇతర విద్యా సంస్థలలో ప్రస్తుత సౌకర్యాల స్థితిని ఈ కమిటీ అంచనా వేస్తుంది, జీవన పరిస్థితుల సమర్థత, విద్యార్థులకు అందించే సౌకర్యాలు, >>2

# ఎస్సీ, ఎస్టీల స్వయం ఉపాధికి రూ. 3వేల కోట్ల పథకాలు

## అద్దెలు, డైట్ ఛార్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

## అటవీ భూముల అభివృద్ధికి ప్రణాళికలు: డి.సిఎం భట్టి



శుక్రవారం సచివాలయంలో ప్రిబడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైద్రాబాద్, ఫిబ్రవరి,21,ప్రభాత వార్త :** సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సంక్షేమ శాఖలో పథకాల అమలుకు ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సంక్షేమ శాఖల ప్రీబడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క పలుఅంశాలపై సమీక్ష నిర్వహించారు. గత దశాబ్ద కాలంగా పాలించిన వారుఎస్సీ, ఎస్టీ యువతకు స్వయం ఉపాధి పథకాలు పూర్తిగా పక్కనపెట్టారు. 3,000 కోట్ల బడ్జెట్‌తో ఎస్సీ, ఎస్టీ యువతకు రెండు నెలల వ్యవధిలో స్వయం ఉపాధి పథకాలు అందించాలని అధికారులను కోరారు. ఈ భారీ ఉపాధి పథకాలకు సంబంధించిన ప్రణాళికలను వేను వెంటనే సిద్ధం చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సంక్షేమ హాస్టల్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలకు సంబంధించి >>2

# సిఎంలు మారినా పాలన అదే..




## డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి మారిన పాలన మారలేదని, డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన ఉపాధ్యాయులతో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ సిఎంలు మారారే గానీ తెలంగాణ పాలనలో ఎలాంటి మార్పు లేదని అన్నారు. రాబోయే శాసన మండలి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను మేధావులు గెలిపించి సత్తా చాటాలన్నారు. ఎన్నికల తరువాత ప్రజా సమస్యలపై ఉద్యమబాటలో పయనిస్తామన్నారు. అనేక రాష్ట్రాల్లో మోడీ నేతృత్వంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏవిధంగా అభివృద్ధిలో దూసుకుపోతుందో చూస్తున్నారని చెప్పారు.

కర్ణాటక, హిమాచల్, తెలంగాణలో అవినీతి, అక్రమ ప్రభుత్వాల చేతకాని విధానాల వల్ల కనీసం జీతాలు ఇవ్వలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన గ్యారెంటీలు, సబ్ గ్యారెంటీల మాట దేవుడెరుగు, కనీస హామీలను కూడా అమలు చేయలేని పరిస్థితుల్లో 14 నెలలుగా తెలంగాణలో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణను అప్పుల కుప్పగా మార్చాయని మండిపడ్డారు. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్ర దశ దిశను సూచించే ఎన్నికలని అన్నారు. మేధావులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, రైతులు, రైతు కూలీలు, మహిళలు, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలులో చతికిలపడిందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ భృతి రూ. 4 వేలు, మహిళలకు రూ. 2500, ప్రతీ దళిత కుటుంబానికి రూ. 12 లక్షలు, రైతులు, రైతు కూలీలకు ఆదుకుంటామన్న హామీలన్నీ నీటి మూటలుగానే మిగిలాయన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ హామీలు ఇచ్చి ఇప్పుడు వారిని కనీసం కలవడం కూడా లేదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చినవి, చేసినవన్నీ మోస పూరిత హామీలేనని, ఊకదంపుడు ఉప >>2

# 27న ఎమ్మెల్సీ ఎన్నికలు

## ఆ జిల్లాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి21:** రాష్ట్రంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ హడావుడి నెలకొంది. ఈ నెల 27న కరీంనగర్ - ఆదిలాబాద్ - నిజామాబాద్-మెదక్ గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు, వరంగల్- నల్గొండ -ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలోఈనెల 27న ఏడు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. సిఇఒ ఆదేశాల మేరకు ఈమూడు నియోజక వర్గాల్లో ఓటర్లుగాఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం సెలవుప్రకటించింది. ఆయా జిల్లాల్లోని ప్రైవేట్‌ఉద్యోగులుకూడా ఓటింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆయా సంస్థలు, యాజమాన్యాలను ప్రభుత్వం ఆదేశించింది.

# బాంచెన్..కాల్మొక్తా! .. ప్రాధేయపడినా రైతుకు దిక్కులేదా?



కరీంనగర్ జిల్లా తాడికల్ గ్రామశివారులో నష్టపోయిన ఓ రైతు రెవెన్యూ అధికారి కాళ్లు మొక్కుతున్న దృశ్యం - 2లో



భూపాలపల్లి మండలం ఆజంనగర్‌లో రైతులను బూటుకాళ్లతో తన్నుతున్న పోలీసులు - 7లో

# ఎపి నీటి దోపిడిని అడ్డుకోండి

## శ్రీశైలం, ఎన్ఎస్‌పి నీరు తెలంగాణకు మాత్రం ఇవ్వండి


## కెఆర్ఎంబి ప్రత్యేక సమావేశం నేటికి వాయిదా

**హైదరాబాద్,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక్క చుక్కనీటిని వాడుకోకుండా అడ్డుకోవాలని తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జ, ఇఎన్‌సి జనరల్ జి.అనిల్‌కుమార్ కోరారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు ప్రత్యేక, అత్యవసర సమావేశం సోమవారంకు వాయిదా పడింది. ఆంధ్రప్రదేశ్ ప్రతినిధుల కోసం వేచిచూస్తూ దాదాపు గంటపాటు సాగిన సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ అధికారలు రానున్న జూలై దాక సాగు తాగునీటి అవసరాల కోసం తెలంగాణకు అవసరమైన నీటి కోసం 116 టిఎంసిలతో ఇండెంట్‌ను కెఆర్ఎంబి చైర్మన్‌కు అందించారు. కృష్ణాజలాలను 90 టిఎంసిలు సాగునీటికి, 26టిఎంసిలు తాగునీటికి తక్షణమే నీటి విడుదలకు ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ అక్రమంగా కృష్ణాజలాలను బేసిన్ దాటి తరలిస్తుందని తెలంగాణ ప్రభుత్వం ఆరోపణలు చేయడంతో కెఆర్ఎంబి సమావేశం ఏర్పాటుకు ఇరు రాష్ట్రాలను పిలిచింది.

కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం నుంచి ప్రాజెక్టులో ఈ యేడు 1010 టిఎంసిల నీరు వచ్చిచేరింది. అందులో 666 టిఎంసిలకు గాను ఎపి ఇప్పటికే 657 టిఎంసిలను వినియోగించుకున్నదని తెలంగాణ నీటిపారుదలశాఖ అధికారుల గణాంకాలు వివరిస్తున్నాయి. తెలంగాణకు 343 టిఎంసిలకు గాను 220 టిఎంసిలు మాత్రమే వినియోగించుకొంది.

దీనితో శుక్రవారం ఇరురాష్ట్రాలను కెఆర్ఎంబి సమావేశంకు పిలవడంతో తాము హాజరుకాలేమని, వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ అధికారులు కోరారు. దీంతో సమావేశాన్ని సోమవారానికి బోర్డు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సమావేశం జరుగనుంది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు సమాచారం అందించామని అధికారులు వెల్లడించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి కృష్ణా నీటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా తరలిస్తున్నదని, వెంటనే అడ్డుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ >>2





శుక్రవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్మును కలిసిన ఢిల్లీ కొత్త సిఎం రేఖా గుప్త

## రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిని కలిసిన ఢిల్లీ సిఎం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేఖాగుప్తా శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిసారు. అదేవిధంగా ఆమె ఉపరాష్ట్రపతి జగదీప ధన్‌ఖడ్‌ను కూడా కలిసారు. ఇరువురు రాజ్యాంగ నేతలకు ఆమె పుష్పగుచ్ఛాలిచ్చి తనను తాను పరిచయం చేసుకున్నారు. ముందు రాష్ట్రపతిని కలిసిన రేఖాగుప్తా వైస్‌ప్రెసిడెంట్ ఎన్‌క్లేవ్‌లో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌ను కలిసారు. ఇద్దరితోను కొద్దిసేపు సిఎం ఇష్టాగోష్టి జరిపారు. ఈ ఫోటోలను రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి కార్యాలయాలు తమతమ సోషల్‌మీడియాలోపోస్టుచేసాయి.

## భారతీయ భాషలమధ్య శతృత్వం లేనేలేదు

### మరాఠీ సాహిత్య సమ్మేళన్‌లో ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** జాతీయ విద్యావిధానం కింద హిందీని బలవంతంగారుద్దే ప్రయత్నం జరుగుతున్నదంటూ తమిళనాడు,కేంద్ర ప్రభుత్వాల మధ్య మాటలయుద్ధంజరుగుతున్న క్రమంలోప్రధానమంత్రి నరేంద్రమోడీ కీలకవ్యాఖ్యలుచేసారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో శుక్రవారం జరిగిన 98వ అఖిల భారతీయ మరాఠి సాహిత్య సమ్మేళన్‌లోప్రధానిమాట్లాడుతూ భారత భాషలమధ్య ఎప్పుడూ శతృత్వంలేదని స్పష్టంచేసారు. భారతీయ భాషలన్నీ ఒకదానికకటి సుసంపన్నంచేసుకున్నాయి. భాషా ప్రతిపదికగా విభజనలు తెచ్చేప్రయత్నాలు జరిగినా భారత దేశ ఉమ్మడిభాషా వారసత్వం తగిన సమాధానం ఇచ్చింది. ఇలాంటి అపోహాలకు దూరంగా ఉంటూ అన్నిభాషల సమున్నతికి పాటుపడటం ఒక సామాజిక బాధ్యతగా మనం గుర్తించాలని ఆదిశగానే ఈరోజు మరాఠి భాషతోసహా దేశంలోని అన్నిప్రధానభాషల్లోను మనం విద్యను ప్రమోట్‌చేస్తున్నట్లు ప్రధాని చెప్పారు. మహారాష్ట్ర యువత మరాఠీలోనే ఉన్నతవిద్య, ఇంజనీరింగ్, వైద్య విద్యలు చదువుతున్నారరన్నారు లిటరేచర్ అనేది సమాజానికి అద్దంలాంటిదని సమాజానికి ఒకనిర్దేశకత్వంచూపుతుందని వివరించారు. లిటరరీ సదస్సులు సంస్థలుఈదిశగా కీలకపాత్రపోషిస్తున్నాయని ప్రశంసించారు. జాతీయ విద్యావిధానంతోత్రిభాషా సూత్రాన్ని విధించేప్రయత్నంలో తమపై హిందీని రుద్దేప్రయత్నంచేస్తున్నారంటూ తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్, డిప్యూటి సిఎం ఉదయనిధి విమర్శలుచేస్తున్న క్రమంలోప్రధాని వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

# రిటైరైనా అందని బెనిఫిట్స్

### హైకోర్టులో టీచర్లు, ఉద్యోగుల న్యాయపోరాటం

### న్యాయస్థానం మెట్లెక్కితేగానీ చెల్లించని ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి21:** ఉద్యోగ విరమణ చేశాక నెలలు గడుస్తున్నా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందని పరిస్థితి ఉంది. గతేడాది మార్చి నుంచి ఉద్యోగవిరమణ పొందిన ఉపాధ్యాయులకు చెల్లింపులకే కనీసం రూ.1,500కోట్లు అవసరమని అంచనా. ఇతర శాఖల వారినీ కలిపితే ఆ మొత్తం రూ.3వేల కోట్ల వరకు ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.59 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా వారిలో ఉపాధ్యాయులే దాదాపు 1.15 లక్షల మంది ఉన్నారు. ఉద్యోగ విరమణ వయసును రాష్ట్ర ప్రభుత్వం 2021లో 58 నుంచి 61కి పెంచింది. ఆ గడువు గతేడాది మార్చితో ముగిసింది. 2024 మార్చి నెలాఖరు నుంచి ప్రతినెలా దాదాపు 800 నుంచి 1000 మంది ఉద్యోగ విరమణ పొందుతుండగా వారిలో సగటు 350 నుంచి 400 మంది ఉపాధ్యాయులే ఉంటున్నారు. గత 11 నెలల కాలంలో సుమారు 8 వేల మంది ఉద్యోగ విరమణ పొందగా వారిలో 4 వేల మంది దాకా ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ (ఆర్థిక ప్రయోజనాలు) అందక వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి పరిష్కారంగా న్యాయస్థానం మెట్లెక్కుతున్నారు. గత డిసెంబరు నుంచి ఇప్పటివరకు దాదాపు 500 మంది విశ్రాంత ఉపాధ్యాయులు న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. ఇతర శాఖల ఉద్యోగులూ అదేబాట పడుతున్నారు.హైదరాబాద్‌లోని ట్రెడరీ విభాగంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగి ఒకరు కొద్ది నెలల క్రితం హైకోర్టు ఆశ్రయించగా ఆయనకు 8 వారాల్లో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అన్నీ ఇవ్వాలని తీర్పునిచ్చింది. ప్రభుత్వం వెంటనే ఆ మొత్తాన్ని ఇచ్చింది. ఈ విషయం తెలిసిన విశ్రాంత ఉపాధ్యాయులు హైకోర్టుకు వరుస కట్టారు. పిటిషన్ దాఖలు చేసినవారికి ఈ విషయం 8 వారాల్లో బెనిఫిట్స్ చెల్లించాలని తీర్పు వస్తుండగా ప్రభుత్వం సైతం ఒకట్రెండు వారాల్లో చెల్లిస్తోంది.

మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఎం.చంద్రా రెడ్డి గతేడాది మేలో ఉద్యోగ విరమణ పొందారు. దాదాపు ఎనిమిది నెలలు గడిచినా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందకపో వడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాటిని చెల్లించాలంటూ మరుసటి రోజే తీర్పు వెలువడింది. ఆతీర్పు కాపీని విద్యాశాఖ కార్యదర్శి, ఏజీ కార్యాలయంలో అందజేయగా వారం రోజుల్లోనే సుమారు రూ. 52 లక్షల సొమ్ము బ్యాంకు ఖాతాలో జమైంది. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు గ్రాట్యుటీతో పాటు జనరల్ ప్రావిడెంట్‌ఫండ్(జీపీఎఫ్), గ్రూపు ఇన్సూరెన్స్ (టీఎస్‌జీఎల్‌ఐ), కమ్యుటేషన్, సరెండర్‌లీవులు తదితరాల సొమ్మును ఏకమొత్తంలో చెల్లించాల్సి ఉంటుంది. ఉద్యోగుల స్థాయిని బట్టి రూ.40 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు చేతికందుతాయి. వాస్తవానికి ఉద్యోగ విరమణకు నాలుగు నెలల ముందే అకౌంటెంట్ జనరల్(ఏజీ) కార్యాలయానికి ఉద్యోగులు లిఖితపూర్వకంగా సమగ్ర వివరాలు అందజేస్తారు. కానీ,ఉద్యోగ విరమణ పొందినవారు న్యాయస్థానానికి వెళ్లే వరకు ఆగకుండా ప్రభుత్వం వెంటనే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

## నీటి దోపిడిని అడ్డుకోండి

>> రెడ్డి కెఆర్‌ఎంబీకి ఫిర్యాదు చేశారు. రెండు ప్రాజెక్టుల పరిధిలో 35 చోట్ల టెలిమెట్రీ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో బోర్డు చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం సమావేశం ఏర్పాటు చేసింది. రెండు రాష్ట్రాల ఇఎన్‌సిలు కెఆర్‌ఎంబి పంపిన వాయిదా సమాచారం అందినదని ధృవీకరించారు. ఈసారి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హాజరు కాకపోయినా తమ వాదన వినిపిస్తామని తెలంగాణ ఇఎన్‌సి అనీల్‌కుమార్ తెలిపారు.



శుక్రవారం న్యూఢిల్లీలో 'సోల్' లీడర్‌షిప్ సమ్మిట్‌ను ప్రధాని మోడీ ప్రారంభించిన దృశ్యం. భూటాన్ ప్రధాని షేరింగ్ తోబ్గే చిత్రంలో ఉన్నారు

## ప్రధానిమోడీ నాకు

# పెద్దన్న వంటి వారు!

### భూటాన్ ప్రధాని షేరింగ్ తోబ్గే

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** భారత ప్రధానినరేంద్రమోడీ తనకు పెద్దన్న వంటివారని భూటాన్‌ప్రధాని షేరింగ్ తోబ్గే అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన సోల్ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొని ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన కొత్తలో నాయకత్వం గురించి ఏమీ తెలిసేదికాదని, అందుకు తాను అర్హుడిని కాదని అనుకునేవాడినన్నారు. ప్రస్తుతం భారత్ పర్యటనకు ఒక విద్యార్థిగా వచ్చానని దీనిద్వారా ప్రపంచంలోనే గొప్పనేతగా పేరుపొందిన నరేంద్రమోడీనుంచి తనకు నాయకత్వ పాఠాలు నేర్చుకునే అవకాశం కలిగిందని హర్షం ప్రకటించారు. ప్రధాని నరేంద్రమోడీ విజ్ఞత, ధైర్యం, ముందుచూపుతో కేవలం పదేళ్లలో భారత దేశాన్ని ప్రగతిపథంలో నడిపించారని అన్నారు. ప్రస్తుతం ప్రపంచదేశాలు భారత్‌వైపు చూస్తున్నాయని అన్నారు.

నాయకత్వం అనేది కేవలం బిరుదుల్లో ఉండదని, వారుచూసే దృష్టికోణంలో ఉంటుందని చరిత్రకూడా ఇదే నిజమని చెపుతోందన్నారు. ప్రపంచంలోని గొప్పనాయకులు కేవలం ఒక సంస్థకు లేదా దేశానికి నాయకత్వం వహించలేదని, ఒక విప్లవం, అభి వృద్ధికి నాయకత్వం వహించారన్నారు. సరైన నాయకులు తమ దేశాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళతారని అలాంటి నాయకుడే ప్రధానిమోడీ అనిఅన్నారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానిమోడీ మాట్లా డుతూ వికసిత్‌భారత్ లక్ష్యాన్ని చేరుకోవడంలో స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్ కీలకపాత్ర పోషి స్తుందని అన్నారు. భారత పాలన, విధాన రూపకల్పనను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు దేశప్రజలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధిలో మానవ వనరులు కీలకపాత్రపోషిస్తాయని తెలిపారు. మన వ్యక్తిగత అభివృద్ధిపై ఆలోచిస్తే మనమే బాగుపడతామని అదే ఇతరులగురించి ఆలోచిస్తే దేశానికి ఉపయోగపడే ఎందరో నాయకులను తయారుచేయొచ్చని అన్నారు.

# 5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

>> రాష్ట్రంలో 5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసుకొని ఈరోజు నారాయణపేట నుంచి భూమి పూజ చేసుకోవడం జరిగిందన్నారు. అవసరం అనుకుంటే నియోజకవర్గానికి 5 వేలకు పెంచుతామని పేర్కొన్నారు. హైదారాబాద్ రాష్ట్రానికి పాలమూరు జిల్లావాసి బూర్గుల రామకృష్ణ రావు తొలి ముఖ్యమంత్రిగా పనిచేస్తే దాదాపు 7 దశాబ్దాల తర్వాత తిరిగి పాలమూరు బిడ్డకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చిందన్నారు. ఈ అవవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెనకబడ్డ ఈ పాలమూరు జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటానని హామి ఇచ్చారు.

పాలమూరు జిల్లా గుండా సంవత్సరానికి 811 టియంసిల నీరు పోతుంటే పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేయకుండా జిల్లాను ఎందుకు నిర్లక్ష్యం చేశారని ప్రశ్నించారు. పాలమూరు జిల్లా తెలంగాణ రాష్ట్రంలో లేదా అని ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, ఆర్‌డిఎస్, కల్వకుర్తి, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తిచేయకుండా 10 ఏళ్లు నిర్లక్ష్యం చేశారని ఎద్దేవా చేశారు. పైగా పోతిరెడ్డి పాడు, ముచ్చుమర్రి ప్రాజెక్టుల ద్వారా రాయల సీమకు నీళ్లు తరలించుకుపోయేందుకు అవకాశం కల్పించారని పరోక్షంగా మాజీ సీఎం కెసిఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. మక్తల్, కొడంగల్, నారాయణపేట ప్రాజెక్టు నిర్మాణానికి 2014లో కొట్లాడి మంజూరు చేయిస్తే తనపైన ఉన్న కోపంతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టకుండా ఆపేశారని అన్నారు. ఇప్పుడు తన హయాంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉదండాపూర్, పాలమూరు రంగారెడ్డి, ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తామని హామి ఇచ్చారు. లగచర్లలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తే అడ్డుకున్నారని, పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసుకుంటే ఎందుకు అక్కసు వెళ్లగక్కుతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి కేవలం 12 నెలలు పూర్తి అయ్యిందని, బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన 10 సంవత్సరాల పాలన, కేంద్రంలో 12 సంవత్సరాల మోడీ ప్రభుత్వం పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.

జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాదని, నన్ను కాపాడుకునే బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. ఈ సభలో పాల్గొన్న రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహా మాట్లాడుతూ ఆగష్టు 1,2024న సుప్రీం కోర్టు ఇచ్చిన సూచనల మేరకు 120 రోజుల్లో విజయవంతంగా కుల గణన పూర్తి చేయడం జరిగిందని దానితో పాటు వర్గీకరణ పూర్తి చేసి అన్ని విధాలుగా వెనుకబడిన మాదిగ కులానికి 9.7 శాతం రిజర్వేషన్ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు మాత్రమే అవుతుందని ఈ 14 నెలల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేశామని తెలిపారు. 10 సంవత్సరాల పరిపాలన చేసిన గతప్రభుత్వం 8 లక్షల కోట్లు అప్పు చేసి మరో 40 వేల కోట్ల పెండింగ్ బిల్లులు పెట్టి ఇచ్చిన హామీలు ఏమయ్యిందని అడుగుతున్నారని అన్నారు. అభివృద్ధి విషయంలో వేదిక ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అంతకు ముందు నారాయణపేట శాసన సభ్యులు చిట్టెం పర్ణికారెడ్డి, మంత్రులతోకలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమా లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నారాయణపేట జిల్లాలో దాదాపు 967కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు.56 కోట్ల



మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన పెట్రోలు బంకును మంత్రి సీతక్క ప్రారంభించిన దృశ్యం

రూపాయల వ్యయంతో నిర్మించిన వైద్య కళాశాల భవనానికి ప్రారంభోత్సవం చేశారు. 130 కోట్ల అంచనా వ్యయంతో వైద్య కళాశాల నూతన హాస్టల్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌కు శంఖుస్థాపన చేశారు.

రూ.26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనం, రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల యూనిట్‌కు శంఖుస్థాపన చేశారు. రూ. 5.58 కోట్ల వ్యయంతో నిర్మించిన ధన్వాడ, నారాయణపేటలో నిర్మించిన రూరల్ పోలీస్ స్టేషన్ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. రూ.1.23 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా మహిళా సమాఖ్య నిర్వహించే పెట్రోల్ బంక్‌ను ప్రారంభోత్సవం చేశారు. రూ.295 కోట్ల అంచనా వ్యయంతో తుంకిమెట్ల నారాయణపేట రోడ్, కోటకొండ మద్దూరు రోడ్ అభివృద్ధి పనులు, అప్పక్ పల్లి గుండిమాల్ రోడ్, మద్దూరు లింగాల్ చెడ్ రోడ్ లలో హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 193 కోట్ల నిధులతో గుల్బర్గా కొడంగల్, రావులపల్లి మద్దూరు, కొస్గి దౌల్తాబాద్ రోడ్డు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. రూ.12.70 కోట్ల నిధులతో నారాయణపేట నియోజకవర్గ పరిధిలోరి ఆర్‌ఆర్ రోడ్లకు శంఖుస్థాపన చేశారు. రూ.7 కోట్లతో మరికల్‌లో నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాల, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డిజిపి జితేందర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్, జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్, నారాయణపేట శాసన సభ్యుడు పర్ణిక రెడ్డి, మహబూబ్ నగర్ శాసన సభ్యుడు యెన్నం శ్రీనివాసరెడ్డి రెడ్డి, మక్తల్ శాసన సభ్యులు వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలపై సిఇఒ కీలక ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 21:** ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం జిల్లా కలెక్టర్లతో ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం, మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్-కరీంనగర్, వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లను చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు,వెబ్ కాస్టింగ్‌ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, బ్యాలెట్‌బాక్సుల ఓవరాలింగ్ తదితర అంశాలపై కలెక్టర్లు ఎన్నికల సంసిద్ధతపై సిఇఒకు వివరించారు.

## సిఎంలు మారినా పాలన అదే..

>> న్యాసాలు తప్ప ఇంకేం లేవన్నది తేలిపోయిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. తెలంగాణలో ఆర్థిక పరిస్థితి పూర్తిగా దివాళా తీసిందని, ఉద్యోగులకు జీతాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఐదు డిఎలపై మాట్లాడే పరిస్థితి లేదన్నారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని బిఆర్‌ఎస్ అప్పుల కుప్పగా మార్చిందని, అదే దిశలో మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పాలన కొనసాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసపూరిత హామీలు, అహంకారపూరిత చర్యలు, అధికార దుర్వినియోగం తప్ప ఇరు ప్రభుత్వాల పాలనలో మార్పు ఏమీ లేదన్నారు. మార్పు వచ్చిందంటే కేవలం కెసిఆర్, రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ కుటుంబాల్లోనే వచ్చిందని విమర్శించారు. రాష్ట్రాన్ని గాడిన పెట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందారని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ప్రజా తీర్పు బిజెపి వైపే..

ఈ శాసనమండలి ఎన్నికల్లో ప్రజల తీర్పు కాంగ్రెస్ వైఫల్యానికి వ్యతిరేకంగా రానుందని, బిజెపి అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని, ఈ మార్పులో విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు కీలక పాత్ర పోషించి మోదీ ప్రభుత్వాన్ని అక్కున చేర్చుకోవాలని, భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయంతో తమ పార్టీకి మరింత మద్ధతు లభిస్తుందని, దీంతో మరింత బలపడి ప్రభుత్వాల మెడలు వంచే ఉద్యమబాటలో పయనిస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి21:** మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. ఇకపై ఏ పార్టీలో కాకుండా స్వతంత్రంగా ఉంటానని శుక్రవారం తెలిపారు. తాజాగా జరుగుతున్న గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బిసి అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు తన పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. బిఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ చేసిన వ్యాఖ్యల వల్లే బిఆర్‌ఎస్‌ను వీడినట్లు తెలిపారు. కాగా, బిఆర్‌ఎస్, కెసిఆర్‌ను తాను ఎప్పుడూ విమర్శించలేదని స్పష్టం చేశారు సిర్పూర్ కాగజ్‌నగర్ కాంగ్రెస్‌లో విభేదాలు ముదిరాయి. ఇటీవల కాంగ్రెస్ పార్టీ తీరుపై మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మండిపడటం హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ పార్టీ దొంగల కంపెనీ అంటూ ఆయన వ్యాఖ్యలు చేశారు. రూ.75 కోట్లతో మంజూరు చేయించినప్లై ఓవర్‌ను రద్దు చేయడంపై కోనప్ప అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కొత్త బిచ్చగాళ్లు తిరుగుతున్నారు.. మీకు అంత సీన్ లేదంటూ ఆయన వ్యాఖ్యానించారు. గ్రామాల్లోకి వచ్చే నాయకులను గల్లా పట్టి నిలదీయాలని పిలుపునిచ్చారు. తాను ఎవరికీ భయపడనని కూడా తేల్చిచెప్పారు. గతంలో టికెట్ ఇవ్వకుంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచిన విషయం కూడా గుర్తు చేశారు. సీఎంను కలిసి చాలా సార్లు ఫ్లై ఓవర్ పూర్తి చేయాలని చెప్పినా.. స్పందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన హస్తం పార్టీ అభ్యర్థికి కాకుండా స్వతంత్రంగా బరిలోకి దిగిన బిసి అభ్యర్థి హరికృష్ణకు మద్దతు ప్రకటించారు.

## రూ. 3వేల కోట్ల పథకాలు

>> అద్దెలు, డైట్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలని డిప్యూటీ సిఎం అధికారులకు సూచించారు. శాఖల వారీగా ఈ అంశాల్లో ఉన్న బకాయిల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బకాయిలకు సంబంధించి శాఖల అధికారులు బాధ్యత తీసుకొని ఆర్థిక శాఖ నుంచి బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేయించుకోవాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ అధికారులు సంక్షేమ హాస్టలు, గురుకులాల్లో పర్యటన కార్యక్రమం నిరంతరం కొనసాగేలా సంక్షేమ శాఖ అధికారులు ఫాలో అప్ చేసుకోవాలన్నారు. పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్‌ను సంక్షేమ శాఖల అధికారులు నిత్యం ప్రజా ప్రతినిధులు, సీనియర్ అధికారులకు గుర్తుచేసి కార్యక్రమం విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లాలని తెలిపారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం వివిధ శాఖల నుంచి ఎస్సీ, ఎస్టీ శాఖలకు రావలసిన నిధులపై కసరత్తు చేసి సీరియస్‌గా ఫాలోఅప్ చేయాలని తెలిపారు. కేంద్ర పథకాలకు సంబంధించి ఎప్పటికప్పుడు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించి నిధులు రాబట్టడంలో వేగం పెంచాలని కోరారు. ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు అటవీ హక్కుల చట్టం కింద లక్షలాది మంది గిరిజనులకు భూ పంపిణీ జరిగిందని డిప్యూటీ సిఎం తెలిపారు. ఈ భూముల అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ శాఖల అధికారులు విద్యుత్తు, వ్యవసాయ, అటవీ, ఉద్యాన శాఖ అధికారులతో సంయుక్తంగా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ భూముల్లో సోలార్ పవర్ ఆధారంగా సాగు విస్తీర్ణాన్ని పెంచడం, అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు అవకాడో, వెదురు వంటి పంటల సాగుకు ప్రణాళికలు రచించి రాబోయే రెండు సంవత్సరాల్లో ఫలితాలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి ఆ వర్గాల ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సంక్షేమశాఖ అధికారులు ఆయావర్గాల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఏసూచన చేసిన అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగాఉందని డిప్యూటీ సిఎం భరోసా ఇచ్చారు.

## ఆహారంపై నివేదిక ఇవ్వండి

>> నిర్వహణపై దృష్టి పెడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 9,000 కంటే ఎక్కువ సంక్షేమ హాస్టళ్లు మరియు పాఠశాలల్లో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేవని పిటిషనర్ న్యాయవాది వాదించారు. విద్యార్థుల సంక్షేమానికి కీలకమైన ఈ సంస్థలలో తగిన జీవన పరిస్థితులు మరియు సౌకర్యాలను అందించడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. ఈ ఆందోళనలకు ప్రతిస్పందనగా, ఈ సమస్యను పరిశీలించి సమగ్ర నివేదికను సమర్పించడానికి ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని హైకోర్టు నిర్ణయించింది.

# బాంచెన్.. కాల్మొక్తా.. న్యాయం చేయండి..

### కంటతడిపెడుతున్న రైతులు

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** ఒకే భూమి.. ఒకే సర్వే నెంబర్, ఒకే ప్రాంతంలో ఒక రైతు గుంటకు 56,000 రూపాయల చొప్పున ఏ దిక్కులేని మరో నిరుపేద రైతుకు గుంటకు 36,000 రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించడం ఏ చట్టంలోనైన ఉందా..? ఇంత అన్యాయం ప్రభుత్వానికి పట్టదా...? అధికార యం త్రాంగానికి గిట్టదా..? అంటూ రైతులు, రైతు సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే... కరీంనగర్ జిల్లా శంకరపట్నం (కేశవపట్నం) మండలం తాడికల్ గ్రామపంచాయితీ శివారులో సర్వే నెంబర్ 166లో వెంగల శ్రీనివాస్ అనే రైతుకు చెందిన 23గుంటల వ్యవసాయ భూమిని రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వానికి ఇచ్చాడు. అందుకు గాను రైతు ఖాతాలో గుంటకు 36,000 రూపాయల చొప్పున రైతు ఖాతాలో వేసారు. ఇదే సర్వే నెంబర్‌లోని మరో రైతుకు గుంటకు 56,000 రూపాయల చొప్పున ప్రభుత్వం చెల్లించడంతో, గత సంవత్సర కాలంగా తాడికల్ శివారులోని ఇప్పలపల్లి గ్రామ రైతు వెంగల శ్రీనివాస్ తనకు అన్యాయం జరిగిందంటూ సంవత్సర కాలంగా అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి దండాలు పెడుతున్న ఎవరు పట్టించుకోకపోవడంతో, అప్పటికే 1-2 సార్లు ఎన్‌హెచ్ 563 నిర్మాణం పనులు జరుగుతున్న రోడ్డు పనులను తన భూముల వద్ద శ్రీనివాస్ అడ్డుకున్నాడు. అధికారులు నీకు న్యాయం చేస్తామంటూ శ్రీనివాస్‌కు అభయం ఇచ్చి, సంవత్సర కాలం గడిచిన ఇంత వరకు న్యాయం జరగకపోగా, అయిన తోటి మరో ఆరుగురు రైతులకు ఇదే సర్వే నెంబర్‌లో గుంటకు 56,000 రూపాయల చొప్పున వారి ఖాతాలో జమ అయినట్లు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేసారు. గురువారం నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను తన భూమి వద్ద రైతు శ్రీనివాస్, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగాడు. సంఘటన విషయం తెలుసుకున్న తహసిల్దార్ భాస్కర్ స్థానిక పోలీసుల సహకారంతో సంఘటన స్థలానికి చేరుకుని, రైతును ఆందోళన విరమింపజేయడానికి ప్రయత్నించగా, రైతు శ్రీనివాస్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు తహసిల్దార్ కాళ్ల మీద పడి, బాంచెన్ కాళ్లు మొక్కుతా.. నాకు అన్యాయం జరిగింది. నాకు ఉన్న పంట భూమి 23 గుంటలు మీకే ఇవ్వడం జరిగింది. నా తోటి రైతులకు ఏ విధంగానైతే నష్టపరిహారం చెలి ంచారో.. నాకు అదే పద్దతిలో చెల్లించాలని రైతు శ్రీనివాస్ కాళ్ళ, వేళ్ల పడిన కనికరించని రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో రైతు శ్రీనివాస్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లడం, కరీంనగర్ జిల్లాలో చర్చనీయంశంగా మారింది. ఈ సంఘటన జరిగిన తీరు తెన్నులు సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతుండడంతో, రైతు సంఘాలు, రైతులు ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనాన్ని, రెవెన్యూ అధికారుల అలసత్వాన్ని ప్రజా సంఘాలు తప్పు పడుతున్నాయి. రైతు న్యాయం చేయమని కాళ్లు మొక్కుతే.. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లడమేమిటని రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ తాడికల్ సంఘటనపై సమగ్ర న్యాయం విచారణ జరిపించి, నష్టపోయిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## వారం - వర్జ్యం

తేది : 22-02-2025, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
నవమి మ.1.20
జ్యేష్ఠ సా.5.39
వర్జ్యం : రా.2.00-3.40
దు.ఉ.6.39 - 8.14
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. వస్తులాభం.

**వృషభం:** భాగస్వామ్య వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఇతరుల విషయాలలో జోక్యం వద్దు.

**మిథునం:** పనులలో ఆటంకాలు ఎదురైచికాకులు పెడతాయి. ఖర్చులు అధికమవుతాయి.

**కర్కాటకం:** సన్నిహితుల ద్వారా విలువైన సమాచారం అందుకొంటారు. గృహం కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి.

**సింహం:** వృత్తి, వ్యాపారాలలో పురోగతి సాధిస్తారు. అనుకోని విధంగా ధన, వస్తు లాభాలు పొందుతారు.

**కన్య :** కొత్త వస్తువులు, ఆభరణాలు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. ఔషధ సేవనం. ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు చాలా అవసరం.

**తుల :** శ్రమాధికం. బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకొంటారు. దూర ప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకొంటారు.

**వృశ్చికం:** సోదరుల నుండి కొన్ని విషయాలు తెలుసుకుంటారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కొంటారు. అనుకోని విధంగా ఖర్చులు ఎదురవుతాయి.

**మకరం:** ఉద్యోగాలలో ఆకస్మిక బదలీలు ఆశ్చర్యపరుస్తాయి. సేవకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం:** రుణబాధలు తీరి ఊరట చెందుతారు. మిత్రులను కలిసి కష్ట సుఖాలను పంచుకొంటారు.

**మీనం :** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆనందం కలుగుతుంది. వాహనాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి. కోఠి. హైదరాబాద్

# గంగారామ్ ఆస్పత్రి నుంచి సోనియాగాంధీ డిశ్చార్జి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ ఆసుపత్రినుంచి డిశ్చార్జి అయ్యారు. సోనియా గురువారం అస్వస్థతతో ఆసుపత్రిలోచేరారు. పొత్తికడుపు సంబంధిత కారణాలతో ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రిలో చేరారు. అక్కడ వై ద్యులు ఆమెకు అన్నిరకాల పరీక్షలు చేసారు. ప్రస్తుతం సోనియా ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. దీనితో ఆమెను శుక్ర వారం మధ్యాహ్నం డిశ్చార్జిచేసినట్లు ఆసుపత్రి యాజమాన్యం ప్రకటిం చింది. సోనియాగాంధీ వయసు ప్రస్తుతం 78 యేళ్లు ఇటీవలికాలంలో పలు మార్లు ఇలా అస్వస్థతో ఆసుపత్రిలోచేరిన విషయం తెలిసిందే. అనం తరం కోలుకుని ఆరోగ్యంతో డిశ్చార్జి అవుతూ వస్తున్నారు. తరచూ వైద్యపరీక్షలు చేయించుకుంటూ ఆమె తన ఆరోగ్యం కాపాడుకుంటూ వస్తున్నారు.

## ఢిల్లీ పోలీసులకు పట్టుబడిన

# లేడీడాన్ జోయా

### కోటి రూపాయల హెరాయిన్ స్వాధీనం

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మోస్ట్‌వాంటెడ్ లేడీడాన్ జోయా (33) ఢిల్లీ పోలీసులకు పట్టుబడింది. దోపిడీలు, దొంగతనాలు, డ్రగ్స్, కిడ్నాపులకు సంబంధించిన తీవ్రమైన నేరాల్లో అరెస్టయి తీహార్ జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ హాషీంబాబా మూడో భార్యగావున్న జోయాపైనా ఇదేరకం కేసులున్నాయి. జైల్లోని తన భర్తను కలిసేందుకు తరచూ అక్కడకివెళ్లే జోయా ఈ క్రమం లోనే భర్త నుంచి నేరాలకు సంబంధించిన కిటుకులను తెలుసుకుని, అతగాడి గ్యాంగ్‌ను బయట వుండి నడపసాగింది. జోయాపై డ్రగ్స్ కేసులతోపాటు దొంగతనాలు, కిడ్నాపులు, దోపిడీలకు సంబంధించిన కేసులున్నాయి. ఢిల్లీతో పాటు యుపి, మహారాష్ట్ర పోలీసులకు జోయా వాంటెడ్ నేరగత్తె. ఈమె కోసం మూడురాష్ట్రాల పోలీసులు కొంతకాలంగా గాలిస్తున్నారు. ఈ క్రమంలో గురువారంరాత్రి జోయా దక్షిణఢిల్లీలో ఒకచోట కోటి రూపాయల విలువచేసే నాణ్యమైన హెరాయిన్ 270 గ్రాములతో పోలీసులకు దొరికిపోయింది. యుపిలోని ముజఫర్‌నగర్ నుంచి హెరాయిన్‌ను జోయా ఢిల్లీకి తరలించినట్లు పోలీసుల విచారణలో తేలింది. కాగా జోయా గ్యాంగ్‌స్టర్ హాషీం బాబాకు మూడోభార్య. జోయాకి ఇది రెండో వివాహం. జోయా ఢిల్లీ, ముంబయిల్లో జరిగే హైప్రొఫైల్ పార్టీలకు వెళ్లడం అలవాటుగా వుంది. ఈమె వెంట ఎల్లవేళలా నలుగురు సాయుధులు బాడీగార్డులుగా ఉంటారు. ముంబయి అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం సోదరి హసీనాపార్కర్, బిష్ణోయ్ గ్యాంగ్‌లతోనూ జోయాకు సంబంధాలున్నాయని పోలీసులు గుర్తించారు.

### 'క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్' ఛైర్మన్‌పై లుకవుట్ నోటీసు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన క్యాపి టల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ గోల్‌మాల్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా వున్న సంస్థ ఛైర్మన్ అమర్‌దీప్ కుమార్‌పై సైబరాబాద్ పోలీసులు లుకవుట్ నోటీసులు జారీచేశారు. ఫాల్కన్ ఇన్వా యిస్ డిస్కౌంట్ పేరుతో క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ దేశ వ్యాప్తంగా వేల సంఖ్యలో డిపాజిటర్ల నుంచి 1700 కోట్ల రూపాయలను వసూలు చేసి బిచాణా ఎత్తేయడం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి కంపెనీ ఉపాధ్యక్షుడు పవన్ కుమార్ ఓదెల, డైరక్టర్ కావ్య నల్లూరిని సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యు) అధికారులు అరెస్టు చేయగా పరారీలో వున్న 37 మంది నిందితుల కోసం గాలిస్తున్నారు. ఇందులో కీలకంగా వున్న మొదటి ముద్దాయి అమర్‌దీప్ కుమా ర్‌పై లుకవుట్ నోటీసులు జారీచేశారు. ఈ కంపెనీ ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్ పేరుతో ఏజెంట్లను నియమించు కుని మొదట తెలంగాణాలో ఆ తరువాత దేశ వ్యా ప్తంగా బీద, మధ్య తరగతి ప్రజలు, చిరు వ్యాపారుల నుంచి 1700 కోట్ల రూపాయల డిపాజిట్లను వసూలు చేయడం విదితమే. అమర్‌దీప్ కుమార్ తో పాటు కంపె నీ సీఈఓ, సీఓలపైనా లుకవుట్ నోటీసులు జారీచేశారు. వీరి కోసం దేశ వ్యాప్తంగా అన్ని విమానాశ్రయాలలో అప్రమత్తం చేశారు. ఈ కంపెనీ గోల్‌మాలపై ఇప్పటికే ఈడీ రంగంలో దిగి విచారణ చేబట్టడం తెలిసిందే.

# 35 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా వికసిత్ భారత్!

### బెయిన్ అండ్‌కో అధ్యయన నివేదిక

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్ 2047 నాటికి 23 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న ఆర్థిక వ్యవస్థ 35 లక్షలకోట్ల డాలర్లకు చేరుతుందని అంతర్జాతీయ సర్వేసంస్థ వెల్లడించింది. సేవలరంగం వృద్ధి గణనీయంగా పెరుగుతుందని ఈ రంగం నుంచే సుమారు 60 శాతం వరకూ భారత జిడిపి వాటా ఉందని ఉత్పత్తి రంగం 32శాతం అందిస్తున్నట్లు ఈ సంస్థ వెల్లడించింది. ఈ రెండు రంగాలు కూడా వికసిత్ భారత్‌కు కీలక చోదకశక్తులుగా నిలిచినట్లు బెయిన్ అండ్ కంపెనీ వెల్లడించింది. సుమారు 20 కోట్లమంది రానున్న దశాబ్దాల్లో ఉద్యోగరంగంలోకి వస్తారని, అత్యున్నతస్థాయి నైపుణ్యాలున్న ఉద్యోగాలు సృష్టించే దేశంగా భారత్ నిలుస్తుందని, ఇదే ఆర్థికవృద్ధికి మరింత దోహదం చేస్తుంద న్నారు. టెక్నాలజీ రోడ్‌మ్యాప్‌కూడా కీలకంగా పనిచేస్తుందని, ఎఐ ఆధారిత చిప్‌డిజైన్, టచ్‌లెస్ తయారీరంగం వెనుకబడిన తరగతుల పునరేకీకరణ వంటివి వృద్ధికి దోహదంచేస్తాయని వెల్లడించింది. ఇక ఉత్పత్తిరంగం ఎగుమతుల శాతం 24 నుంచి 45లేదా 50శాతానికి 2047 నాటికి చేరుతుందని, జిడిపి వాటాకూడా మూడునుంచి పదిశాతానికిసైతం పెరుగుతుందని అంచనావేసింది.

అలాగే భారత పునరుత్పాదక విద్యుత్ వాటాక ఊడా మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 24 శాతంనుంచి 2047 నాటికి 70శాతానికి పెరుగుతుందని బెయిన్ అండ్ కో విశ్లేషించింది. ఇక ఆటోమొబైల్ విడిభాగాల ఎగుమతి విభాగం కూడా 2047 నాటికి 250 బిలియన్ డాలర్ల వృద్ధిని నమోదుచేస్తుంది. విద్యుత్ వాహన వినియోగం కూడా కీలకంగా మారుతుంది. ఎలక్ట్రానిక్స్, విద్యుత్, రసాయనాలు, ఆటో మోటివ్, సేవల రంగం వంటి ఐదు రంగాలే వికసిత్‌భారత్‌కు కీలక రంగాలుగా వెల్లడించింది. 2030 నాటికి 50 మిలియన్ల నిపుణులైన కార్మికశక్తి కొరత ఉంటుందని, ఇందుకోసం వివిధ రంగాల్లో వృత్తినైపుణ్య శిక్షణరంగాలు వస్తాయ న్నారు. స్థానికంగానే తయారీకి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల నిత్యావసరాల కోసం దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని వెల్లడించింది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం కృత్రిమమేధలో చొచ్చుకువస్తుందని, గ్రీన్ ఎనర్జీ, ఇతర సంక్లిష్ట రంగాలలో ఆర్‌అండ్‌డి పెట్టుబడులు కూడా పెరుగుతాయని దీనివల్ల జిడిపి వృద్ధి మరింత పెరుగుతుందని అంచనావేసింది.

సంస్థ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ సంగీతాగుప్తా



మాట్లాడుతూ విభిన్నరంగాల నుంచి, టెక్నాలజీ అనుసంధానిత వైఖరి భారత్‌కు సుస్థిర సమ్మిళిత వృద్ధిని తెచ్చిపెడుతుందని వ్యాఖ్యానించారు.

## కెసిఆర్, హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా

## ఫిర్యాదుదారు చనిపోతే మేడిగడ్డ బ్యారేజీ ఘటనపై

# విచారణ ఎలా చేస్తాం?: హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ కేసీఆర్, హరీశ్ రావులు ఈ పిటిషన్ దాఖలు చేశారు. గతంలో మేడిగడ్డ బ్యారేజీ లోపాల విషయంలో ఫిర్యాదు చేసిన రాజలింగమూర్తి మృతి చెందినట్లు మీడియా ద్వారా తెలిసిందని, ఫిర్యాదుదారు చనిపోయిన తర్వాత విచారణ ఎలా నిర్వహిస్తామని తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఫిర్యాదుదారు మృతి చెందినా విచారణ నిర్వహించొచ్చని ఈ మేరకు కర్ణాటక హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులున్నాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. వాదనలు వినిపించడానికి గడువు కావాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు కోరడంతో తదుపరి విచారణను హైకోర్టు 24వ తేదికి వాయిదా వేసింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడానికి నాసిరకం నిర్మాణాలు, సరైన డిజైన్ లేకపోవడమే కారణమని భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి అనే వ్యక్తి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణను స్వీకరిస్తున్నట్లు జిల్లా కోర్టు గతేడాది జూలై 10న ఉత్తర్వులు జారీ చేసింది. కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు మరికొంత మందికి నోటీసులు జారీ చేసింది.

ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీశ్ రావులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫిర్యాదుదారు రాజలింగమూర్తి మొదట భూపాలపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రైవేటు పిటిషన్ దాఖలు చేయగా దానిని కొట్టేశారని, ఆ తర్వాత జిల్లా కోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారని కేసీఆర్ తరఫు న్యాయవాది గత విచారణ సందర్భంగా కోర్టుకు తెలిపారు. జిల్లా కోర్టుకు విచారణ పరిధి లేకున్నా ఉత్తర్వులు జారీ చేశారని వాదించారు. కేసీఆర్ తరఫు న్యాయవాది వాదనతో ఏకీభవించిన హైకోర్టు, జిల్లా కోర్టు ఉత్తర్వులను సస్పెండ్ చేసింది. కేసీఆర్ పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో జరిగిన వాదనల సందర్భంగా జిల్లా కోర్టులో ఫిర్యాదుచేసిన రాజలింగమూర్తి మృతి చెందినట్లు కేసీఆర్ తరఫు న్యాయవాది కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌పై ఇక విచారణ అవసరం లేదని న్యాయమూర్తి అన్నారు. ఒకవేళ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసినా తిరిగి భూపాలపల్లి జిల్లా కోర్టులో విచారణ నిర్వహించాల్సి ఉంటుందని ప్రస్తావించగా, అక్కడ ఫిర్యాదు చేసిన వ్యక్తే మృతి చెందినప్పుడు ఇక విచారణ ఎలా? నిర్వహిస్తారని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఫిర్యాదుదారు మృతి చెందినా విచారణ కొనసాగించిన తీర్పులున్నాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించడంతో హైకోర్టు తదుపరి విచారణను 24వ తేదీకి వాయిదా వేసింది.

## అందరికీ రుణమాఫీ.. అదో అందమైన కట్టుకథ : మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** ఇప్పటికీ చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రైతుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయని బిఆర్‌ఎస్ సీనియర్ నేత,మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. గాంధీ భవన్ వద్ద ధర్నాకు దిగిన రైతు విషయంలో హరీశ్‌రావు స్పందించారు. అందరికీ రుణమాఫీ చేసినట్లు అందమైన కట్టుకథను ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... మిమ్మల్ని నిలదీసేందుకు తుంగతుర్తి నుంచి గాంధీ భవన్ దాకా వచ్చిన రైతు తోట యాదగిరికి ఏం సమాధానం చెబుతారు అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మీరిచ్చిన ఆరు గ్యారెంటీలు ఎన్నికల గారడీనేనని, 420 హామీల అమలు వట్టి బూటకమేనని తెలంగాణ ప్రజలు తక్కువ సమయంలోనే తెలుసుకున్నరు. మిమ్మల్ని నిలదీసేందుకు ఒక్కొక్కరిగా గాంధీ భవన్‌కు చేరకముందే పాపపరిహారం చేసుకోండి. రైతులు, మహిళలకు, విద్యార్థులకు, వృద్ధులకు, ఉద్యోగులకు.. అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోండి అని రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సూచించారు. ఈరోజు గాంధీ భవన్ దాకా వచ్చిన వారు, రేపో మాపో మీ జూబ్లీహిల్స్ ప్యాలెస్ దాక వస్తరు. ప్యాలెస్ పాలన వదిలి ప్రజా పాలన కొనసాగించు. ఏడు పదుల వయస్సులో రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరిగిండు, అధికారులను వేడుకున్నడు. అయినా వెనకడుగు వేయకుండా గాంధీ భవన్ దాకా వచ్చి పోరాటం చేస్తున్న రైతు యాదగిరి పట్టుదలకు అభినందనలు. ఇదే స్ఫూర్తితో అన్ని వర్గాల ప్రజలు మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాలని, హామీలు అమలు చేసే దాకా కొట్లాడాలని బీఆర్‌ఎస్ పక్షాన పిలుపునిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# మేడిగడ్డపై ఎన్‌డిఎస్‌ఎ నివేదిక అందించండి

### సిడబ్ల్యుసి ఛైర్మన్ ముఖేష్‌కు తెలంగాణ ఇఎన్‌సి విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మేడిగడ్డ కుంగుబాటు, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ వైఫల్యంపై సిడబ్ల్యుసి ఆధ్వర్యంలో ఎన్‌డిఎస్‌ఎ నియమించిన చంద్రశేఖర్ అయ్యర్ కమిటి నివేదిక వెంటనే అందిం చాలని తెలంగాణ ఇన్‌సి జనరల్ జి అనిల్‌కుమార్ సిడబ్ల్యుసి ఛైర్మన్ ముఖేష్‌కుమార్‌ను అభ్యర్థించారు. శుక్రవారం కేంద్రజలసంఘం ఛైర్మన్ ముఖేష్‌కుమార్ సిన్హాను జలసౌధలో సన్మా నించారు. ఈ సందర్భంగా ఎన్‌డిఎస్‌ఏ నివేదికపై వారి మధ్య చర్చ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా ఎన్‌డిఎస్‌ఏ నివేదిక ఆధారంగా సాంకేతిక నిపుణులు ఒక మేథోమథనం నిర్వహిం చుకొని ప్రభుత్వానికి సాంకేతికపరమైన అంశాలను వివరించాలని ముఖేష్ కుమార్‌సిన్హా సూచిం చినట్లు తెలిసింది. టెక్నికల్ అంశాలను ఏ రూపంలో ముందుకు పెట్టాలో దానికోసం సిడబ్ల్యుసి ఆధ్వర్యంలోనే మేథో మథనం జరిపితే బావుం టుందని ఇఎన్‌సి అనిల్‌కుమార్ కోరినట్లు సమాచారం. సాధ్యమైనంత వరకు సహాయ సహకారాలు అందించి ప్రాజెక్టు ఉపయోగంలోకి తీసుకొచ్చేం దుకు ప్రయత్నాలు చేద్దామని సంభాషణలో తన అభిప్రాయం వ్యక్తీకరించినట్లు తెలిసింది. అయితే మేడిగడ్డలో చాల బ్లాకులు తొలగించాల్సి న ఆవశ్యకత ఉందని దాదాపు కొత్తగా మేడిగడ్డను పునర్మిర్మాణం చేసిన స్థాయిలో మరమ్మతులు ఉండే అవకాశం ఉందని నిపుణుల సంభాషణలో వెల్లడైనట్లు విశ్వసనీయ సమాచారం.



కేంద్ర జల వనరుల సంఘం ఛైర్మన్ ముఖేష్‌కు సన్మానం చేస్తున్న ఇఎన్‌సి, డిప్యూటీ ఇఎన్‌సి

ఏదీఏమైనా కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ సంబంధించిన నివేదికపై సిడబ్ల్యుసి త్వరగా పూనుకొనేలా తెలంగాణ ఇంజనీర్లు విన్నపాలు చేసినట్లు తెలిసింది.

## సైబర్ నేరాల నివారణపై పోలీసుల ట్వీట్

### ప్రజలు అవగాహన పెంచుకోవాలి

### ఈజీమనీకి ఆశపడవద్దని వినతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** సైబర్ నేరాలను నివారించేందుకు కొత్త మార్గాలతో ముందుకు వెళుతున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ఈ విషయమై ప్రజలను హెచ్చరిస్తూ సంచలన ట్వీట్ చేసింది. టెక్నాలజిని వాడి నేరాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ల ఆగడాలను అవగాహనతో వుండడం వల్ల ఎ దుర్కొనవచ్చని ఆ ట్వీట్‌లో టిజిసిఎస్‌బి పేర్కొంది.

కృత్రిమ మేధ సహాయంతో నేరగాళ్లు వున్నది లేనట్లు, లేనిది వున్నట్లు చెప్పడం ఇటీవల కాలంలో పరి పాటిగా మా రిందని, ఇటువంటి ట్రిక్కులకు ఎవరు బెదిరిపోవద్దని టిజిసిఎస్‌బి ట్వీట్‌లో వెల్లడించింది. సైబర్ నేరగాళ్లపై పోలీసులు అవగాహన కలిగిస్తున్నా మోసపోతున్న వారి స ంఖ్య తగ్గడం లేదని, ఇందుకు ఈజీ మనీకి కొందరు ఇష్టపడుతుండడం కారణమని టిజిసిఎస్‌బి తెలిపింది.

ప్రజలు ఈజీ మనీకి దూరంగా వుండాలని, నేరగాళ్ల బెదిరిం పులకు లొంగవద్దని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా 1930కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని టిజిసిఎస్‌బి అధికారులు కోరారు. సైబర్ నేరాలపై అందరు అవగాహన పెంచుకోవడంతో పాటు తమ సహచరులకు దీని గురించి చెప్పాలని టిజిసిఎస్‌బి ట్వీట్‌లో పేర్కొంది.

# వ్యవసాయ మార్కెటింగ్ విధాన ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి

### 22 నుండి 28 వరకు రాష్ట్రవ్యాప్త ప్రచారం

### ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన రైతు సంఘం నేతలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం గత యేడాది నవంబర్ 24న విడుదల చేసిన జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం (ఎన్‌పిఎఫ్‌ఎం) ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. ముసాయిదాలోని అంశాలను రైతులను వివరించడానికి ఈ నెల 22 నుంచి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ తెలిపారు. ఆర్‌టిసి క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహ్మారెడ్డి, అరిబండి ప్రసాదరావులతో కలిసి శుక్రవారం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముసాయిదా వల్ల గతంలో రద్దయిన చట్టాలను.. మార్కెట్ విధానాల రూపంలో రైతులపై రుద్దే అవకాశం ఉందని సాగర్ అన్నారు. ముసాయిదా రైతుల కోసం కాకుండా, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించి నట్టుగా ఉందని విమర్శించారు.

దేశంలోని రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ద్వారా కనీస మద్దతు ధరకు (ఎంఎస్‌పీ) చట్టబద్ధ హామీ ఇవ్వడంలో స్పష్టత లేకపోవడం రైతుల భద్రతకు ప్రధాన అడ్డంకిగా మారిందన్నారు. ఎంఎస్‌పీ రక్షణ లేకుండా రైతులు మార్కెట్లో ఉన్న అనిశ్చిత పరిస్థితులను అధిగమించడం చాలా కష్టమన్నారు.

చిన్న రైతులను ఇంకా అస్థిరతలోకి నెట్టివేసేలా ముసాయిదా ఉందని మండిపడ్డారు. ఈ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను పక్కన పెట్టి, వ్యవసాయ మార్కెటింగ్‌ను కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో అధిక ప్రాధాన్యత పొందే అవకాశం ఉందని సాగర్ ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తుందన్నారు. గిడ్డంగుల ప్రైవేటీకరణ ద్వారా, రైతులు తమ ఉత్పత్తులను సకాలంలో నిల్వ చేసుకునే అవకాశాలను కోల్పోతారని... ధరల అస్థిరతలో రైతులకు భద్రత ఇవ్వాల్సి న పద్దతులు పూర్తిగా ప్రైవేట్ కంపెనీల నియంత్రణలోకి వెళ్లడం వల్ల, రైతులు తమ ఉత్పత్తులకు సరైన ధరలు పొందలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. మార్కెట్ నియంత్రణలను తొలగించడం ద్వారా, పెద్ద సంస్థలు మార్కెట్‌ను పూర్తిగా అధీనంలోకి తీసుకోవడమే కాకుండా, రైతులపై ఆర్థిక ఒత్తిడి పెంచే పరిస్థితిని సృష్టిస్తోందన్నారు. మార్కెటింగ్ వ్యవస్థలో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం మరింత పెరగడంతోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అసమానతలు పెరుగుతాయన్నారు. రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సాగర్ డిమాండ్ చేశారు. రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే ఒక సమగ్రమైన మార్కెటింగ్ విధానాన్ని రైతు సంఘాలు, నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# పసుపు ధరలు పతనం

### గరిష్ఠంగా 12వేలు దాటని కనీస ధర

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** పసుపు రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతున్నది. మార్కెట్ వ్యాపారుల మాయాజాలంతో క్వింటా పసుపు రూ. 8 వేల నుండి రూ.10 వేల లోపే పలుకుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోనే పేరొందిన నిజామాబాద్ మార్కెట్‌కు ప్రతిరోజూ 8వేల నుంచి 10 వేల క్వింటాళ్ల వరకు పసుపు వస్తుండగా, పసుపు చూరాకు గరిష్ఠంగా రూ.10,566, కనిష్టంగా రూ.8వేలు పలుకుతోంది.

అలాగే గోల (బల్బ్)కు గరిష్ఠంగా రూ.10,727, కనిష్టంగా రూ.8 వేలు, కాడి (ఫింగర్)కి గరిష్ఠంగా రూ.12,388, కనిష్టంగా రూ.10 వేలలోపే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఎకరా విస్తీర్ణంలో పసుపు సాగుకు రూ.1.20 లక్షలకు పైగా ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు. 9 నెలలపాటు ఎంతో శ్రమించి పండించే పసుపు సాగును ప్రోత్సహించాలంటే కనీసం క్వింటాకు రూ.15వేలు ప్రకటించాలనే డిమాండ్ వస్తోంది.

# కెసిఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై హైకోర్టులో పిల్ దాఖలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** విపక్ష నేత, బిఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై హైకోర్టులో పిటిషన్ దాఖ లైంది. ఫార్మర్స్ ఫెడరేషన్‌కు చెందిన విజయ్‌పాల్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకుంటే స్పీకర్ చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. కేటీఆర్ దీనిపై స్పందించి కేసీఆర్ బదులు వేరేవాళ్లను అక్కడ పోటీ చేయించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీలో ప్రజల కోసం పోరాటం చేయాలని కానీ అసెంబ్లీకే రాకుంటే అన ర్హుడిగా ప్రకటించాలని పిటిషన్‌లో తెలిపారు. 2023 డిసెంబరు 16న ప్రతిపక్ష నేతగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టారని, ఆయన ఇప్పటివరకు అసెం బ్లీకి రాకున్నా స్పీకర్ కానీ, ఆయన కార్యాలయం కానీ ఎలాంటి ప్రొసీడింగ్స్ చేపట్టలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రజల గొంతుకను అసెంబ్లీలో వినిపించేందుకు ఎమ్మెల్యేల జీతాలు కూడా పెంచారని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ బాధ్యతలను నిర్వహించలేకపోతే ఆయనను ఆ బాధ్యతల నుంచి తొలగిం చాలని కోర్టును కోరారు. శాసన వ్యవస్థ, అధికారులు తీసుకునే రాజకీయ, ఆర్థిక నిర్ణయాలను సమీ క్షించే అధికారం న్యాయ వ్యవస్థకు ఉందని చెప్పా రు. ప్రతివాదులుగా కేసీఆర్, కేటీఆర్‌లతో పాటు స్పీకర్, స్పీకర్ కార్యాలయాన్ని చేర్చారు. ప్రస్తుతం ఈ పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది.

# ఫోన్‌ట్యాపింగ్ కేసులో ముగ్గురికి బెయిలు

**హైదరాబాద్ (పంజగుట్ట), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగ్గురికి బెయిల్ మంజూరు కావడంతో జైలు నుంచి విడుదలయ్యారు. శుక్రవారం చంచల్‌గూడజైలు నుంచి వంశీకృష్ణ, సంతోష్‌కుమార్, పరుశురాం విడుదలయ్యారు. పంజాగుట్టలో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. జైలు నుంచి విడుదలైన వంశీకృష్ణ మీడియాతో మాట్లాడుతూ గతంలో మాజీమంత్రి హరీశ్‌రావు పేషీలో పనిచేశామని.. అయితే ఫోన్‌ట్యాపింగ్ కేసుతో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కేవలం మాజీమంత్రి హరీశ్‌రావు పేరు చెప్పాలని తమను పోలీసులు ఇబ్బందులు గురి చేశారన్నారు. గతంలో హరీశ్‌రావు పేషీలో చేశానని అక్రమంగా ఈ కేసులో ఇరికించారని ఆరోపించారు. తమపై ఫిర్యాదు చేసిన చక్రధర్‌గౌడ్ దగ్గర కూడా గతంలో తాను పనిచేసినట్లు తెలిపారు. చక్రధర్ గౌడ్ ఎన్ని మోసాలు చేశాడో తనకు తెలుసన్నారు. అవన్నీ కూడా ఎప్పుడు బయటపెట్టలేదని.. ఇప్పుడు అన్ని విషయాలు బయటపెడతానని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసే అంతస్థాయి తమది కాదన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాగైనా హరీశ్‌రావు పేరు చెప్పించాలని ఉద్దేశంతో తమను వేధింపులకు గురిచేశారని చెప్పారు. పోలీసుల వేధింపులపై ఇప్పటికే నాంపల్లి కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశామని.. విచారణ పేరుతో గంటల తరబడి తమను వేధింపులకు గురిచేశారని వాపోయారు. హరీశ్‌రావు పేరు చెప్పకపోతే నీకు జీవితం ఉండదు, నీ ఉద్యోగం లేకుండా చేస్తామని డిసిపి, ఎసిపి బెదరింపులకు దిగారు. నా కుటుంబసభ్యులను డిసిపి పరుషపదజాలంతో దూషించారు. పోలీసుల టార్గెట్ ఒకటే హరీశ్‌రావు పేరు మా నోట చెప్పించాలని చెప్పుకొచ్చారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో మాజీమంత్రి హరీశ్‌రావుపై ఆధారాలు లేకపోవడంతో తమ ద్వారా ఆయన పేరు చెప్పించాలని పోలీసులు ప్రయత్నం చేశారన్నారు. తాము కిందిస్థాయి ఉద్యోగుల మేనని స్పష్టం చేశారు. ఇకనుంచి చక్రధరగౌడ్‌పైన, పోలీసులపైన న్యాయ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. తమను టెర్రరిస్టుల్లాగా, దొంగల్లాగా పోలీసులు ట్రీట్ చేశారని వంశీకృష్ణ పేర్కొన్నారు.

# సుగంధ ద్రవ్యాల సాగులో వెనుకబడిన రాష్ట్రం

### చింతపండు సైతం దిగుమతే గతి

### పట్టించుకోని ఉద్యాన అధికారులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** సుగంధ ద్రవ్యాల సాగులో తెలంగాణ వెనుకబడిపోయింది. ఉద్యాన శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో సుగంధ ద్రవ్యాల సాగుపై రైతులు ముందుకు రావడం లేదు. దీంతో రాష్ట్రంలో ప్రధానంగా చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాలు, జీలకర్ర తదితర మసాలా దినుసులకు కొరత ఏర్పడింది. ఎండు మిర్చి, పసుపు సాగులో మాత్రం రాష్ట్రం అగ్రగామిగా ఉన్నా, చివరకు చింత పండును సైతం దిగుమతి చేసుకోవాల్సి న దుస్థితి తప్పడం లేదు. రాష్ట్రంలో ప్రతి రోజు సగటున ఒక్కొక్కరు 21.21 గ్రాముల సుగంధ ద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు ఉద్యాన అధికారుల అంచనా. ఇలా రోజుకు 731 టన్నులు డిమాండ్ ఉండగా, ఏటా 2.63 లక్షల టన్నులు అవసరం ఉంటుందని అంచనా. చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాలు, జీలకర్ర, ఆవాలు, మిరియాలు తదితర సుగంధ ద్రవ్యాలు 1.78 లక్షల టన్నులు అవసరం ఉన్నది. ఈ డిమాండ్‌కు సరిపడా పంట రావాలంటే రాష్ట్రంలో 1.09 లక్షల ఎకరాల్లో ఈ పంటలు సాగుచే యాల్సి ఉంటుందని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, జాపత్రి, జీలకర్ర వంటి విలువైన సుగంధ ద్రవ్యాలను ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. కానీ చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాల వంటివాటిని కూడా దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది.

ఈ విధంగా ఏటా 61,564 టన్నుల చింతపండును దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే రాష్ట్రంలో అల్లం 2,103 ఎకరాల్లో సాగవుతూ తద్వారా 20,489 టన్నుల ఉత్పత్తి అవుతోంది. అయితే అల్లం వినియోగం మాత్రం 68,419 టన్నులుగా ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో సాగైనది పోను ఇంకా 47,930 టన్నుల మేర ఇతర రాష్ట్రాల నుంచి వస్తోంది. ఇక వెల్లుల్లి విషయానికి వస్తే 27 ఎకరాల్లో మాత్రమే సాగవుతూ, 148 టన్నులు ఉత్పత్తి అవుతుండగా, వినియోగం మాత్రం 39,417 టన్నుల మేర ఉంటోంది. ధనియాలు రాష్ట్రం వ్యాప్తంగా 13,532 టన్నుల వినియోగం ఉండగా, 4,971 ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. తద్వారా 2,431 టన్నులు ఉత్పత్తి జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో దాదాపు లక్ష ఎకరాల్లో సుగంధ ద్రవ్యాల సాగు చేయాల్సి న అవసరం ఉందని అంచనా. ఇందుకు ఉద్యాన శాఖ అధికారులు ప్రోత్సహం కల్పించి సుగంధ ద్రవ్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉంది.

### కృష్ణా ట్రిబ్యునల్ కేసు మార్చి 24, 25, 26కు లిస్టింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** కృష్ణా జలవివాదాల ట్రిబ్యునల్ -2 కేసు సంబందించిన వాదనలు మార్చి 24నుంచి 26వరకు వినిపించాలని కోరుతూ కెడబ్ల్యుటి -2 చైర్మన్ జస్టిస్ బ్రిజెశ్‌కుమార్, సభ్యులు జస్టిస్ తాళపత్ర, రామ్‌మెహన్‌రెడ్డిలు ఉత్తర్వులు జారీచేస్తూ కేసును లిస్టింగ్ చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
సాగునీటి పారుదల వలయం, నిజామాబాద్ జిల్లా
టెండర్ ప్రకటన
టెండర్ నోటీసు నం.10/2024-25 తేది: 18.02.2025 పనులకు గాను రూ.55.99 లక్షలకు అలీసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం యొక్క స్టేజి-IIIలో పంప్ నం.1 మరమ్మతుల పనులకు గాను లభ్యమగు తేది: 19.02.2025 నుండి 01.03.2025 వరకు టెండర్ ఆహ్వానించడమైనది. మిగతా వివరాలకు https://tender.telangana.gov.in లో చూడగలరు.
సం/- పర్యవేక్షక అభియంత, సాగునీటి పారుదల వలయం, నిజామాబాద్ జిల్లా
DIPR.No.10512-PP/CL/Advt/1/2024-25, తేది: 21.02.2025

వార్త

బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు, బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.

-జార్జి ఎలియట్

# వణకుతున్న ఊళ్లు!

జలం జీవనాధారం. నీరు ఎక్కడ ఉంటే అక్కడ జీవం ఉంటుంది. అందుకే 'ఎప్పుడు ఎడతెగక పారు ఏరు...' చోటును ఎంపిక చేసుకొని ఉండమన్నారు సుమతీశతకకారుడు. వేసవికాలం వస్తున్నదంటే మంచినీటికి కటకటలాడాల్సిన పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని ప్రజలు ఆందోళన చెందడం సర్వసాధారణమైపోతున్నది. పాలకుల అసమర్థత, కొందరు అధికారుల అవినీతి, అవగాహనరాహిత్యం, ముందుచూపు లేకపోవడం, ప్రకృతి సహాయనిరాకరణ తోడుకావడంతో తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది ప్రజలు గుక్కెడు మంచినీటికి పడరాని పాట్లుపడక తప్పడం లేదు. దాహం తీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న కలుషిత నీటిని తాగి రోగాలబారిన పడుతున్నారు.దాదాపు ముప్పై ఆరు రకాల రోగాలు కేవలం జలకాలుష్యం వల్లనే వస్తున్నట్లు వైద్యనిపుణులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు మంచినీటి సమస్య దేశవ్యాప్తంగానే తీవ్రంగా ఉన్నట్లు చొప్పొచ్చు. స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటిపోయినా అది సాధించాం, ఇది సాధించామని గొప్పలు చెప్పుకుంటున్నా ఇప్పటికీ ప్రజలందరికీ కనీసం అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన నీరు అందించలేని దుర దృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం. అలాని మంచినీటి కోసం ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని చెప్పడం లేదు.గత ఏడున్నర దశాబ్దాల్లో కేవలం మంచినీటి కోసమే లక్షలాది కోట్లు వెచ్చించారు, వెచ్చిస్తూనే ఉన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది అధికారులు పనిచేస్తూనే ఉన్నారు. కానీ వ్యయం చేస్తున్న నిధులు ఏమేరకు కిందిస్థాయికి వెళ్లి ప్రజల అవసరాలు తీరుస్తున్నాయనేదే ప్రశ్న. కరవుల్లోనే కాదు వర్షాలు సమృద్ధిగా కురిసిన సంవత్సరాల్లో అన్నింటిలో మంచినీటి సమస్య తీవ్రంగానే ఉంటుంది. బోరుబావులపై ఆధారపడాల్సిన పరిస్థితులు అంతకంతకు పెరిగిపోతున్నాయి. యేటా తెలుగు రాష్ట్రాల్లోనే పరిశీలించినా వేలాది బోరుబావులు కొత్తగా పుట్టుకొస్తున్నాయి. భూగర్భజలాల వినియోగం ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. అదే స్థాయిలో నీటి వృధాకూడా పెరుగుతున్నది. ప్రధానంగా వ్యవసాయరంగంలో ఉచిత విద్యుత్ కూడా ఈ నీటి వృధాను పెంచుతున్నదనే చెప్పొచ్చు. తగ్గిపోతున్న భూగర్భజలాల భర్తీకి అవసరం మేరకు ప్రయత్నాలు జరగకపోవడంతో దేశంలోని అనేక రాష్ట్రాల నీటి మట్టాలు పడిపోతున్నాయి. తెలంగాణలో ఇంకా ఎండాకాలం మొదలుకాకుండానే నీటి మట్టాలు భారీగా తగ్గడం ఆందోళన కలిగిస్తున్నది. డిసెంబరులో 6.7 మీటర్ల లోతుగా ఉన్న రాష్ట్ర భూగర్భ సగటు జలమట్టం జనవరిలో 7.46 లోతుకు తగ్గిపోయింది. ఈ స్థాయిలో ఇప్పుడే భూగర్భజలాలు అడుగంటితే ఏప్రిల్, మే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులతోపాటు సామాన్య ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారు. అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా కూడా ఈసారి భూగర్భజలాల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో పంటల దిగుబడిపై ఆ ప్రభావం పడుతుందనివ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారత్‌లో యేటా దాదాపు 250 ఘనపు కిలోమీటర్ల మేర భూగర్భజలాలు వినియోగిస్తున్నారు. దీనిపై ఏవో నామమాత్రపు నిబంధనలున్నా పట్టించుకోకపోవడంతో వినియోగం అంతకంతకు పెరిగిపోతున్నది. వాస్తవంగా దేశంలో ఆరువేల ఐదువందల డెబ్బైరెండు భూగర్భజలాల బ్లాకులు ఉండగా వాటిలో మూడోవంతు బ్లాకులు అవసరానికి మించి భూగర్భజలాలు వాడుతున్నారు. బోరుబావుల సంఖ్య యాభైయేళ్లలో 120 రెట్లకుపైగా పెరిగి దాదాపు మూడున్నర కోట్లకు పైగా బోరుబావులు చేరుకున్నాయి. దీంతో సన్నకారు, చిన్నకారు, మధ్యతరగతి రైతులు కొంతమేరకు లాభపడిన మాట వాస్తవమే అయినా నానాటికీ బోరుబావుల మీద ఆధారపడే పరిస్థితి పెరిగితే ఇది అనేక అనర్థాలకు దారితీస్తుంది. దేశంలో భూగర్భజలాల వినియోగం మూడింతలు పెరగడం, నీటి నియమాలు నీరుగారిపోతున్నాయనేందుకు సజీవ సాక్ష్యాలుగా పేర్కొనవచ్చు. పంజాబ్‌లో డెబ్బైఐదు శాతం, రాజస్థాన్‌లో అరవైశాతం, కర్ణాటక, తమిళనాడులో నలభై శాతం అధికంగా భూగర్భజలాలు వాడుకుంటున్నట్లు సమాచారం. దేశ రాజధాని ఢిల్లీతోసహా పంజాబ్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లో యేటా యాభైనాలుగు లక్షలకోట్ల లీటర్లకుపైగా భూగర్భ జలాలు తోడేస్తున్నారు. దేశంలో మూడోవంతు జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు తాగుయోగ్యమైనవి కావని కేంద్రం ఏనాడో ప్రకటించింది. పాతాళంలోకి దిగ జారిపోతున్న జలాలను పైకి తోడడానికి అటు విద్యుత్ కానీ, ఇటు డీజిల్ కానీ వినియోగం పెరిగిపోతుంది. మంచి నీటికొరతను ఆసరాగా చేసుకొని కొందరు దళారులు మంచినీటి వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా నీటి వ్యాపారం వేల కోట్లల్లోకి చేరుకున్నది. వేసవి వస్తున్నదంటే తెలుగు రాష్ట్రాల్లో కూడా అనేక ప్రాంతాలు ముఖ్యంగా నగరాలు, పట్టణాలు, గ్రామాలే కాదు శివారు పల్లెలకు కూడా నీటివ్యాపారం విస్తరించింది. ఏ కోణంలో చూసినా మంచినీటి పరిస్థితి రానురాను ప్రశ్నార్థకంగా మారుతున్నది. భూగర్భజలాల మట్టాలు తగ్గిపోవడం మానవాళికి ఏమాత్రం క్షేమం కాదు. మరొక పక్క కోట్లాది ఎకరాలకు సరిపోయే వేలాది టిఎంసిల నీటిని దేశంలో వివిధ నదుల ద్వారా పొంగి పొర్లి సముద్రం పాలవుతున్నది. ప్రజల్లో అవగాహన లోపించడం ఫలితంగానే భూగర్భజలాల సమస్య రానురాను తీవ్ర రూపం దాలుస్తున్నది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాజకీయాలకు అతీతంగా నేతలు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాలి.

క్షమించడం, క్షమాపణ పొందడం ఒకే నాణేనికి రెండువైపులు. వాటి మధ్య సమన్వయం సాధించడమే ముఖ్యమైన కర్తవ్యం.



ఇ. గిబ్బన్

నీ తోటి మనుషులతో నీవే ఎక్కువ తెలివైనవాడిగా, ఎక్కువ చదువుకున్న వాడిగా ఎప్పుడూ వ్యవహరించకు.



విలియం రోజర్

# ప్రజావాక్కు



## ఉరుము ఉరిమి ఉక్రెయిన్ మీద పడింది

అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ రాకతో ప్రపంచ దేశాల భౌగోళిక రాజకీయ సంబంధాలు పెద్ద కుదుపుకి లోనవుతున్నాయి.ఒక్కోచోట పిడుగులు, ఒక్కోచోట కుంభవృష్టి. అమెరికాతన ప్రయోజనాల్ని సాధించుకోడానికి ఏ దిశగా, ఎంత వేగంగా ప్రయత్నిస్తుందో చెప్పడం కష్టమోతుంది. తాజాగా ఆ దేశం వ్యూహం రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనుంది. అదీ తను ఇందాకా పక్షంవహించిన ఉక్రెయిన్ ఆశలకు విరుద్ధంగా. రష్యా, ఉక్రెయిన్ నడుమ యుద్ధం మూడేళ్లుగా కొనసాగుతోంది. బలమైన రష్యాతో, బలహీనమైన ఉక్రెయిన్ తలపడడానికిముఖ్యకారణం తన వెనుకబలంగా నిలిచిన అమెరికా, యూరోప్ దన్ను చూసుకునే.వారి నుండి అందుతున్న ఆర్థిక, సైనిక, ఆయుధ సాయంతోనే.

-డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

## వైద్య సౌకర్యం కల్పించాలి

ఈఎస్ఐ వైద్య సౌకర్యం కల్పించాలి.నూతనంగా తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీఎస్టీబీసీ మైనారిటీ గురుకులాలలో ఇటీవలకాలంలో 9210 నూతనంగా డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పిజిటి, టీజీటీ, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రెరియన్స్ వివిధ సొసైటీలలో జాయిన్ కావడం జరిగింది. రాష్ట్రంలో మొత్తం 20 వేలమంది గురుకుల సిబ్బందికి ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించాలి. గురుకులాలలో నిత్యం విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తూ వివిధ అనారోగ్య సమస్యలతో ఉన్నవారికి ఈఎస్ఐ ఆరోగ్య కార్డు ఇచ్చి ఉద్యోగితోపాటుగా వారి కుటుంబ సభ్యులకు వారి తల్లిదండ్రులకు ఉచిత ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించాలి.

-రాపాక రవీందం, జనగాం

## లోక్అదాలత్ నిర్వహణ

ప్రతి జిల్లాలో న్యాయసేవల సాధికార సంస్థ నిర్ణీత కాలంలో లోక్ అదాలత్ నిర్వహణ జరుగుతోంది. చట్టం అనుమతించే రాజీమార్గం ఉన్న కేసుకు సత్వర న్యాయం లభిస్తుంది.ఎందరో పేద కుటుంబాలువారికి జరిగిన అన్యాయాలకు ఆర్థిక స్తోమత లేనప్పుడు మొదట పత్రాలతో సంబంధిత అధికారులు లేదా పర్యవేక్షకులను సంప్రదిస్తే దానివిధానం తెలియజేస్తారు.దీనివల్లపరిష్కారం ఏ ఖర్చు లేకుండా పొందవచ్చు. వస్తుంది.

-బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

## జరిగిన నష్టం రాబట్టాలి!

ఎపి ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీ రెడ్డి ఆ సంస్థలో పని చేస్తున్న ముగ్గురు ఉన్నతాధికారులపనితీరు పూర్తిగా లోపభూయిష్టంగా, బాధ్యతారాహితంగా ఉండటంతో తొలగించాలని తీసుకున్న నిర్ణయం అభినందనీయం. తొలగించడమే కాకుండా, వారి బాధ్యతారాహిత్యం వలన సంస్థకు జరిగిన నష్టం వారి నుంచి రాబట్టాలి. ఒక్కఫైబర్ నెట్‌మాత్రమే కాదు, ప్రతి శాఖలో, ప్రభుత్వ సంస్థల్లో అన్ని స్థాయిల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పాలకులు ప్రజలకు జవాబుదారీ. మంత్రులు, వివిధ కార్పోరేషన్ల ఛైర్మన్లు పని చేయని అధికారులను గుర్తించితక్షణమే తొలగించాలి. అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

## పెరిగిన టారిఫ్

డోనాల్డ్ ట్రంప్ మహాశయుడు అమెరికా అధ్యక్షుడిగా రెండవసారి ఎన్నికయిన తరువాత అనేక పరిశోధనలు చేస్తున్నారు. మన టారిఫ్ తో సమానంగా వారి టారిఫ్‌ను పెంచడం ఈ విషయాన్ని ఖరాఖండిగా మన ప్రధాని మోడి గారితోనే నిష్కర్మగా నిర్మోహమాటంగా చెప్పానని ట్రంప్ చెప్పారు. భారత దేశానికి డబ్బుఅవసరం ఏ మాత్రంలేదని చెప్పారు. ఎందుకంటే భారత్ ధనిక దేశమట. పన్నుల రూపేణా అధికంగా సంపాదిస్తోందట.ధనిక దేశమే అయితే కోటిలక్షల కోట్లు అప్పు చేయడమెందుకో. కొంతమంది ఐ.పి.ఎస్. 95 స్కీములో రిటైరయిన వారు రెండు దశాబ్దాల పైగా తమకొచ్చే వెయ్యిరూపాయల ఫించన్ను పెంచమని మొత్తుకుంటుంటే తమ ప్రభుత్వం దగ్గర డబ్బు లేదని బీద అరుపులు అరుస్తోంది.కోట్లాది మంది భారతీయులు ఇంకా దారిద్రరేఖ దిగువున నివసిస్తున్నారు. మరి భారత్ ధనిక దేశం ఏలా అయిందో ట్రంప్ విడమరచి చెప్పాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## మాతృభాషలోనే విద్యాబోధన

విద్యాహక్కు చట్టం 2005 ప్రకారం మాతృభాషలోనే విద్యాబోధన చేయాలి.ప్రతి తరగతికి ఒక గదిఉండాలి. అన్ని పాఠశాలలకు ర్యాంకింగ్స్ ఇవ్వాలి. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు ఉపయోగించకూడదు.అన్నిపాఠశాలల్లో మౌలిక వసతులుకలిపించాలి. పాఠశాలల ముందు స్కూల్ జోన్ బోర్డు ఉండాలి.మాతృభాషలో విద్యాబోధన ద్వారా విద్యార్థులు పాఠాలు త్వరగా నేర్చుకోవడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది.

-పుట్లూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'సహకారా'నికి తూట్లు పొడవొద్దు

**దేశంలో యాభైరెండు శాతంపైగా రైతులు అప్పుల ఊబిలో మగ్గిపోతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. సహకారవ్యవస్థ దిగజారే కొద్దీ ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు ఏదో ఒక రూపేణ ఈవ్యవస్థలోకి ప్రవేశించక తప్పదు. ఇప్పటికే ప్రైవేట్‌వడ్డీ వ్యాపారులు ఫైనాన్స్,మైక్రోఫైనాన్స్ పేర్లతో గ్రామగ్రామానికి విస్తరించారు. ఇష్టానుసారంగా వడ్డీలు వసూలుచేస్తున్నారు. రానురాను మరింత పెరిగేపరిస్థితులు కన్పిస్తున్నాయి. ఏదిఏమైనా ఎంతో పవిత్ర ఆశయంతో పెద్దలు ప్రవేశపెట్టిన ఈ సహకార రంగానికి తూట్లు పొడవడం ఏమాత్రం సమంజసం కాదు.**

దామెర్ల సాయిబాబ

'అప్పిచ్చువాడు వైద్యుడు, ఎప్పుడు ఎడతెగక పారు ఏరును ద్విజుడున్, చొప్పడిన ఊరనుండుము, చొప్పడ కున్నట్టిఊరు చొరకుము సుమతీ' అంటూ కొత్త ప్రదేశాల్లో స్థిరపడాలనుకునేవారికి సుమతీ శతకకారుడు కొన్నిసూచనలు ఇచ్చారు. అందులోనూ మొట్టమొదటిది అన్నిం టికంటే ముఖ్యమైనది అప్పు. ఆ అప్పుకు ఎంతటి ప్రాధా న్యత ఇచ్చారో ఆనాటి పెద్దలు.ఆరోగ్యం, నీరుకంటే అప్పిచ్చు వారికే అగ్రతాంబూలం ఇచ్చారు. ఇది కొత్తగా వచ్చిందికాదు, కొత్తగా చెప్పేది కాదు. ఎంతో అనుభవంతో కాచివడబోసి వెల్లడించిన సుమతీశతకం ఇది. పూర్వీకుల నుంచి గ్రామీణ రంగంలో రైతులను ఆదుకునేందుకు అప్పులు అందించే వ్యవస్థ ఏదోఒక రూపంలో కొనసాగుతూనే ఉంది. రాజుల కాలం కానీ, ఆ తర్వాత కానీ ఆ గ్రామాల అవసరాలను బట్టి రైతులకు రుణసహాయం అందించేవారు. ఆనాడు లాభాపేక్ష ఉండేది కాదు. రైతులకు అప్పులు ఇచ్చేవారి మధ్య అవినాభావ సంబంధాలు ఉండేవి. ఎంతో మానవతా విలువలు ఉండేవి. ఒకరినొకరు ఆదుకోవాలనే తపన,ఆరాటం ఉండేది. కానీ దిగజారిపోతున్న మానవ విలువలతో పాటు ఆ వ్యవస్థ కూడా లాభాపేక్ష ధ్యేయంగా మారి అధిక వడ్డీలు, అపరాధవడ్డీలు అంటూ అమాయకులను దోపిడీ చేయడం ఆరంభించింది. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని 'నాగు'లంటూ పంటకాలానికి బస్తాకు రెట్టింపు వసూలు చేసేవిధానం కూడా చోటు చేసుకుంది. ఈ నాగులు, అపరాధ వడ్డీలు చెల్లించలేక ఎన్నో కుటుంబాలు వీధినపడ్డాయి. దీని నుంచే వెట్టిచాకిరి ఆవిర్భవించిందని చెప్పొచ్చు. ఈ దోపిడీని వ్యతిరేకించిన వారిలో కొందరు యువకులు ఆనాటి బ్రిటిష్ పాలకులు కూడా ఎదురొడ్డి నిలిచారు. పోరాట బాటపట్టారు. ఒక దశలో బ్రిటిష్ ప్రభుత్వానికి ఇదొక సమస్యగా రూపాంతరం చెందింది. అప్పుల భారం భరించలేక, వ్యవసాయానికే మంగళం పాడే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో అటు వడ్డీ వ్యాపారులను కట్టడి చేయలేక, ఇటు రైతులను ఆదుకోలేక ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం సతమతమైంది. ఎన్నో కమిటీలు, సుదీర్ఘ అధ్యయనం అనంతరం గ్రామీణ పరిస్థితులను అర్థం చేసుకున్న బ్రిటిష్ పాలకులు 1904లో సహకార వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. 1911 మార్చి17వ తేదీన గుంటూరులో జిల్లాస్థాయి సహకార బ్యాంకు ఆవిర్భవించింది. ఆ తర్వాత అయ్యదేవర కాళేశ్వర రావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య లాంటి పెద్దలు కలిసి విజయవాడ కోఆపరేటివ్ బ్యాంకును స్థాపించారు. అందులోనుంచి విడిపోయిన పట్టాభి సీతారామయ్య భూములను తనఖా పెట్టుకొని దీర్ఘకాలిక రుణాలు ఇచ్చే భూ తనఖా బ్యాంకులను భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా కృష్ణజిల్లా గుడ్ల వల్లేరులో 1925 అక్టోబరు 31వ తేదీన శ్రీకారం చుట్టడంతో గ్రామీణరంగంలో రుణవసతులు కల్పించడంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నా యి. అందరి రైతులకు కాకపోయినా కొందరికి కొంతమేరకు ఊరట లభించింది. ఈ వ్యవస్థను నీరుకార్చేందుకు కొందరు భూస్వాములు వడ్డీవ్యాపారస్తులు ఎవరి వంతు వారు కృషి చేశారు. అయినా రైతుల విశ్వాసం చూరగొంటూ అంచెలంచెలుగా ఎదిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 1964లో సహకార చట్టం వచ్చింది. రైతుల కష్టాన్ని వడ్డీ, చక్రవడ్డీ రూపంలో దోచుకుంటున్న కొందరి వ్యాపారులకు పెత్తందారులకు ఇది ఇబ్బంది కలిగించినా రైతులకు మాత్రం వరప్రసాదంగా పరిణమించింది. వడ్డీ వ్యాపారస్తులకు సంబంధించిన వ్యక్తులు డబ్బులు వసూలు చేయడంలో ఎంత కర్కశంగా వ్యవహరించేవారో ఇప్పటికీ కథలుకథలుగా చెప్పుకుంటారు. వారికి వాయిదాల ప్రకారం డబ్బు చెల్లించకపోతే

## ఒక్క మాట

డబ్బు కట్టేవరకు ఇంట్లో పొయ్యి వెలిగించకుండా నీళ్లుపోసేవారట. అంటే తమకు డబ్బు చెల్లించకుండా ఆ ఇంట్లో ఎవరూ ఆకలి తీర్చుకునే అవకాశం లేకుండా చేసేవారు. వంటపాత్రలను ఎత్తుకెళ్లేవారు. వ్యవసాయ పశువులను తోలుకుపోయేవారు. ఇంటి ముందు తలుపులు తీసుకువెళ్లడం, వ్యవసాయ పనిముట్లు జప్తు చేసుకువెళ్లడం లాంటివి చేసి సమాజంలో అవమానపరిచేందుకు ఎన్ని మార్గాలు ఉన్నాయో అన్ని అమలు చేసేవారు. మొత్తం మీద ఈ సహకార వ్యవస్థతో గ్రామీణరంగంలో ఆ బాధలు తప్పిపోయాయని రైతులు ఆనందించారు. మరోకపక్క రైతుల అవసరాలను బట్టి రుణసహాయం అందిస్తూ వారి ఆదరాభిమానాలు అందుకుంటూ సహకార రంగం శాఖోపశాఖలుగా విస్తరించింది. అంచెలంచెలుగా ఎదిగి కోట్ల రూపాయలు అప్పులిచ్చే స్థాయికి చేరుకున్నది. మరెన్నో సహకార సంఘాలు ఆవిర్భవించి దేశానికి ఆదర్శంగా నిలిచాయి. కరీంనగర్ జిల్లా ముల్కనూరులో ఏర్పాటైన సొసైటీ కార్యకలాపాలను చూసేందుకు మనదేశం నుంచే కాదు బ్రిటన్ లాంటి దేశాల నుంచి కూడా నిపుణులు వచ్చి అధ్యయనం చేసివెళ్లేవారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ ఈ వ్యవస్థలో రాజకీయాలు ప్రవేశించడంతో క్షీణదశ ఆరంభమైందని చెప్పొచ్చు. గత రెండు, మూడు దశాబ్దాలుగా పరిస్థితి రానురాను దిగజారిపోతున్నది. అప్పులు వసూలు చేయడంలో పాత వడ్డీవ్యాపారులు వ్యవహరించిన తీరు కొన్నిచోట్ల అధికారులు పాల్పడుతుండడంతో రైతుల విశ్వాసాన్ని కోల్పోతున్నారు. గతవారంలో తెలంగాణలో ఓ బక్క రైతు అప్పుకట్టలేదని ఆయన ఇంటి ముందు తలుపులు తీసుకువెళ్లారు. ఆ తలుపులతో ఆయన కట్టాల్సిన లక్షలాది రూపాయలు అప్పులో వందోవంతు కూడా తీరదని తెలుసు. కేవలం ఆ రైతును అవమానపరిచేందుకే ఇలాంటి పాత పద్ధతులను అవలంబిస్తున్నారు. రైతుల పరిస్థితి వేదనాభరితంగా మారుతున్నది. అధికారులు పాల్పడుతున్న ఇలాంటి చర్యల పట్ల తెలంగాణ వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మొన్న బహిరంగంగానే తీవ్ర స్థాయిలో హెచ్చరిం చారు. అయినా కొందరు అధికారుల్లో మార్పురావడం లేదు.పోనీ ఇంత నిర్దాక్షిణ్యంగా రైతుల నుంచి వసూలుచేసి సహ కార వ్యవస్థ పురోభివృద్ధికి ఉపయోగపడుతున్నాయంటే అదీ లేదు. సహకార సంఘాల ఆర్థికపరిస్థితి అంతకంతకు దిగజారిపోతున్నది. నష్టాలఊబిలో కూరుకుపోతున్నాయి. కొన్ని సహకార సంఘాలు తమ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. సహకార చట్టంలో ఎన్నిసార్లు మార్పులు చేశారో చెప్పలేం. సకాలంలో ఎన్నికలు జరపడం లేదు. వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటున్నారు. ప్రస్తుతం కూడాఅదే పద్ధతి అవలంబిస్తున్నారు. రాజకీయాల అవసరాల కోసం వీరూవారు అనితేడాలేకుండా అందరూ అన్నివిధాలుగా ఈ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడే కాదు ముఖ్యమంత్రులు మారినప్పుడు వారి అభీష్టాలమేరకు నిబంధనలు మారుస్తున్నారు.భూమున్న రైతులేకాదు,భూమిలేని వారు కూడా కేవలం పదిరూపాయలు ఫీజు చెల్లించి సభ్యులుగా చేరవచ్చునన్న సవరణ తెచ్చారు.ఆ తర్వాత మళ్లీదాన్ని సవరించారు. ఎన్నికల్లో ఓట్లకోసం ఇష్టానుసారంగా సభ్యత్వాన్ని పెంచారు. 'ఒకరి కోసంఅందరు, అందరి కోసం కొందరు నిలిచి' అన్న సహకారస్ఫూర్తికి ప్రమాదం వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. సహకారవ్యవస్థ రాజకీయ పునరావాసంగా రూపాంతరం చెందింది.ఆదాయ వ్యయాలు నిమిత్తం లేకుండా అవసరాలకు మించి ఉద్యోగులను నియమించడంతో సహకార సంఘాలకు మోయలేని భారంగా పరిణమించింది. ఇక అవకతవకలకు అంతేలేకుండాపోయింది. రైతులకు తెలియకుండా రైతుల పేరుపై అప్పులు తీసుకొని భోంచేసిన ఉదంతాలు ఎన్నో బయటకు వచ్చాయి. విచారణ పేరుతో ఏళ్లతరబడి కాలంగడుపుతున్నారు. 'కావడి ఎన్ని వంకలు తిరిగినా చివరకు ఇంటికి చేరాల్సిందేనన్నట్లు' ఈ భారమంతా రైతులు మోయాల్సి వస్తుందనే వాస్తవాన్ని పాలకులు పట్టించుకోవడంలేదు. దేశంలో వ్యవసాయరంగం కుదేలైపోతుండడానికి కారణాల్లో రైతులకు సకాలంలో అప్పులు దొరక్కపోవడం. దీంతోవారు ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడక తప్పడం లేదు. దేశంలో యాభై రెండు శాతం పైగా రైతులు అప్పులఊబిలో మగ్గిపోతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తు న్నాయి. సహకార వ్యవస్థ దిగజారే కొద్దీ ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు ఏదోఒక రూపేణ ఈ వ్యవస్థలోకి ప్రవేశించక తప్పదు. ఇప్పటికే ప్రైవేట్‌వడ్డీ వ్యాపారులు ఫైనాన్స్, మైక్రోఫైనాన్ పేర్లతో గ్రామగ్రామానికి విస్తరించారు. ఇష్టానుసారంగా వడ్డీలువసూలు చేస్తున్నారు.రానురాను మరింత పెరిగేపరిస్థితులు కన్పిస్తున్నాయి.ఏదిఏమైనా ఎంతో పవిత్ర ఆశయంతో పెద్దలు ప్రవేశపెట్టిన ఈ సహకార రంగానికి తూట్లు పొడవడం ఏమాత్రం సమంజసం కాదు. ●

# న్యాయస్థానాల్లో తీవ్రజాప్యాన్ని అరికట్టాలి!

బి. మధు

ఈ మధ్యకాలంలో ఎక్కడ చూసిన ఉమ్మడి కుటుంబాల ఆస్తుల విషయంలో అన్నదమ్ముల మధ్య వచ్చే పొరపచ్చలు, ఘర్షణ వాతావరణం, బహిరంగ కొట్లాటలు, ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ, పరస్పర దాడులు చేసుకుంటూ తమది న్యాయం అంటే తమది న్యాయం అంటూ చివరకు పోలీస్ స్టేషన్‌కు, కోర్టుకువెళ్లడం వంటివి సంభవించడం ఒక సర్వ సాధారణ విషయంగా మారిపోవడం ఈ సమాజానికి సంబంధించి ఏ మాత్రం ఆరోగ్యకరమైన పరిణామం కాదు. ముఖ్యంగా ఈ ఉమ్మడి ఆస్తుల విషయంలో ఎవరికి చెందాల్సిన ఆస్తులు వారికే చెందకుండా అంతా ఆస్తిని తాము ఒక్కరమే అనుభవించాలనే దురాశతో, దుర్బుద్ధితో తమకువచ్చే ఆస్తులు చాలక తన సొంత అన్నదమ్ముల, తోబుట్టువుల ఆస్తులను కూడా దొడ్డిదారిలో కాజేయాలని చూస్తుండటం,హస్తగతం చేసుకోవాలని ప్రయత్నం చేయడం అందుకోసం ఎలాంటి నీతిమాలిన చర్యలకు పాల్పడటానికి కూడా వెనుకంజ వేయకపోవడం వంటి అనైతిక పోకడల మూలాన ఆస్తుల వ్యవహారాలు ముదిరిపాకాన పడిఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూ, దుమ్మెత్తి పోసుకుంటూఅంతిమంగా న్యాయం కోసం ఏ పోలీస్ స్టేషన్ లేదా న్యాయ వ్యవస్థ గడపనో తొక్కడం వంటి చర్యలు అనేకం. ప్రస్తుతం మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తున్నాయి అనే మాట పచ్చి యదార్థం.అయితే ఎక్కువ భాగం ఇలాంటి కేసులలో తమ తల్లిదండ్రులను నయనో భయానో లొంగదీసుకొని లేదా వారిని పక్కదోవ పట్టించి మరీ ఉమ్మడి కుటుంబంలోని కొంతమంది నయవంచకుల వంటి అన్నదమ్ములు తమ సొంత అన్న లేదా తమ్ముడి ఆస్తులను చట్టంలోని లొసుగులను ఆధారంగా చేసుకొని ఆస్తులను అప్పనంగా కొట్టేసేందుకు ఎన్నో కుట్రలు, కుతంత్రాలు పన్నుతుండటం, అందుకోసం నీతి,నియమాలకు సైతం తిలోదకాలు ఇచ్చి డబ్బు వ్యామోహం మెండుగా గల కొంతమంది లాయర్లను ఆసరాగా పెట్టుకొని మరీ అందరికి చెందాల్సిన ఆస్తులు తమకే చెందేలా ఆస్తులను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కూడా ఏ మాత్రం వెనుకంజ వేయడం లేదు. అంటే నేటి సమాజంలో ఎలాంటి అత్యంత దురదృష్టకరమైన, ఆందోళనకరమైన పరిస్థితులు పొడచూపుతున్నాయో మనకు బాగా విశదమవుతున్నది .అందుకోసం మోసపురితమైన,దగాకోరు పంథాలో తల్లిదండ్రుల నుంచి ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాలపై సంతకాలు తీసుకొని తమకు చెందని ఆస్తులను కూడా కొంతమంది రిజిస్ట్రేషన్ ఆఫీసు అధికారులను,అక్కడ పని చేసే సిబ్బందిని మభ్యపెట్టి వారికి కాసుల ఆశ చూపి తమ పేర లిఖించుకొని ఆన్‌లైన్ చేసుకుంటున్నారు. అంటే మన వ్యవస్థ ఎంతగా భ్రష్టు పట్టిందో, ఏస్థాయిలో దిగజారిపోయిందో మనం ఇట్టే ఊహించవచ్చు. ఏదిఏమైన ఇప్పటికైనా ఉమ్మడి కుటుంబంలోని సభ్యులు తమ ఆస్తుల విషయంలో నిద్రాణావస్థ నుంచి మేల్కొని తమ ఆస్తులు మరొకరి పాలు కాకుండా,అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించడంతోపాటు, ఒకవేళ తమకు అన్యాయం జరిగిన త్వరితగతిన తమ తల్లిదండ్రులను సంప్రదించి జరిగిన దారుణ మోసాన్ని వారికి బట్టబయలు చేసివారిని (ఎంఆర్ఓ) మండల రెవెన్యూ అధికారి,తహాశీల్దారు వంటి ఆఫీసర్ల వద్దకు తీసుకెళ్లి తక్షణమే వారు దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేసిన భూమిని బ్లాక్ చేయించే విషయంపై అవగాహన పెంచుకొని తమ విలువైన ఆస్తులను అత్యంత సురక్షితంగా కాపాడుకోవాలి. కాబట్టి ఉమ్మడి ఆస్తుల పరిరక్షణే ప్రదాన ధ్యేయంగా ప్రతి ఒక్క ఉమ్మడి కుటుంబ సభ్యులు భావించి తదనుగుణంగా తమ గురుతర బాధ్యతను సక్రమంగా నిర్వర్తించకపోతే మాత్రం చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందాన అమూల్యమైన జీవితాలు అధోగతి పాలు కావడం తథ్యం. ●

# చదువుల విప్లవం డిజిటల్ టెక్నాలజీతో సాధ్యం!

డాక్టర్ మోటె చిరంజీవి


కాలం మారుతుంది. కాలానికి అనుకూలంగా విద్యలో కూడా అనేక మార్పులు వస్తున్నాయి.రోజురోజుకు విద్యార్థుల్లో కూడా కాంపెటీషన్ పెరుగుతుంది. దాన్ని అధిగమించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు అధ్యాపకులు. ఇలా పట్టణప్రాంతాల్లో ఉన్నటువంటి పాఠశాలలు మొదలుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి పాఠశాలలకు కూడా డిజిటల్ తరగతులతో బోధన చేపట్టి, విద్యార్థుల్లో నైపుణ్యాలను అలవరుస్తున్నారు. కరోనా సమయంలో కూడా ఈ డిజిటల్ తరగతులు కీలకంగా పని చేశాయి. గూగుల్, జూమ్ యాప్ ద్వారా ఇంటిదగ్గర ఉన్నటువంటి పిల్లలకు సైతం పాఠాలు బోధించారు.ఈ విధంగా ఆన్లైన్ క్లాసులకు ఆజ్యం పోయడం జరిగింది. ఇలా పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఇంట్లోనే పాటలు వినేటువంటి పరిస్థితి కలిగింది. ప్రైవేటు పాఠశాలలే కాకుండా ప్రభుత్వ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో కూడా విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధనలు అందించడానికి పలు రకాలుగా పాఠాలను బోధిస్తున్నారు. అందులో సులభతరంగా విద్యాబోధన చేయడానికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పాఠశాల తరగతి గదుల్లో డిజిటల్ విప్లవం వచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు. విద్యార్థులకు సులభతరంగా పాఠ్యాంశాలు బోధించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్యలోసాంకేతిక పురోగతి కోసం పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఐక్యంగా నిలబడి,అధ్యాపకులు సైతం అండగా ఉన్నప్పుడుమాత్రమే ఇది సాధ్యమవుతుంది. అందుకోసం అధ్యాపకులకు నూతన టెక్నాలజీని కూడా బోధిస్తున్నారు.సాంకేతిక విప్లవం ఇంకా వెనుకబడి ఉన్న అనేక పాఠశాలలు,కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ప్రధాన సవాళ్లు ఉన్నాయి.ఉపాధ్యాయులు తరగతి గదిలో ఆధునిక విద్యా సాధనాలను ఉపయోగించడానికి వెనుకాడతారు. అలా వెనకాడకుండా ఉండడానికి , సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించడానికి, వారికి సరైన శిక్షణ ఇస్తున్నారు.గతంలో వనరులు, మౌలిక సదుపాయాలు కనెక్టివిటీ లేకపోవడం వల్ల తరగతి గదులకు ఇంత సుసం పన్నమైన సాంకేతికత అందుబాటులో లేకుండా పోయింది. కానీ ప్రస్తుతం అలాంటి ఇబ్బంది ఏమీ లేదు. భారతదేశం డిజిటల్ మయమైంది. వేగవంతమైన సాంకేతిక పురోగతి యుగంలో మన పట్టణకేంద్రాలు అభివృద్ధి చెందుతున్నందున, మన నగరాలు, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న విస్తారమైన విద్యా అంతరాన్ని తగ్గించడంపై మనం దృష్టి పెట్టవలసిన సమయం ఆసన్నమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై ఎక్కువ నిధులు కేటాయిస్తూ, అందులో చదువుతున్నటువంటి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ తరగతి గదుల పరిచయం ఆశాకిరణంగా ఉద్భవించింది. ఈ వినూత్న సెటప్‌లు మన



దేశంలోని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు సాధికారతను కల్పిస్తాయి. దృశ్య అభ్యాస అనుభవాలు ఇంటరాక్టివ్ వాతావరణాల ద్వారా మెరుగైన అవగాహనను అందిస్తాయి. గ్రామీణవిద్యలో సాంకేతికతను సమగ్రపరిచే మార్గంలో సవాళ్లులేకుండా లేవు. పరిమిత మౌలిక సదుపాయాలు, అనియత విద్యుత్ సరఫరా నుండి డిజిటల్ అక్షరాస్యతకు, అడ్డంకులు అనేకం ఉన్నాయి. అన్నింటిని అధిగమిస్తూ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులు ఇలా అన్ని సమకూర్చుతూ మరోపక్క బోధన పద్ధతుల్లోకూడా వినూత్న పద్ధతులు పాటించేలా అనేక విద్యాప్రమాణాలను పాటిస్తూ, గురుకులాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుతుంది. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దడం జరిగింది. కంప్యూటర్ ల్యాబ్‌తోపాటు, ట్యాబు ద్వారా, బై జ్యూస్ కంటెంట్ విద్యార్థులకు బోధించేందుకు ప్రతి తరగతి గదిలో ఐ ఎఫ్ ప్యానల్, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసి విద్యను అందిస్తున్నారు. ప్రొజెక్టర్ ద్వారా లైవ్ క్లాస్‌లను కూడా అందుబాటులోకి తేవడం జరిగింది. విద్యార్థికి ఏదైనా అర్థం కానప్పుడు అడిగే విధంగా కూడా ఉండి, వారికి వచ్చిన డౌటును క్లారిఫై చేసుకోవడం జరుగుతుంది. ఈవిధంగా పాఠశాల విద్యార్థుల్లో మెరుగైన ర్యాంకులురావడం, కళాశాల విద్యార్థులు నీట్, ఐఐటి వంటి పోటీ పరీక్షలలో మంచి ర్యాంకులు సాధించడం,డిగ్రీ, పిజి,పిహెచ్‌డి విద్యార్థులు సైతం వారికి తెలియని విషయాలను సైతం తెలుసుకుంటూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటున్నారు. ఈ విధంగా కరోనా సమయంలో ఇంట్లోనే ఉండి విద్యను నేర్చుకోవడం జరిగింది. ఇప్పుడు విశ్వవిద్యాలయాల్లో సైతం ఆన్లైన్ ఎడ్యుకేషన్ ద్వారా విద్యార్థులకు ఆన్లైన్ పాఠాలు బోధిస్తున్నారు. 20వ శతాబ్దపు 3వ పారిశ్రామిక విప్లవం ఇంటర్నెట్, ఆటోమేషన్ టెక్నాలజీలను తీసుకువచ్చింది. డిజిటల్ టెక్నాలజీల విస్తృత వినియోగం కారణంగా, దీనిని డిజిటల్ విప్లవం అని కూడా పిలుస్తారు. కొత్త డిజిటల్ టెక్నాలజీల సహాయంతో ప్రస్తుత వ్యాపార ప్రక్రియలను మెరుగుపరిచే ప్రక్రియను డిజిటలైజేషన్ అంటారు. 20వ శతాబ్దంలో కంప్యూటర్లు విస్తృతంగా వాడుకలోకి వచ్చిన తర్వాత ఇది ప్రారంభమైంది. ఇంతకుముందు భారత్‌లో ఎంతోమంది విద్యార్థులు పలు రకాల కారణాలతో అర్ధాంతరంగా చదువుకు దూరం అయ్యేవారు. వారికోసం వారు చదువు కొనసాగించడానికి విశ్వవిద్యాలయంలో ఈ డిజిటల్ ఆన్లైన్ తరగతులు ఎంతగానో తోడ్పడుతుంది. ఇవే కాకుండా సీట్లు పొందినటువంటి విద్యార్థులు డిజిటల్‌ద్వారా తమకు నచ్చిన విశ్వవిద్యాలయంలో గాని, విద్యాలయాలలో గాని, సంక్షేమ గురుకులాల్లో సీట్లు పొందుతున్నారు. ఈ విధంగా విద్యార్థులకు ఆన్లైన్‌కోర్సులు విస్తృతంగా అందుబాటులోకి రావడం, ఆన్లైన్ కోర్సులను అందించడానికి కేంద్రం ఆధ్వర్యంలో 2016లో మాసీవ్ ఓపెన్ ఆన్లైన్‌కోర్సెస్ వేదిక ఏర్పాటు చేశారు.రాబోయే రోజులలో అంతర్జాతీయ విద్యా సంస్థలతో డిజిటల్ పాఠాలను అందించినట్లయితే ఎంతగానో ఉపయోగపడుతుంది. ఏది ఏమైనప్పటికీ డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ప్రతి ఒక్కరికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇలా ఇంటర్నెట్ సౌకర్యం కలిగి ఉండి, విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తున్నటువంటి గురుకులాలు, పాఠశాలలు ఉన్నతప్రమాణాలు పాటించడమే కాకుండా వారిని సమాజంలో ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతు న్నారు అధ్యాపకులు. ఈ విధంగా విద్యార్థులు, అధ్యాపకులు, డిజిటల్ వ్యవస్థలను ఉపయోగించి,వాటితో బోధించి,ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శప్రాయులుగా నిలుస్తున్నారు. ●

# ఎన్నికల ప్రక్రియలో విదేశీ జోక్యమా?

## డోజ్ వ్యాఖ్యలపై మండిపడుతున్న వివిధ పార్టీలనేతలు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** అంతర్జాతీయ అభివృద్ధికి నిధులు అందచేసే యుఎస్ఎయిడ్ భారత్‌లో ఓటర్ టర్నౌట్ పెంచేందుకుగాను 21 మిలియన్ డాలర్ల నిధిని అందించిందని ఎలాన్‌మస్క్ చేసిన వ్యాఖ్యలు ఆపై వీటన్నింటిని రద్దుచేస్తున్నట్లు ప్రకటించిన వైనంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. భారత అంతర్గత వ్యవహారాల్లో అమెరికా మితిమీరిన జోక్యం చేసుకుంటున్నదని దౌత్యవేత్తలు అభిప్రాయపడుతున్నారు. విదేశాంగశాఖ ఈ 21 మిలియన్ డాలర్ల ఇండియా ఫండ్‌పై స్పందించింది. కాంగ్రెస్ బిజెపిలమధ్య మాటలయుద్ధం పెరుగుతుండటంతో ఆయన స్పందించారు. భారత ఎన్నికల ప్రక్రియలో బయటిశక్తుల జోక్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తంచేసారు. అయితే అధికార బిజెపి 2012లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుపిఎ ప్రభుత్వం భారత్ కీలక సంస్థల్లోకి చొరబాట్లను సమ్మతించిందని, జాతిప్రయోజనాలను పణంగా పెట్టిందని ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్‌నేతలు కూడా ఘాటుగానే స్పందించారు. యుఎస్ఎయిడ్ ద్వారా ఒక్క బిజెపి మాత్రమే లబ్ధిపొందిందని అన్నారు. డోజ్ సంస్థ చీఫ్ టెస్లా వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని డోజ్ ఆడిట్‌లో అనేక ప్రభుత్వ ఏజెన్సీలకు వృధా నిధుల మంజూరును కోత విధించింది. సుమారు 486 మిలియన్ డాలర్లు ఎన్నికల కూటములు, ఎన్నికల ప్రక్రియను పటిష్టంచేసేందుకు వెచ్చించినట్లు చూపించడంతో వాటిని రద్దు చేసారు. మాల్డోవా లో సమ్మిళిత రాజకీయ ప్రక్రియలో భాగ స్వామ్యం కోసం 22 మిలియన్ డాలర్లు, 21 మిలియన్ డాలర్లు భారత్‌లో ఓటర్ల భాగస్వామ్యం పెంచే చైతన్యకార్యక్రమానికి వినియోగించినట్లు తేల్చింది. బిజెపికి చెందిన అమిత్ మాలవీయతోపాటు నలిన్‌కోహ్లీకూడా అమెరికా ఏజెన్సీ భారత్‌లో ఎన్నికల పనులకని 21 మిలియన్ డాలర్లు ఎందుకు ఇచ్చిందని ప్రశ్నించడంతోపాటు భారత ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని అన్నారు. అయితే 2010 నుంచి 2012మధ్యకాలంలో పనిచేసిన ఛీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎస్‌వై ఖురేషి ఈ క్లెయిమ్‌లను ఖండించారు. బిజెపి నేతల వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయడం, మరింత పటిష్టంచేయడం వంటి వాటితోపాటు ఐఎఫ్ఆఎస్ వంటి సంస్థలతో ఎంఒయులు జరిగాయని, అవి ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయని వనరులను శక్తివంతం చేయడంకోసం ఈ నిధులు వెచ్చిస్తాయన్నారు. యుఎస్ఎయిడ్ ఇచ్చిన నిధుల్లో ఎక్కువ శాతం రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలోని స్వచ్ఛంద సంస్థలు రాజీవ్‌గాంధీ ఫౌండేషన్‌కే వేళ్లాయని ఆరోపించారు.

డోజ్ సంస్థ బం గ్లాదేశ్‌కు కూడా 29 మిలియన్ డాలర్లు ఇచ్చినట్లు ప్రకటించింది. వీటిని కూడా రద్దుచేస్తామని ప్రక టించారు. తనను గద్దెనుంచి దించేందుకు విదేశీ శక్తుల హస్తం ఎంతో పనిచేసిందని, ఒక ద్వీప్ కల్పం అప్పగించనందుకు అమెరికా తనను గద్దె నుంచి దించే కుట్రలు చేసిందని బంగ్లా మాజీ ప్రధాని హసీనా ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇపుడు డోజ్ సంస్థ ప్రకటించిన నిధుల జాబితా తనను గద్దెదించేందుకు వినియోగించారని ఆమె ఆరోపించారు.



## మహాయుతిలో తారస్థాయికి చేరిన

# లుకలుకలు!



**ముంబయి, ఫిబ్రవరి 21:** మహాయుతికూటమిలో అంతర్గత విభేదాలు పెరిగి పోతున్నాయి. అందుకు అనుగుణంగానే జరుగుతున్న కొన్ని సంఘటనలు ఇందుకు ఊతం ఇస్తున్నాయి. ప్రత్యేకించి డిప్యూటి సిఎం ఏక్‌నాథ్‌షిండే, ముఖ్యమంత్రి దేవేంద్రఫడ్నవిస్‌లమధ్య దూరం పెరుగుతూ వస్తోంది. బిజెపి ఆధ్వర్యంలోని మహాయుతిలో బిజెపితోపాటు ఎన్సీపీ అజిత్ పవార్, ఏక్‌నాథ్‌షిండే శివసేనలు మిత్రులుగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. బిజెపి అద్వితీయ మెజార్టీతో గెలిచినప్పటికీ అజిత్, షిండేలకు డిప్యూటి సిఎంలు కేటాయించిన బిజెపి హైకమాండ్ వీరిమధ్య చోటుచేసుకుంటున్న విభేదాలను మాత్రం సర్దుబాటు చేయలేకపోతోంది. నాయకులను బుజ్జగించలేకపోతోంది. తాజాగా ప్రభుత్వపరంగా ఏర్పాటు అయిన మూడు అధికారిక కార్యక్రమాల్లో ఏక్‌నాథ్‌షిండే పాల్గొనడకపోవడం నేతలమధ్య పొరపొచ్చాలు మరింతపెరుగుతున్నట్లు సూచిస్తోంది. థాణెజిల్లా బద్లాపూర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం ప్రారంభం కార్యక్రమంలో డిప్యూటిసిఎం ఏక్‌నాథ్‌షిండే పాల్గొనలేదు. మరాఠా కింగ్ జయంతి కార్యక్రమాల్లోను ఆయన పాల్గొనకపోవడం విభేదాలు మరింత పెరుగుతున్నాయి. అలాగే అంబేగాంవ్ బుద్రక్‌లో జరిగిన శివశృతి కార్యక్రమానికి కూడా రాలేదు. అలాగే ఆగ్రాఫోర్ట్‌లోజరిగిన చరిత్రాత్మక కార్యక్రమంలో కూడా షిండే పాల్గొనలేదు. ఈ మూడు కార్యక్రమాల్లోను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ పాల్గొన్నారు. రానురాను ఈ విభేదాలు మరింత తారస్థాయికి చేరాయి. శివసేనకు చెందిన ఎమ్మెల్యేలకు వై కేటగిరీ సెక్యూరిటీ కవర్‌ను మహారాష్ట్రప్రభుత్వం ఉపసంహరించింది. హోంశాఖ ముఖ్యమంత్రి ఫడ్నవిస్ చేతుల్లోనే ఉండటం ఇందుకు మరింత కారణం అయింది. ఈ చర్యతో శివసేన షిండేవర్గం తీవ్రంగా కలతచెందింది. 44 మంది ఎమ్మెల్యేలు, 11 మంది లోక్‌సభ ఎంపిలకు 'వై'కేటగిరీ భద్రతను కల్పించారు. ఆనాడు షిండే వర్గీయులు కావడంతో వీరిపై దాడులుజరగవచ్చున్న భావనతో వారికి భద్రతపెంచడంతోపాటు కీలకమైనవారికి కేబినెట్ బర్త్‌లు కూడా ఇచ్చారు. ఆనాడు ముఖ్యమంత్రి హోదాలో ఎన్నికల్లో ప్రధానంగా లడ్కీబహిన్‌యోజన వివాదాలను పెంచింది. ఈ పథకానికి ముందు ముఖ్యమంత్రి అన్న పదాన్ని ఎన్సీపీ అజిత్‌వర్గం తన ప్రచార సామగ్రిలో తొగించింది. ఎన్సీపీ నేత అదితి తత్కారే, బిజెపి గిరీష్‌మహాజన్‌లను నాసిక్, రాయ్‌గడ్ ఇన్‌ఛార్జి మంత్రులుగా నియమించడం కూడా వివాదాన్ని మరింతపెంచింది. 2027 నాసిక్ కుంభమేళా సమీక్షాసమావేశానికి కూడా షిండే గైర్హాజరు అయ్యారు. సీనియర్ బిజెపి నాయకుడు ఆశీష్ షేలార్ మాట్లాడుతూ ఎలాంటి అసమ్మతి, అసంతృప్తిలేదని ప్రభుత్వం సజావుగా నడుస్తోందని, ఏకతాటిపై కూటమి పయనిస్తోందని ప్రకటించారు. షిండే కూడా పైపైకి ఎలాంటి కోల్డ్‌వార్ తమమధ్యలేదని చెప్పలేక చెపుతూ రావడంచూస్తుంటే మహాయుతిలో మహా లుకలుకలు బయలుదేరాయని స్పష్టం అవుతోంది.

# రాత్రికి రాత్రే బెంగళూరు నగరాన్ని మార్చేయలేం..

## కర్ణాటక డిప్యూటీ సిఎం వివాదాస్పద వ్యాఖ్యలు

**బెంగళూరు, ఫిబ్రవరి 21:** డిప్యూటి ముఖ్యమంత్రి డికెశివకుమార్ బెంగళూరును సాక్షాత్తూ దేవుడే దిగివచ్చినా బాగుచేయలేడని చేసిన వ్యాఖ్యలు ఇపుడు రాజకీయంగా పెద్ద దుమారం రేపాయి. ఇటు నగరవాసులు రాజకీయ పార్టీల నాయకులు ఆయనపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బెంగళూరు నగరాన్ని రాత్రికి రాత్రే మార్చేయలేం. ఈ మహానగరం ఏ రెండేళ్లకో, మూడేళ్లకో మారదు. ఒకవేళ దేవుడే తలుచుకున్నా అది సాధ్యపడదు. నగరం బాగుచేయాలంటే ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో జరగాలి అని ఒక వర్క్‌షాపులో శివకుమార్ అన్నారు. సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా బెంగళూరులోట్రాఫిక్‌జామ్ వాహనదారులకు నిత్యం నరకం చూపిస్తుంటుంది. ఈ మధ్యకాలంలో అది మరీపెరిగిపోవడంతోపలువురు మేధావులుకూడా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో స్వయంగా డిప్యూటిసీఎం వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ప్రజల్లో అసహనం పెరిగింది. ఆయన మంత్రి అయి రెండేళ్లు అవుతోందని బలమైన నేతగా మీకు ఆహ్వానం పలికాం కానీ మా బతుకులు బలహీనంగా మారుతున్నాయని ప్రముఖ ఆర్థికవేత్త ఆరిన్‌కేపిటల్ ఛైర్మన్ మోహన్ దాస్‌పాయ్ విమర్శించారు. ఫుట్‌పాత్‌ల పరిస్థితి సజావుగాలేదని, ఐదువేల కొత్త ఎలక్ట్రిక్ బస్సులు అవసరమని మెట్రోరైలు విస్తరించాలని మోహన్ దాస్ అన్నారు. బ్రాడ్ బెంగళూరు అంటూ నినాదం ఇచ్చిన వ్యక్తి ఈరోజు దేవుడుకూడా సరిచేయలేడంటూ వ్యాఖ్యానించడం దురదృష్ట కరమని బిజెపి వాదిస్తోంది. ప్రజలకు సేవచేసే అవకాశం దేవుడు ఇస్తే ఈప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని బిజెపినేత మోహన్‌కృష్ణ విమర్శించారు. ఈ విమర్శలపై డికెఎస్ స్పందిస్తూ బెంగళూరు నగర సమస్యలను పరిష్కరించే బాధ్యతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే నగరంలో కొత్తరోడ్లనిర్మాణం, ట్రాఫిక్ సమస్యను తప్పించే ప్రణాళికతోకూడిన మినీ బుక్‌ను విడుదల చేసామని చెప్పారు.





## టెన్త్ విద్యార్థుల ఘర్షణ: కాల్పుల్లో ఒకరు మృతి

**పాట్నా, ఫిబ్రవరి 21:** పదో తరగతి పరీక్షల్లో చీటింగ్ జరిగిందంటూ వచ్చిన ఆరోపణలు విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీశాయి. దీంతో రెచ్చిపోయిన విద్యార్థులు ఏకంగా తుపాకులతో కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు గాయాలు కాగా అందులో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. బీహార్‌లోని రోహ్‌తాస్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. రోహ్‌తాస్‌లోని సాసారామ్ పట్టణంలో నిర్వహించిన పదోతరగతి పరీక్షల్లో చీటింగ్ జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించి ఫిబ్రవరి 19న విద్యార్థుల మధ్యవివాదం చోటుచేసుకుంది. మరుసటిరోజు గ్రూపులుగా విడిపోయిన విద్యార్థులు భౌతిక దాడులకుపాల్పడ్డారు. ఈ క్రమంలో తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. న్యాయం చేయాలని డిమాండ్‌చేస్తూ బాధిత విద్యార్థి కుటుంబసభ్యులు, గ్రామస్థులు మృత దేహంతో జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. సాసారామ్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. దీంతో భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. అటు విద్యార్థులు చికిత్స పొందుతున్న స్థానిక మెడికల్ కాలుజీ ఆసుపత్రి వద్ద కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఒక్కరోజు కాకుండానే మాపై విమర్శలా?

## మాజీ సిఎం విమర్శలు తిప్పికొట్టిన ఢిల్లీ సిఎం రేఖాగుప్తా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** బిజెపి ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చలేదంటూ ఢిల్లీమాజీ సీఎం అతిశి చేసిన విమర్శలను కొత్త సీఎం రేఖాగుప్తా కొట్టిపారేసారు. కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 13 ఏళ్లు ఢిల్లీని పాలించాయి. ఇన్నేళ్లపాటు మీరేం చేసారో చూసుకోకుండా అధికారంలోకి వచ్చి ఒక్కరోజుకూడా కాని మాపై విమర్శలు చేస్తున్నారేమిటి? మొదటిరోజే మేం కేబినెట్ సమావేశం నిర్వహించాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయుష్మాన్‌భారత్‌యోజనను అందుబాటులోకి తెచ్చాం. దాంతో ప్రజలకు రూ.10 లక్షల మేర వైద్యసహాయం అందనున్నది. ఈపథకాన్ని ఆప్ అమలుచేయలేదు. మమ్మల్ని ప్రశ్నించే హక్కు వారికిలేదు. ప్రధాని మోడీ నాయకత్వంలో ఢిల్లీ తన హక్కులన్నీ సాధిస్తుందని ముందు మీరు మీ పార్టీగురించి చూసుకోండి అని హితవు పలికారు. ఎంతో మంది మీ పార్టీని వీడాలని ఆసక్తితో ఉన్నారు. కాగ్ నివేదికను అసెంబ్లీలోపెడితే అందరి జాతకాలు బయటపడతాయని ఆందోళన చెందుతున్నారని రేఖ దుయ్యబట్టారు. మహిళలకు రూ.2500 నెలనెలా ఆర్థిక సాయం అందించేపథకం మొదటి కేబినెట్ సమావేశంలో ఆమోదిస్తామని బిజెపి హామీ ఇచ్చిందని కానీ మొదటిరోజే ఉల్లంఘించిందని అతిశి విమర్శించారు. అయితే రేఖాగుప్తామాత్రం మహిళా దినోత్సవం మార్చి 8 నాటికి అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాల్లో నెలవారీ ఆర్థికసాయం రూ.2500 జమచేస్తామని తెలిపారు. ఢిల్లీ అభివృద్ధికోసం ఒక్కరోజును కూడా వృథా చేయనని ఆమె అన్నారు. పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ నివేదికలను అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే ప్రవేశపెడతామని చెప్పారు.



## టారిఫ్‌ల దెబ్బకు బ్రిక్స్ మాటే వినిపించట్లేదు..

## కూటమిదేశాలపై ట్రంప్ వ్యంగ్యోక్తులు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** బ్రిక్స్ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ కొంతకాలంగా గుర్రుగా ఉన్నారు. కూటమి దేశాలపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ప్రపంచ రిజర్వు కరెన్సీగా అమెరికన్ డాలర్‌స్థానంలో వేరే కరెన్సీ తెచ్చేందుకు ప్రయత్నిస్తే 150శాతం సుంకాలు విధిస్తామని పలుమార్లు తీవ్రంగా హెచ్చరించారు. తాజాగా బ్రిక్స్‌దేశాలపై మరోసారి ఆయన నోరుపారేసుకున్నారు. సుంకాలు విధిస్తామనగానే బ్రిక్స్ చెల్లాచెదురైపోయిందని వ్యంగ్యోక్తులు విసిరారు. బ్రిక్స్ దేశాలు డాలర్‌ను నాశనం చేయాలని చూస్తున్నాయని అందుకు ప్రయత్యామ్నాయంగా కొత్తకరెన్సీని సృష్టించాలనుకున్నాయని, డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని తీసుకొస్తే బ్రిక్స్‌పై 150శాతం సుంకాలు వేస్తామని తాను చెప్పగానే అందులోని దేశాలు పరస్పరం దూరం జరిగాయని తర్వాత ఆకూటమి మాటే వినిపించడంలేదని ట్రంప్ అన్నారు. ఇప్పటికే ట్రంప్ బ్రిక్స్ కూటమిపై ఘాటుగా స్పందించారు. బ్రిక్స్ ఒక చెడు ప్రతిపాదన తెచ్చిందని దీన్ని ఎవరూ అంగీకరించరని, డాలర్‌తో ఆటలాడితే 150శాతం సుంకాలు విధిస్తానని చేసిన హెచ్చరికతో ఆ ప్రతిపాదన గురించి మాట్లాడేందుకుసైతం భయపడుతు న్నారన్నారు. తాను ఈ వ్యాఖ్యలుచేసిన వెంటనే బ్రిక్స్ అంతం అయిందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యంలో కానీ మరేప్రాంతంలో అయినా కానీ అమెరికన్ డాలర్‌ను భర్తీచేసే అవకాశం బ్రిక్స్‌కు లేదని ఒకవేళ ఏదేశం అయినా ప్రయత్నిస్తే సుంకాలకు హాలోచెప్పి అమెరికాకు గుడ్‌బై చెప్పాల్సివస్తుందన్నారు. బ్రిక్స్‌కు ఉమ్మడి కరెన్సీ ఏదీ లేనప్పటికీ ఉక్రెయిన్‌తో యుద్ధం అనంతరం అనేక పశ్చిమ దేశాలనుంచి రష్యా ఆంక్షలను ఎదుర్కొనడంతో ఈ అంశంపై చర్చలు భారీగా సాగాయి.



# కేంద్రం ఏ భాషను నిర్బంధం చేయలేదు..

## స్టాలిన్ లేఖపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** కేంద్ర ప్రభుత్వం ఏ భాషను బలవంతంగా రుద్దడం లేదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. విదేశీ భాషపై అతిగా ఆధారపడటం వల్ల విద్యార్థులు భాషాపరమైన మూలాలను తెలుసుకోకుండా పరిమితం చేసినట్లవుతుందన్నారు. జాతీయ విద్యా విధానం ద్వారా ఈ పరిస్థితిని సరిచేసే ప్రయత్నం జరుగుతోందని మంత్రి ఎక్స్ వేదికగా వెల్లడించారు. తమిళ భాష శాశ్వతమని గతంలో ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యను ప్రస్తావించిన మంత్రి తమిళ సంస్కృతి, భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యను రాజకీయం చేయవద్దని విజప్తి చేశారు. మోడీకి తమిళనాడు సిఎం లేఖ రాసిన నేపథ్యంలో మంత్రి నుంచి ఈ స్పందన వచ్చింది. సమగ్రశిక్షా పథకంకింద రాష్ట్రానికి రూ.2,152 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయాలని ప్రధాని మోడీ ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కోరారు. ప్రధానికి రాసిన లేఖలో జాతీయ విద్యావిధానం - 2020ని పూర్తిగా అమలుచేసి త్రిభాషా విధానాన్ని ఆమోదించే వరకు తమిళనాడుకు సమగ్ర శిక్షా పథకం కింద నిధులు మంజూరు చేయబోమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ఇటీవల వెల్లడించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రంలోని విద్యార్థులు, రాజకీయ పార్టీలు, ప్రజలమధ్య ఆవేదన, ఆక్రోశం కలిగించిందని తెలిపారు. సమగ్ర శిక్షా పథకం కింద నిధులు మంజూరు చేయకపోతే ఉపాధ్యాయులకు వేతనం, విద్యార్థులకు సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు దెబ్బతింటాయన్నారు. 2024,25వ ఏడాదికి రాష్ట్రానికి అందాల్సిన రూ.2.152 కోట్లను వెంటనే మంజూరు చేయడానికి చర్యలు చేపట్టాలని కోరారు.



## దేశాల మధ్య వివాదాలు

# విచ్ఛిన్నానికి దారితీయొద్దు

జి-20 విదేశాంగమంత్రుల సమావేశంలో కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్

**ప్రిటోరియా, ఫిబ్రవరి 21:** ఏ కోణంలో చూసినా ప్రపంచ రాజకీయ పరిస్థితి సంక్లిష్టంగానే ఉందని విదేశాంగమంత్రి జైశంకర్ పేర్కొన్నారు. రాబోయే కాలంలో కృత్రిమమేధ, ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్షం, డ్రోన్లు, గ్రీన్ హైడ్రోజన్ వంటి అంశాల్లో భౌగోళిక రాజకీయ పరిస్థితుల ప్రభావం కచ్చితంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంఘర్షణ పరిస్థితులు, ఆర్థిక ఒత్తిళ్లు, ఆహార భద్రత, కొవిడ్ మహమ్మారి సవాళ్లు, వాతావరణ ఆందోళనలను ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్నాయన్నారు. జి-20 మన ఆసక్తులు, సంస్కృతులు, దృక్పథాల వైవిధ్యాన్ని సంగ్రహిస్తుందన్నారు. దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న విదేశాంగ మంత్రి జి-20 విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సమస్యలను ఎదుర్కోవడంలో, ప్రపంచ దేశాల ఎజెండాను ముందుకు తీసుకువెళ్లడంలో జి-20 కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ సమాఖ్యను కాపాడుకోవడం ప్రపంచ దేశాల తక్షణ కర్తవ్యమని అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు వివాదాలుగా మారి విచ్ఛిన్నానికి దారితీయకూడదని పేర్కొన్నారు.

**ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకం:** పశ్చిమాసియా ఘర్షణలు, సముద్ర భద్రత, ఉక్రెయిన్ వివాదం, ఇండో-పసిఫిక్, యుఎన్ సంస్కరణలపై భారతదేశ వైఖరిని జైశంకర్ తెలిపారు. గాజా కాల్పుల విరమణ, బందీల విడుదలను దేశం స్వాగతిస్తోందని అన్నారు. భారత్ ఎప్పుడూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించదని, మానవతా సహాయానికి మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఘర్షణలు నెలకొంటున్న ఆయా ప్రాంతాల్లో శాంతి, సుస్థిరత నెలకొనడం ప్రపంచ దేశాలకు చాలా అవసరమని అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రపంచదేశాలు ఒకదానికి ఒకటి సహాయ,సహకారాలు అందించుకోవాలని, అంతర్జాతీయ చట్టంప్రకారం కుదుర్చుకున్న ఒప్పందాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. రష్యా-ఉక్రెయిన్ వివాదంపై జైశంకర్ మాటాడుతూ యుద్ధం నివారించడానికి ఇరుదేశాల అధినేతలు చర్చల్లో పాల్గొనాలని భారత్ చాలాకాలంగా సూచిస్తోంద న్నారు. భారత్ యుద్ధాన్ని ప్రోత్సహించదని, దౌత్యాన్ని సమర్థిస్తుందని పేర్కొన్నారు. ఈ సమస్యకు త్వరలో ముగింపు పలకాలని కోరుతున్నట్లు తెలిపారు.

# ఎఫ్‌బిఐ కొత్త డైరెక్టర్‌గా కాశ్‌పటేల్




**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** అమెరికా దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) డైరెక్టర్‌గా భారతీయ అమెరికన్ కాశ్ పటేల్ నియామకాన్ని గురువారం సెనెట్ ఆమోదించింది. ఈ నేపథ్యంలో కాశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికన్లకు హాని చేయాలని చూస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ఎఫ్‌బిఐ తొమ్మిదో డైరెక్టర్‌గా నన్ను నియమించడం ఎంతో గౌరవంగా ఉంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అటార్నీ జనరల్ పామ్ బోండికి కృతజ్ఞతలు. ఎఫ్‌బిఐకి ఎంతో ఘనచరిత్ర ఉంది. దేశ ప్రజలకు పాదర్శకంగా, జవాబు దారీగా ఉండేందుకు బ్యూరో కట్టుబడి ఉంది. దేశం గర్వించేలా ఎఫ్‌బిఐని పునర్నిర్మిస్తాం. అమెరికన్లకు ఎవరైనా హాని చేయాలని చూస్తే.. వారి అంతు చూస్తాం' అని ఆయన రాసు కొచ్చారు. ఇదిలా ఉండగా ఎఫ్‌బిఐ డైరెక్టరుగా కాశ్ పేరును అలస్కాకు చెందిన రిపబ్లికన్ తోపాటు పలువురు డెమోక్రట్లు వ్యతిరేకించారు. అయితే 51-49ఓట్ల తేడాతో ఆయన నియామకం జరిగింది. దీంతో ఈ పదవిని చేపట్టిన తొలి హిందూ, భారతీయ అమెరికన్‌గా ఆయన నిలిచారు. అధ్యక్షుడు ట్రంప్‌నకు వీరవిధేయుడిగా కాశ్‌కు పేరుంది. పటేల్ కుటుంబ మూలాలు గుజరాత్‌లో ఉన్నాయి. ఆయన తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాలో పెరిగారు. ఉగాండా నియంత ఈదీ ఆమిన్ బెదరింపుల కారణంగా అతడి తండ్రి అమెరికాకు వలస వచ్చారు. 1980లో న్యూయార్క్‌లోని గార్డెన్‌సిటీలో పటేల్ జన్మించారు. యూనివర్సిటీ కాలేజ్ లండన్‌లో న్యాయవిద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత ఒక లా సంస్థలో పని చేయాలనుకున్నా కొలువు లభించలేదు. దీంతో ఆయన మియామీ కోర్టుల్లో పబ్లిక్ డిఫెండర్‌గా పనిచేసి వివిధ హోదాల్లో సేవలందించారు.

## వారణాసి సమీపంలో రోడ్డు ప్రమాదం

# కర్ణాటక బీదర్ వాసులు దుర్మరణం



**వారణాసి, ఫిబ్రవరి 21:** మహాకుంభమేళాకు వెళుతూ ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. భక్తులుప్రయాణిస్తున్న క్రూయిజర్ వాహనం లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదంజరిగింది. ఇ ప్రమాదంలో మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారణాసి జిల్లాలోని మీర్జామురారా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బీదర్‌జిల్లాలోని లడగేరి ప్రాంతానికి చెందిన 14 మందిక్రూయిజర్ జీపులో మహాకుంభమేళాకు బయలుదేరారు. వారి వాహనాన్ని యుపిలోని వారణాసి జిల్లా మీర్జాము రారా పోలీస్ స్టేషన్‌పరిధిలో రూపా పూర్‌గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్రూయిజర్ జీపు లోని ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ సహా మిగతా ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు.

## ట్రక్కును ఢీకొట్టిన బస్సు: నలుగురు మృతి, 30 మందికి గాయాలు



**కచ్(గుజరాత్), ఫిబ్రవరి 21:** కచ్‌జిల్లాలోని ముంద్రా ప్రాంతంలో ఒక ప్రయాణీకుల బస్సు, ట్రక్కు ఢీకొన్న సంఘటనలో నలుగురు మృతిచెందారు. మరో 30మందివరకూ తీవ్రగాయాలపాలయ్యారు. బస్సులో ప్రమాద సమయానికి 40 మందిప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన వారందరినీ సమీపంలోని ఆసుపత్రికి తరలించామని కచ్ ఎస్‌పి తెలిపారు. గత వారంలో కూడా ఒక టూరిస్టు వ్యాన్ ప్రయాణీకులతో మహాకుంభ్‌నుంచి తిరిగివస్తుండగా ఒక స్టేషనరీతో వెళుతున్న ట్రక్కును హైవేపైనే ఢీకొట్టింది. దాహోద్‌జిల్లాలో ఈసంఘటన జరిగింది. ఆ ప్రమాదంలో కూడా నలుగురు చినపోగా ఆరుగురు తీవ్రగాయాల పాలయ్యారు. ప్రస్తుతం ముంద్రా ప్రమాదంలో గాయపడిన అందరినీ వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఇంజినీరింగ్‌లో పారిశ్రామిక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

**నాలుగేళ్లల్లో 160 క్రెడిట్‌లు.. అదనంగా మైనర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లకు 20 క్రెడిట్‌లు**

**ఇంజినీరింగ్ సిలబస్ సవరణల కమిటీ సిఫారసులు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలన్నింట్లోనూ ఒకే విధమైన క్రెడిట్ సిస్టమ్‌ను అమలు చేయనున్నారు. ప్రతి సెమిస్టర్‌కి 20 క్రెడిట్స్ ప్రకారం.. మొత్తం 160 క్రెడిట్స్ ఉండేలాగా సిలబస్‌ను రూపొందించనున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్ సిలబస్ సవరణ కోసం తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఏర్పాటు చేసిన కోర్ కమిటీ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్ట రెడ్డి, వైస్ ఛైర్మన్1 ప్రొఫెసర్ ఈ పురుషోత్తం, వైస్ ఛైర్మన్2 ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్‌తోపాటు కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇంజినీరింగ్‌లో ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడానికి సిలబస్‌ను నవీకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించిన నేపథ్యంలో సమావేశం జరిగింది. పరిశ్రమ మరియు ప్రపంచ అవసరాల నేపథ్యంలో సిలబస్ సవరణ అవసరాన్ని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి వివరించారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు ఏకరీతి నిర్మాణం, క్రెడిట్ ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించాలని.. ప్రతి సెమిస్టర్‌లో నాలుగు సంవత్సరాల పాటు 20 క్రెడిట్‌లతో మొత్తం 160 క్రెడిట్‌లు ఉండాలని.. అదనంగా మైనర్, హానర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లకు 20 క్రెడిట్‌లు కేటాయించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్స్ (డీఎస్), సైబర్ సెక్యూరిటీ (సీఎస్) వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికత కోర్సులతో కలపడం ద్వారా కోర్ శాఖలను బలోపేతం చేయాలని.. అన్ని యూనివర్సిటీలు/కాలేజీలు మైనర్/హానర్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. పారిశ్రామిక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టితో రెండవ, మూడవ సంవత్సరాల చివరిలో రెండు తప్పనిసరి క్రెడిట్ ఆధారిత పారిశ్రామిక ఇంటర్న్‌షిప్‌లుండాలని సూచించారు. ఇంజనీరింగ్‌లో వేగంగా నేర్చుకునేవారికి క్రెడిట్‌లను సంపాదించడంలో సౌలభ్యంగా ఉంటుందని.. విద్యార్థి 6వ లేదా 7వ సెమిస్టర్ చివరి నాటికి 160 క్రెడిట్‌లను పూర్తి చేయవచ్చని.. తద్వారా మిగిలిన సెమిస్టర్(ల)ను పారిశ్రామిక ఇంటర్న్‌షిప్/ప్రాజెక్ట్ కోసం పూర్తి సమయం కేటాయించవచ్చని సూచించారు. ఇంజనీరింగ్ కోర్సులో కనీసం నాలుగు పారిశ్రామిక /క్షేత్ర సందర్శనలు చేయాలని సూచించారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను బోధించడానికి ప్రాక్టీస్ ప్రొఫెసర్ల సహకారం తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ అవగాహన ఒప్పందాల ప్రకారం అధ్యాపకులు మరియు విద్యార్థుల మార్పిడిని ప్రోత్సహించాలని సిఫారసుల్లో పేర్కొన్నారు.



అమ్మవారికి ప్రత్యేకపూజలు చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు

## పోలేపల్లి ఎల్లమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**దుద్యాల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండలంలోని పోలేపల్లిలో జరిగే ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సిఎంకు దేవాదాయ కమిషనర్ శ్రీధర్ పుష్పగుచ్ఛం అందజేసి, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారికి సిఎం పట్టువస్త్రాలు సమర్పించి, దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. వేద పండితులచే ఆశీర్వచనం అందుకున్నారు. ముఖ్యమంత్రితోపాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణా రావు, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, శాసనసభ్యులు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, దేవాలయ ఛైర్మన్ జయరాములు, ఇఒ రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేష్‌రెడ్డి, జయకృష్ణ, నర్సింలుగౌడ్, మేర్గు వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, యుగంధర్‌రెడ్డి, పులిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు కేంద్రం అన్యాయం

**ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్**




శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను ఇవ్వకుండా కేంద్రం మోసం చేసిందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మండిపడ్డారు. కృష్ణా జలాలపై తెలంగాణ ఏపీ మధ్య జరుగుతున్న చర్చలు.. దానిపై కేంద్రం స్పందనపై ఎమ్మెల్సీ కోదండరాం స్పందించారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. తెలంగాణ ఉద్యమానికి మూల కారణాలైన వాటిలో నీళ్ళ పంపకం ఒకటి అన్నారు. కృష్ణా జలాల నీటి వివాదంపై గత పదేళ్ళు అధికారంలో ఉండి కూడా మాట మాట్లాడకుండా ఉన్న బీఆర్ఎస్ నేతలు.. ఇపుడు ప్రతిపక్షంలోకి వచ్చేసరికి తాము పోరాటం చేస్తామని ముందుకు రావడం హాస్యాస్పదమన్నారు. గత పదేళ్లలో మీరు మౌనం వహించడం వల్లే.. ఈరోజు ఈ పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎనికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, టీజేఎస్ తరపున గట్టిగానే నిలదీస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ టీజేఎస్ మద్ధతు కోరిందని కోదండరాం మీడియాకు తెలియజేశారు.

## ప్రపంచంలో టాప్10 బ్యాంకుల్లో స్థానం సంపాదించాలి

**ఎస్‌బిఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** ప్రపంచంలోని టాప్ 10 బ్యాంకుల్లో స్థానం సంపాదించే విధంగా ఎస్‌బిఐ సిబ్బంది పని చేయాలని, ఇందుకు ఖాతాదారులు సహకారం కూడా ఎంతో అవసరం అని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఛైర్మన్ చల్లా శెట్టి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన రాష్ట్రంలోని (హైదరాబాద్) సర్కిల్లో 10 కొత్త (1. అలంపూర్ల్ రోడ్ 2. చిన్నం బావి 3. రాఘవేంద్ర కాలనీ (కొండాపూర్) 4. నియోపోలిస్ 5. కిష్టారెడ్డిపేట్ (పటాన్‌చెరు) 6. ఖాజాగూడ 7. ఉస్మాన్ నగర్ 8. కంగ్టి (నారాయణఖేడ్) 9. సుచిత్ర సర్కిల్ (కుత్బుల్లాపూర్) 10. నందిపేట్) శాఖలను వర్చువల్‌గా ప్రారంభించారు. చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ శ్రీ చల్లా శ్రీనివాసులు శెట్టి ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో (హైదరాబాద్ సర్కిల్) పది కొత్త శాఖలను చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ రాజేష్ కుమార్ సమక్షంలో వర్చువల్‌గా ప్రారంభించారు. ఆ శాఖలు 2024లో దేశంలోని అత్యుత్తమ బ్యాంకుల జాబితాలో 4వ స్థానంలో ఉందని దీన్ని మరింత ముందుకు తీసుకెళ్ళ బాధ్యత సిబ్బందిపై ఎంతగానో ఉందన్నారు. ఈ నూతన బ్యాంకుల ఏర్పాటుతో రాష్ట్రంలో ఎస్‌బిఐ బ్రాంచ్‌ల సంఖ్య 1206కు చేరుకున్నట్లు తెలిపారు. బ్యాంకులు లేని ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను సులభంగా పొందేలా చేయడం, అభివృద్ధి చెందుతున్న పట్టణ కేంద్రాల్లోని ప్రజల పెరుగుతున్న బ్యాంకింగ్ అవసరాలను తీర్చడం వంటి చర్యలు బ్యాంకుల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడ తాయన్నారు. కస్టమర్ మన విశ్వానికి కేంద్రమని, కస్టమర్ కేంద్రీకృతి, వ్యాపార వృద్ధి, స్థిరమైన వృద్ధి, ఉద్యోగుల కేంద్రీకృతి అనే నాలుగు ప్రాథమిక సూత్రాలపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు.దేశ ఆర్థిక భవిష్యత్తును రూపొందించడంలో బ్యాంకు కీలక పాత్ర పోషిస్తుంది. దీనిని సాధించేందుకు ఉద్యోగులు ఉత్తమ బ్యాంకుగా, అత్యంత విలువైన బ్యాంకుగా ఉండేలా చూసుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు. మరింత మంది ఖాతాదారులను చేర్చుకోవడం, అత్యున్నత స్థాయి బ్యాంకింగ్ సేవలను అందించడం వంటి కార్యక్రమాలపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు.




## రుణమాఫీ కాలేదంటూ గాంధీభవన్ వద్ద రైతుధర్నా

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తుంగతుర్తి నియోజకవర్గం శాలిగౌరం మండలం అంబర్‌పేట్ గ్రామానికి చెందిన చెందిన తోట యాదగిరి అనే వృద్ధ రైతు శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు చేరుకుని రుణమాఫీ తనకు చేయలేదని ధర్నా చేపట్టారు.తనకు రుణమాఫీ చేసే వరకు ఇక్కడ్నుంచి కదిలేది లేదని ఆ రైతు తేల్చిచెప్పాడు. తనకు మూడు లక్షలకు పైగా పంట రుణాలు ఉన్నాయని రెండులక్షలు మాఫీచేస్తే నేను ఒక లక్షరూపాయలు కట్టుకొనేటోడినని అన్నారు. 55 క్వింటాళ్ల 80 కిలోల ధాన్యాన్ని విక్రయిం చాను. కానీ ఇప్పటి వరకు బోనస్ రాలేదని ఆవేదన చెందారు.రైతుభరోసా మాప్రభుత్వం రాగానే పెంచిన మొత్తం ఇస్తదని చెప్పి ఇప్పుడు ఇంకా వేయడంలేదని ఇటు పెన్షన్లు కూడా రావడంలేదని ఆయన గాంధీభవన్ మెట్లపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి 2 లక్షల రుణమాఫీ చేయాలి. ప్రభుత్వం దిగి వచ్చే వంకు నేను ఇక్కడ్నుంచి కదలను అంటూ భీష్మించుకొని కూర్చొన్నారు.. నేను అబద్ధమాడితే జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమే అని రైతు తోట యాదగిరి తేల్చి చెప్పాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామిని నిల బెట్టు కొన్నప్పటికి కొంతమంది ప్రతిపక్షాల తప్పుడు ప్రచారంతో ప్రేరేపించబడి అదడదపడా రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ హామిలు నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయనే తప్పుడు ప్రచారంకు ఆకర్షితులై చాలా మంది రైతులకు రుణమాఫీ కాకలేదని భావించుకొని రేవంత్ సర్కార్‌పై ఆగ్రహంతో ఉన్నారు. అవకాశం ఉన్నచోట ప్రతిపక్షాల బోధనలకు ప్రేరేపితులైన రైతులు నిరసన తెలుపుతున్నారు.

## మార్చి 4, 5 తేదీల్లో డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఉత్తీర్ణులకు వైవా

**షెడ్యూల్‌ను విడుదల చేసిన టిజిపిఎస్‌సి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్‌సీ) నవంబర్-2024లో నిర్వహించిన డిపార్టమెంటల్ పరీక్షలకు వైవాను నిర్వహించనుంది. నవంబర్‌లో లాంగ్వేజెస్ పరీక్షలకు హాజరై అర్హత సాధించిన వారికి మార్చి 4, 5 తేదీల్లో వైవా నిర్వహించాలని టీజీపీఎస్‌సీ నిర్ణయించింది. సంబంధిత షెడ్యూల్‌ను కమిషన్ శుక్రవారం జారీచేసింది. వైవాకి అర్హత సాధించిన వారి జాబితాను కమి షన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ప్రకటించింది. అర్హులైన అభ్యర్థులు మార్చి 4, 5 తేదీల్లో కమిషన్ కార్యాలయంలో వైవాకి గంట ముందుగా వివరాలను నమోదు చేసుకొని బయోమెట్రిక్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు చేతులకు మెహందీ వేసుకోవడం గానీ, తాత్కాలిక టాటూస్ వేసుకోవడం చేయవద్దని కమిషన్ సూచించింది.

## కృష్ణా జలాల వాటాలో తెలంగాణకు అన్యాయం చేసిన బిఆర్ఎస్

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలను తాకట్టుపెట్టి లక్షా81వేల కోట్లు అప్పు తీసుకొచ్చినా కృష్ణాజలాల వాటా విషయంలో తెలంగాణకు బిఆర్ఎస్ అన్యాయం చేసిందని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులకు మంత్రులకు కృష్ణా ప్రాజెక్టులపై మాట్లాడే నైతికత లేదని అన్నారు. గత పదిసంవత్సరాలు బిఆర్ఎస్ నిర్లక్ష్యం చేశారని ఉత్తమ్ పేర్కొన్నారు. దక్షిణ తెలంగాణలో 100 టిఎంసిల నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం కలిగిన ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేయ లేదని ఆయన అరోపించారు. ఎస్ఎల్‌బిసి, డిండి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు నిధు లు కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈ ప్రాజె క్టులు పూర్తి చేసుకొంటామని ఆయన తెలిపారు.

## యాదగిరిగుట్ట కుంభాభిషేకం సంప్రోక్షణ మహోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**భువనగిరి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లాలో యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనంసింహ స్వామివారి బంగారు విమాన గోపురం మహా కుంభా భిషేకం సంప్రోక్షణ మహోత్సవ కార్యక్రమానికి ఈ నెల 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ ఏర్పా ట్లను పకడ్బందీగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాలులో ముఖ్య మంత్రి పర్యటన సందర్భంగా జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.పోలీస్, రెవెన్యూ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, దేవాదయ శాఖ, అర్ అండ్ బి, ట్రాన్స్ పోర్ట్, ఎలక్ట్రిసిటీ, ఫైర్, పంచాయితీ, ఎక్సైజ్, మత్స్య శాఖ, వైద్య శాఖ, మిషన్ భగీరథ, ట్రాన్స్ కో, డిపిఆర్ఓ,సివిల్ సప్లై, వ్యవసాయ శాఖ, ట్రాఫిక్ తదితర శాఖల ఏర్పాట్ల పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలు అధికారులు సంపూర్ణ సమన్వయంతో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. భద్రత ఏర్పాట్లు, శాంతి భద్రతలు, పూర్తి స్థాయిలో పోలీస్ బందోబస్తును పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను, అగ్నిమాపక పరికరాలను, సేవలను అందుబాటులో ఉంచాలని అగ్నిమాపక శాఖను, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖను, రోడ్ల మరమ్మత్తుల పనులను అర్.అండ్.బి, అధికారులు, శానిటేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయితీ శాఖ, ఈ ఏర్పాట్లన్నీ ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ కృష్ణ రెడ్డి,సీఈఓ శోభారాణి, ట్రాఫిక్ ఏసిపి ప్రభాకర్ రెడ్డి, డిఆర్డిఏ నాగిరెడ్డి, ఏ.ఓ జగన్మోహన్ ప్రసాద్ ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




ఇండిగో విమాన సేవలు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

## హైదరాబాద్ విమానాశ్రయం నుంచి మదీనాకు ఇండిగో కొత్త విమానసేవలు ప్రారంభం

**హైదరాబాద్ (శంషాబాద్). ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** జీఎంఆర్ హైదరాబాదు అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఇండిగో ఎయిర్‌లైన్స్‌తో కలిసి హైదరాబాద్ మదీనాకు కొత్త విమాన సేవలను శుక్రవారం ప్రారంభించింది. తొలి విమానం ఆనందోత్సాహం మధ్య సీనియర్ అధికారుల సమక్షంలో శుక్రవారం బయలుదేరింది. ఈ సేవ ప్రతివారం మూడు రోజులుపాటు ఉం టాయని తెలిపారు. ఈ విమానసర్వీసులు సోమ, గురు, శనివారం అందుబాటులో ఉంటాయి. గమ్యస్థానం చేరడానికి 5 గంటలు 47 నిమిషాలు. పడుతుందని వివరించారు. ఈ కొత్త సేవతో అంతర్జాతీయ కనెక్టివిటీ మరింత మెరుగవుతుందని స్పష్టంచేశారు. హైదరాబాదు అంత ర్జాతీయ విమానాశ్రయం సీఈఓ ప్రదీప్‌పనికర్ మాట్లాడుతూ, 'మదీనాకు ఇండిగో తొలి విమానాన్ని స్వాగతించడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ కొత్తమార్గం మా అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను విస్తరించడమే కాకుండా, హైదరాబాదును ప్రపంచంలోని అత్యంత ప్రముఖమైన ఆధ్యాత్మిక నగరాలలో ఒకటైన మదీనాతో అనుసంధానించే ప్రత్యేక ప్రయాణ అనుభవాన్ని ప్రయాణికులకు అందిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ కనెక్టివిటీని మెరుగుపరచడం, ఎయిర్‌లైన్స్ కార్యకలాపాల విస్తరణకు మద్దతు ఇవ్వడం ప్రయాణికులకు సులభమైన సేవలు అందించ డానికి కట్టు బడి ఉంటామని అన్నారు. దక్షిణాసియా ఆగ్నేయాసియాలోని ప్రయా ణికులకు ఇప్పుడు హైదరాబాదులో అభివృద్ధి చెందుతున్న గ్లోబల్‌హబ్ ద్వారా మరిన్ని ప్రయాణ ఎంపికలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## పిసిసి విస్తృతస్థాయి కార్యవర్గం సమావేశం వాయిదా

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం గాంధీభవన్‌లో జరగాల్సి ఉండగా దానిని వాయిదా వేశారు. శాసనమండలి ఎన్నికలు ఈ నెల 27న ఉండటంతో సమా వేశం వాయిదాను నిరవధికంగా వాయిదా వేశారు. విస్తృతస్థాయి సమావేశంలో చర్చించాల్సిన ఎమ్మెల్సీ ఎన్నికల అంశంపై ఒకరోజు ముందే పిసిసి చీఫ్ మహేష్ కుమార్ అధ్యతన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ ప్రాదేశిక నియోజకవర్గం పరిదిలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహించే ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు పాల్గొని ఎన్నికల గెలుపు కోసం వ్యూహరచనకు దశదిశను నిర్దేశించారు. ఈ నెల 23న జరగాల్సిన పిసిసి కార్యవర్గ సమావేశం తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా మీనాక్షి నటరాజన్ నియ మితులయ్యాక ఏర్పాటు చేసిన తొలి సమావేశం కావడంతో అత్యంత ప్రాధాన్యత ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల బిజీ కారణంగా వాయిదా వేశారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య. చిత్రంలో ఎన్.మారేష్, జబ్బుల శ్రీనివాస్, సి.రాజేందర్, భూపేష్‌సాగర్ తదితరులు

## 12, 13 తేదీల్లో ఢిల్లీలో 'జాతీయస్థాయి మేధావుల సదస్సు'

**యావత్ బిసిలు పాల్గొనాలి: ఎంపి ఆర్.కృష్ణయ్య**

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ' పేరిట మార్చి 12, 12 తేదీల్లో ఢిల్లీలోని ఎపి భవన్‌లో 'జాతీయస్థాయి మేధావుల సదస్సు' నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం, దక్షిణాది రాష్ట్రాల ఒబిసి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో కేంద్రమంత్రులు, ఎంపిలు, ఎపి, తెలంగాణ, దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 100 బిసి సంఘాల ప్రముఖులు పాల్గొంటారని, బిసిలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చలో ఢిల్లీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన జరగవలపిన చారిత్రాత్మక అవశ్యకత ఎంతైనా ఉందని, ప్రధాని నరేంద్రమోడీ వెంటనే చోరవ తీసుకుని బిసి బిల్లు, ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల ఒబిసి సంఘం అధ్యక్షుడు జబ్బుల శ్రీనివాస్, బిసి నేతలు సి.రాజేందర్, పీతాను ప్రసాద్, నడిపిన శ్రీనివాస్‌రావు, నీలం వెంకటేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులను చితకబాదిన ఇంటర్ స్టూడెంట్లు

**రుక్మాపూర్ సైనిక్ స్కూల్లో ఘటన**

**పట్టించుకోని డైరెక్టర్, ప్రిన్సిపాల్**

**గతంలోనూ ఘటన.. తల్లిదండ్రుల ఆందోళన**

**విద్యార్థులను గోప్యంగా ఆస్పత్రికి తరలించిన స్కూల్ సిబ్బంది**



**చొప్పదండి, ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల సైనిక్ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు పదో తరగతి చదువుతున్న విద్యార్థులను చితకబాదిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది ఈ విషయాన్ని సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్ డైరెక్టర్ గోప్యంగా ఉంచి విద్యార్థులకు వైద్య సేవలు అందించినట్లు సమాచారం వివరాల్లోకి వెళితే ఈనెల 20న సాయంత్రం ఇంటర్మీడియట్ విద్యార్థులు 10 మంది కలిసి పదో తరగతి చదువుతున్న 8 మంది విద్యార్థులపై భౌతికంగా దాడి చేశారు ఈ దాడిలో కొందరికి గాయాలు కాగా రాత్రి కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు విశ్వాసనీయ సమాచారం ప్రిన్సిపల్ సైనిక్ స్కూల్ డైరెక్టర్ నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తల్లి దండ్రులు ఆరోపిస్తున్నారు విషయం తెలిసిన తల్లిదండ్రులు శుక్రవారం మధ్యాహ్నం సైనిక్ పాఠశాల కు చేరుకొని ఆందోళన నిర్వహించారు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని ఆందోళన నిర్వహించారు సంఘటన స్థలానికి ఎస్సై గొల్లపల్లి అనూష చేరుకొని విద్యార్థుల తల్లిదండ్రులతో విద్యార్థులతో మాట్లాడారు గతంలో కూడా పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులను దాడి చేసిన సంఘటన కూడా చోటుచేసుకుంది మళ్లీ ఇలాంటి సంఘటనలు పునారవృతం అవుతున్నాయి ఇదిలా ఉండగా విద్యార్థులు కొందరు మత్తుపదార్థాలకు బానిస అవుతున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి సైనిక్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి మద్యం సేవిస్తున్నారని సంఘటనలు కూడా జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి ప్రిన్సిపల్ డైరెక్టర్ నిర్లక్షయంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులను పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు పిల్లలను విద్యాబుద్ధులు నేర్చుకోవడానికి పంపిస్తే క్రమశిక్షణ లేకుండా చేస్తున్నారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రిన్సిపాల్ ను డైరెక్టర్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



ప్రజావాణిలో దరఖాస్తులు అందజేస్తున్న దరఖాస్తుదారులు

## ప్రజావాణిలో అందిన దరఖాస్తులు 1,244

**హైదరాబాద్ (బేగంపేట), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1,244 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 76 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 61 దరఖా స్తులు, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 36 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 1,007 దరఖాస్తులు అందాయి. ఇతర శాఖలకు సంబంధించి 237 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించారు.

## దోచి, దాచిపెట్టిన అధికారులపై వేగంగా విచారణ చేపట్టాలి

**ఆ అధికారుల వల్లే ప్రభుత్వానికి చెడ్డపేరు**

**చర్యలు తీసుకొనే సమయం ఆసన్నమైంది**

**పిసిసి ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణలోని అధికారుల తీరువల్లే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆవేదన చెందారు. శుక్రవారం ప్రసారమాధ్యమ ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ దోచిపెట్టిన దాచిపెట్టి అధికారులపై వేగంగా విచారణ జరుగాలని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వంలో పెత్తనం చేసిన అధికారులు ఇప్పుడూ ఉండటంతో ప్రతిపక్ష పార్టీతో కుమ్మక్కై ప్రభుత్వ సమాచారాన్ని బట్టబయలు చేస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ పాలనలో పదేళ్ల కీలకంగా వ్యవహరించిన అధికారులను పక్కన పెట్టాలని ప్రభుత్వ పెద్దలకు ఆయన సలహా ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో ఇంటెలిజెన్స్ పూర్తిగా విఫలమైందని చాలాచోట్ల ఇది కనపడుతోందని ఆయన అన్నారు. పోలీసుల వైఫల్యం కారణంగానే భూపాలపల్లిలో రాజలింగమూర్తి హత్య జరిగిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు అవినీతి అధికారుల జబితా చేరిందని ఇక వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేష్‌కుమార్ బాగోతం ఇంకా బయట పడటంలేదని ఆయన అండతోనే జిఎస్‌టి కుంభ కోణం జరిగిందిన ఆయన వివరించారు. అమయ్ కుమార్ లాంటి వారిపై చర్యలు అవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. విచారణలో వేగం తగ్గడంతో 'రాజీ'పడ్డామనే ఆరోపణలు కాంగ్రెస్‌పై వస్తున్నాయని అన్నారు. సంధికాలం ముగిసింది ఇక అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన సమయం కూడా ఆసన్నమైందని అన్నారు. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించినవారిని పక్కనపెట్టాల్సిన అవసరం ఉంది. అవినీతిపై విచారణ చేయాల్సిన అధికారులు కూడా దోషులు కావడంతో విచారణ ముందుకు సాగడంలేదు. సింగరేణిలో కల్వకుంట్ల కవితకు అన్ని రకాలుగా సహకరించిన అధికారి మా ప్రభుత్వంలో ఉన్నత స్థానంలోప ఉన్నారు.



యాదగిరిగుట్ట స్వర్ణవిమాన గోపురం మహాకుంభాభిషేకం కార్యక్రమానికి రావాలంటూ మాజీ సిఎం కెసిఆర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న దేవస్థానం ప్రధాన పూజారి వెంకటేశ్వరాచార్యులు, ఇఒ తదితరులు

## యాదగిరిగుట్ట స్వర్ణవిమాన గోపుర మహాకుంభాభిషేకానికి కెసిఆర్‌కు ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన స్వర్ణ విమాన గోపురానికి.. ఈనెల 23న మహా కుంభాభిషేకం కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, యాదగిరి గుట్ట పునర్నిర్మాణ కర్త, బిఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావును ఆలయ పూజారులు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. అనంతరం.. మార్చి నెల 1 నుంచి 11 వ తేదీ వరకు జరిగే యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాల్సిందిగా కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు యాదగిరి గుట్ట దేవస్థానం ప్రధాన పూజారి, ఆలయ కార్యనిర్వహణ అధికారులతో కూడిన బృందం శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో కేసీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వేద మంత్రాలతో కేసీఆర్‌కు ఆశీర్వచనం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వరాచార్యులు, డీఈఓ భాస్కర్, ముఖ్య అర్చకులు నరసింహమూర్తి, కిరణ్ కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## మా అమ్మ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారు

### సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తన తల్లి అంజనాదేవి సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన చేస్తూ మా తల్లి అస్వస్థతకు గురయ్యారని, ఆసుపత్రిలో చేరారంటూ కొన్ని మీడియా కథనాలు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. రెండు రోజులుగా ఆమె కాస్త అస్వస్థతకు గురయ్యారని, కానీ ఇప్పుడు ఆమె పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని, ఆమె ఆరోగ్యంపై ఎలాంటి ఊహాజనిత వార్తలు ప్రచురించవద్దని విజ్ఞప్తి చేశారు.

## యూట్యూబర్ లోకల్‌బాయ్ నానిపై చర్యలు తీసుకోండి

### ఎపి డిజిపిని కోరిన టిజిఎస్‌ఆర్టీసి ఎండి సజ్జనార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** అమాయకులను ఆన్‌లైన్ బెట్టింగ్ కూపంలోకి లాగేందుకు కొందరు చిత్ర విచిత్ర వేషాలను వేస్తున్నారంటూ గతంలో టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని సూచనలు చేస్తుంటారు. శుక్రవారం మరో ఏపీ రాష్ట్రానికి యూట్యూబర్‌పై ఎక్స్ వేదికగా సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యూట్యూబర్ లోకల్‌బాయ్ నాని చేసిన బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్లపై సజ్జనార్ సీరియస్ అయ్యారు. లోకల్‌బాయ్ నానిపై చర్యలు తీసుకోవాలని ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్‌ని కోరారు. డబ్బు సంపాదించుకోవాలంటే అనేక మార్గాలున్నాయని, బెట్టింగ్ భూతాలను ప్రమోట్ చేసి ప్రజలను చెడగొట్టవద్దని సూచించారు. యువతను బెట్టింగ్ యాప్‌లకు బానిసలను చేయడం సరికాదని తెలిపారు. చట్టప్రకారం శిక్షలు తప్పవని మర్చిపోవద్దని హెచ్చరించారు.

## ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జ్ సిఇఒగా మరోసారి ఐఎఎస్ అధికారి కర్ణన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి21:** ఐఏఎస్ అధికారి ఆర్వీ కర్ణన్‌కు ప్రభుత్వం మరో కీలక బాధ్యత అప్పగించింది. ఆరోగ్యశ్రీ ఇంచార్జ్ సీఈవోగా మళ్లీ ఐఏఎస్ అధికారి కర్ణన్ నియమించింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరోగ్యశ్రీ విభాగంలో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఆరోపణలు రావడంతో సీఈవో శివశంకర్‌ను జిఏడీకి అటాచ్ చేసింది. మరోవైపు ఇటీవలే రాష్ట్రంలో 8 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

## పెళ్లి మంటపంలో విషాదం

### కన్యాదానం చేస్తుండగా తండ్రి మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** బంధుమిత్రులు కుటుంబ సభ్యుల ఆనందోత్సవాల మధ్య జరుగుతున్న వివాహ వేడుకల్లో విషాదఛాయలు చోటు చేసుకున్నాయి దీంతో అక్కడ పెళ్ళికి మోగవలసిన భాజా భజంత్రీలు మూగపోయాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా, బిక్కనూరు మండలంలోని రామేశ్వర పల్లి గ్రామానికి చెందిన కుడిక్యాల బాలచంద్రంకు ఇద్దరు కూతుళ్లు ఉండగా పెద్ద కూతురు కనక మహాలక్ష్మి వివాహం మండల పరిధిలోని బేసిక్ ప్రాంతంలో విశాలమైన ప్రాంతంలో ఏర్పాటు చేశారు. అక్కడ బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల మధ్య వివాహ వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కన్యాదానం చేస్తున్న సమయంలో బాలచంద్రంకు గుండెపోటు వచ్చింది. వెంటనే అక్కడ ఉన్న బంధుమిత్రువులు గమనించి ఆయనను కామారెడ్డి జిల్లా కేంద్రంలో గల ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు, ధ్రువీకరించారు. దీంతో కుటుంబ సభ్యులకు విషయం తెలియడంతో మండపంలో విషాదఛాయలు చేసుకున్నాయి. అక్కడ మంటపంలో కార్యక్రమాలను హుటాహుటిన ముగించు కున్నారు. మండపంలో ఉన్న ప్రతి ఒకరు కంటతడి పెడుతూ మృతుని ఇంటికి తరలి వెళ్లారు. మృతుడు కామారెడ్డి పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా పనిచేస్తున్నారు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆయన మృతి పట్ల సంతాపం తెలియజేశారు.

# ఈ యాసంగిలో 9.80 లక్షల టన్నుల యూరియా

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత ఐదేళ్లలో అత్యధికంగా 2022- 23 యాసంగిలో 9.80 లక్షల టన్నుల యూరియా వాడకం ఉన్నదని, దానిని ప్రామాణికంగా తీసుకొని, అంతకంటే ఎక్కువగా యూరియా అందుబాటులో ఉంచేటట్టు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ సచివాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబర్ నుండి ఇప్పటి వరకూ కేంద్రం నుండి 8.54 లక్షల టన్నుల సరఫరా ప్రణాళికలు ఇవ్వగా, కేవలము 6.73 లక్షల టన్నులు మాత్రమే సరఫరా కాబడిందన్నారు. ఇదే విషయాన్ని సీజన్ ఆరంభములో కూడా కేంద్రం దృష్టికి తీసుకువెళ్లగా, రాష్ట్ర అవసరాలను పరిగణలోకి తీసుకొని ఎప్పటికప్పుడు సరఫరా చేసే బాధ్యత తమదని కేంద్రం నుండి భరోసా వచ్చినప్పటికి అది అమలు కాలేదని తెలిపారు.

ఫిబ్రవరిలోనే 45 వేల టన్నుల యూరియా తక్కువగా రావడం జరిగిందని తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద రైతుల అవసరాలకు తగ్గట్టు ప్రారంభ నిల్వ ఉన్న 3.08 లక్షల టన్నులను ఇప్పటిదాకా సరఫరా చేయడం జరిగిందని చెప్పారు. ఇకముందు కూడా ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 1.30 లక్షల మెట్రిక్ టన్నులను అవసరాల మేరకు ఆయా జిల్లాలకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఇదే సమయంలో రాష్ట్రానికి ఈ నెలలో రావాల్సిన యూరియాను వెంటనే ఇతర కంపెనీల ద్వారా సరఫరా చేయుటకు ఈ రోజు కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల శాఖ మంత్రి వర్యులను లేఖ ద్వారా తిరిగి కోరడం జరిగిందని వెల్లడించారు. కావున రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదదన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు గోపి తదితరులు పాల్గొన్నారు.

# పూర్తిస్థాయిలో ఖర్చుకాని ఎస్ఎస్ఎ నిధులు!

### గత యేడాది రూ. 1,913 కోట్లకు పిఎబి ఆమోదం

### ఈ సంవత్సరం రూ. 1,600 కోట్లకే ప్రతిపాదనలు పంపాలని సూచన

### పూర్తిస్థాయిలో ఖర్చు చేయకపోవడంతోనే ప్రతిపాదనల తగ్గింపు?

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** పాఠశాల విద్య శాఖలో అమలవుతున్న సమగ్ర శిక్ష పథకం కింద కేంద్రం ఇస్తున్న నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు పెట్టకపోవడంతో.. ఈ ఏడాది కేటాయించాల్సిన నిధుల్లో కోత పెట్టినట్టు తెలుస్తోంది. గత ఏడాది 2024-25 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్ఏ కింద రాష్ట్రానికి రూ. 2347.50 కోట్లు కావాలని పాఠశాల విద్య కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. ప్రతిపాదనలను పరిశీలించిన అందులో రూ. 1913 కోట్లకు ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు(పీఏబీ)లో కేంద్రం ఆమోదం తెలిపింది. అందులో రూ. 1148.34 కోట్లు కేంద్రం వాటా కాగా.. రాష్ట్ర వాటా రూ. 765.56 కోట్లుగా పేర్కొంది. అయితే పీఏబీలో కేంద్రం ఆమోదం తెలిపిన మొత్తాన్ని కూడా రాష్ట్రంలో ఖర్చు చేయకపోవడంతో.. ఈ ఏడాది రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులకి సంబంధించి రూ. 1600 కోట్ల వరకే ప్రతిపాదనలను సమర్పించాలని కేంద్రం సూచించినట్టు తెలుస్తోంది. అందుకే గతేడాది పీఏబీ ఆమోదించిన బడ్జెట్ కంటే ఈ ఏడాది ప్రతిపాదనల్లోనే కోత పెట్టినట్టు తెలుస్తోంది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఎస్ఎస్ఏ పథకాన్ని నిర్వహిస్తున్నారు. నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లలో పథకానికి సంబంధించిన నిధులను కేంద్రం మంజూరు చేస్తూ ఉంటుంది. ఈ పథకంలో కేంద్రం 60 వాటా శాతం కాగా.. రాష్ట్ర ప్రభుత్వం వాటా 40 శాతం ఉంటుంది. ఈ పథకంలో భాగంగా ప్రధానంగా పాఠశాల విద్యలో మౌలికవసతుల కల్పన, నాణ్యమైన బోధనకు వీలు కల్పించేందుకు ఈ పథకం ద్వారా నిధులను ఖర్చుచేస్తారు. కేజీబీవీలు, టీచర్ల ట్రైనింగ్స్, యూనిఫారాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు సహా మౌలిక వసతుల కోసం ఈ పథకం ద్వారా నిధులను ఖర్చుచేస్తారు. 2024-25 విద్యాసంవత్సరానికి రాష్ట్రానికి పీఏబీ రూ. 1,913కోట్లకు ఆమోదం లభించింది. అందులో కేంద్రం వాటా రూ. 1,148.34 కోట్లు కాగా.. రాష్ట్రవాటా రూ. 765.56కోట్లు. కేంద్రం ఇవ్వాల్సిన నిధులను నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లల్లో విడుదల చేస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం సైతం నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లల్లో నిధులను కలిపి విడుదల చేస్తుంది. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు కేంద్రం మూడు ఇన్‌స్టాట్‌మెంట్ల నిధులను విడుదల చేసింది. వాటిలో రెండు ఇన్‌స్టాల్‌మెంట్ నిధులను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేసింది. మూడో ఇన్‌స్టాట్‌మెంట్ కింద కేంద్రం రూ. 242 కోట్లను విడుదల చేయగా.. రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 161 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా.. ఇప్పటికీ విడుదల చేయనట్టు తెలిసింది. మూడో ఇన్‌స్టాల్‌మెంట్ నిధులు ఖర్చు కాకపోవడంతో.. నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్ నిధులు రావడం ప్రశ్నార్థకంగా మారాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి నెల మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్‌తోపాటు నాన్ రికరింగ్ నిధుల విడుదలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికే ఇచ్చిన నిధులు ఖర్చుచేయకపోవడంతో .. నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్ నిధుల విడుదలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో 2025-26 విద్యాసంవత్సరంలో పీఏబీలో రూ. 300కోట్లకు కోతపడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పీఏబీ సమావేశాలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

# అంగన్‌వాడీ భోజనంపై దృష్టి

### ఫిర్యాదుల నేపథ్యంలో టిజి ఫుడ్స్‌కు ఐఎఎస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అంగన్వాడీలకు సరఫరా చేసే ఆహారం నాణ్యతపై విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా అంగన్వాడీలకు పంపిణీ చేసే బాలామృతం క్వాలిటీగా ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తెలంగాణ ఫుడ్స్ పై రాష్ట్ర సర్కార్ దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో టీజీ ఫుడ్స్ ఎండీ బాధ్యతలను ఐఏఎస్‌కు అప్పగించింది. ఇప్పటివరకు టీ జీఫుడ్స్ ఎండీగా గ్రూప్-1 అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఉండగాచ ఆయన స్థానంలో ఐఏఎస్ చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం తార్నాకలోని టీజీ ఫుడ్స్ కార్యాలయ ఉద్యోగులు ఉన్నతాధికారులపై ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. ప్రధానంగా సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారని, టెండర్లు పిలవకుండా నామి నేషన్లపై పనులు అప్పగిసు_న్నారని, రికార్డులు మెయింటెన్ చేయకుండా రాతపూర్వక నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోణలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో నాణ్యత లేని సరుకులు సప్లై చేసిన కాంట్రాక్టర్లకు నోటీసులివ్వాలని అధికా రులను ప్రభుత్వం ఆదేశించింది.

# పవార్‌కు గ్లాసులో నీళ్లుపోసి అందించిన ప్రధాని మోడీ!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** దేశరాజధాని ఢిల్లీలో జరుగుతున్న 98వ అఖిలభారత మరాఠి సాహిత్య సమ్మేళనంలో ఆసక్తికర సంఘటనలు జరిగాయి. విజ్ఞాన్‌భవన్ వేదికగా జరుగుతున్న సభలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఎన్సీపీ ఎస్పీ అధినేత శరద్‌పవార్ నడుమ ఆసక్తికర సన్నివేశాలు జరిగాయి. పవార్‌కుర్చీలో కూర్చోడానికి మోడీ సాయం చేయడంతోపాటు తన చేతితో స్వయంగా గ్లాసులో నీళ్లునింపి పవార్‌కు అందించారు. దీనితో అక్కడున్న వారంతా చప్పట్లతో హర్షం వ్యక్తం చేసారు.

మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరాఠి భాషకు కొన్నినెలల క్రితం కేంద్రం శాస్త్రీయభాషా హోదా కల్పించింది. ఈ క్రమంలోసుమారు 71 యేళ్ల తర్వాత ఢిల్లీ వేదికగా రెండోసారి ఈ సదస్సు నిర్వహించారు. తొలిసారి జవహర్‌లాల్ నెహ్రూ ఢిల్లీలో మరాఠా సదస్సును నిర్వహిం చారు.




పవార్ ఈ సందర్భంగా మోడీని ప్రశం సించారు. కార్య క్రమానికి ఆహ్వానిస్తే కాదనకుండా అంగీకరించారన్నారు. మరాఠికి ఉన్నతభాష హోదా ఇవ్వడంతో ప్రధానిమోడీ పాత్ర కీలకం అన్నారు. తన ప్రసంగం ముగించి వచ్చి కుర్చీలో కూర్చునే క్రమంలో ఈ అరుదైన సందర్భాలు కనిపించాయి.

# హైదరాబాద్‌లో తాజ్ బంజారా హోటల్ సీజ్

**హైదరాబాద్ (పంజగుట్ట), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** బంజారాహిల్స్ తాజ్ బంజారా హోటల్‌ను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. గత రెండేళ్లుగా పన్నుచెల్లించకపోవడంతో ఈ మేరకు అధికారులు సీజ్ చేశారు. పన్ను చెల్లించాలని పలు మార్లు నోటీసులు ఇచ్చినా హోటల్ యాజమాన్యం స్పందించలేదు. దీంతో అధికారులు హోటల్‌ను సీజ్ చేశారు. మొత్తం రూ. కోటి 47 లక్షల టాక్స్ పెండింగ్ ఉందని, పన్ను చెల్లించాలని.. జీహెచ్ఎంసీ అధికారులు 5 సార్లు నోటీసులు ఇచ్చిన హోటల్ యాజమాన్యం స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ సిటీలో ఫేమస్ అయిన తాజ్ బంజారా హోటల్‌కు జీహెచ్ఎంసీ అధికారుల షాక్ ఇచ్చారు. గడిచిన రెండు సంవత్సరాలుగా హోటల్ నిర్వాహకులు జీహెచ్ఎంసీకి పన్ను బకాయలు చెల్లించలేదు. దీనిపై పలుమార్లు నోటీసులు ఇచ్చారు. అయినా హోటల్ నిర్వాహకుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. పరిస్థితి గమనించిన జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం ఉదయం హోటల్‌ను సీజ్ చేశారు. హైదరాబాద్ సిటీలో ఫేమస్ అయిన.. నిత్యం బిజీగా ఉండే తాజ్ బంజారా హోటల్‌కు సెలబ్రెటీలు ఎక్కువగా వస్తుంటారు. క్రికెటర్లు ఎప్పుడు వచ్చినా ఈ హోటల్‌లో బస చేస్తుంటారు. అలాగే దేశంలోని కీలక రాజకీయనేతలు హైదరాబాద్ వచ్చినప్పుడు ఇక్కడే స్టే చేస్తారు. పార్టీ సమావేశాలకు అనుకూలంగా ఉండడంతో ఎక్కువ మంది ఈ హోటల్ వైపు మొగ్గుచూపుతారు. అటాంటి హోటల్ సీజ్ కావడం గమనార్హం.

## రైతులపై పోలీసు కర్కశం..

### తాళ్లతో కట్టేసి బూటుకాళ్లతో తన్నుతూ దాడి చేసిన పోలీసులు

### అటవీ భూములను సాగు చేస్తున్నారని దాష్టీకం

**హన్మకొండ బ్యూరో, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** పోడు వ్యవసాయం చేస్తున్నారని రైతులపై పోలీసుల దాడి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం ఆజంనగర్‌లో రైతులు వారి తాతముత్తాతల కాలం నుంచి సాగుచేస్తున్న భూముల్లోకి గురువారం అటవీఅధికారులు జేసీబీలతో వెళ్లారు. ఇవి అటవీ శాఖ భూములని, ఇందులో సాగుచేయొద్దని దుర్భాషలాడుతూ రైతులను తాళ్లతో కట్టేసి, బూటుకాళ్లతో తన్నుతూ విచక్షణారహితంగా దాడి చేశారు. తాత ముత్తాతల నుంచి 11 మంది రైతులం 25 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామని, ఈ విషయం అటవీశాఖ అధికారులకు తెలిసి కూడా వచ్చి దాడి చేశారని రైతులు వాపోతున్నారు. జిల్లా ఆటవీశాఖ అధికారి నవీన్‌రెడ్డి 150 మంది పోలీసులతో వచ్చి తమను బూటుకాళ్లతో తన్నుతూ, పిడిగుద్దులు గుద్దారని.. పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందిన మహిళా రైతులు తెలిపారు. కొండి శారద, పొదిళ్ల శ్రీను, పొదిళ్ల రజిత అనే రైతులను తాళ్లతో కట్టేసి అధికారులు వారి వాహనాల్లో తీసుకువెళ్లారు వారి ఆచూకీ తెలిపి, గత నాలుగేళ్లుగా తమ దగ్గర డబ్బులు తీసుకుంటూనే, తమ కొడుకులపై కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారు. అటవీ శాఖ అధికారులను సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

## చైనాలో మరో ప్రాణాంతక వైరస్!

### హెచ్‌కెయు5-కోవ్-2గా గుర్తింపు



**బీజింగ్, ఫిబ్రవరి 21:** చైనాలో కొవిడ్ తరహాలోనే ఉన్న మరో కొత్త వైరస్‌ను శాస్త్రవేత్తలు గుర్తించారు. జంతువుల నుంచి మానవులకు సంక్రమించే ముప్పు ఉందని కూడా హెచ్చరిస్తున్నారు. గబ్బి లాల్లో గుర్తించిన ఈకొత్త వైరస్‌ను హెచ్‌కెయు5-కోవ్-2గా వెల్ల డించారు. కొవిడ్19కి కార ణమైన సార్స్ కోవ్-2ను పోలి ఉన్నట్లు తమ పరిశీలనలో గుర్తించామని హాంకాంగ్‌కు చెందిన సౌత్‌చైనా మార్నింగ్‌పోస్టు తన కథనంలో ప్రస్తావించింది. గబ్బిలాల్లో కరోనా వైరస్‌లపై విస్తృతస్థాయిలోపరిశోధనలుచేసి బ్యాట్ ఉమన్‌గా పేరొందిన ప్రఖ్యాత వైరాలజిస్టు ఝంగ్‌లీ ఈ పరిశోదన బృందానికి సారథ్యం వహించారు. ఇందులో గ్యాంగ్‌ఝౌ ప్రయోగశాల, గ్యాంగ్‌ఝౌ అకాడమీ ఆఫ్ సైన్సెస్,వుహాన్ యూనివర్సిటీతోపాటు వుహాన్ వైరాలజీ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు భాగస్వాములుగా ఉన్నారు. ఈ పరిశోధనకు సంబంధించిన పరిశోధనా పత్రి సెల్‌జర్నల్‌లో సమీక్షకు పోస్టుచేసారు. ఈ వైరస్ మెర్బెకోవైరస్‌తోపాటు ప్రాణాంతక మెర్స్‌కోవ్(మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్) ఉపరకానికి చెందినదని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది హెచ్‌కెయు5 కరోనా వైరస్‌సంతతికి చెందినదేనని, ఈవైరస్ తొఉలత హాంకాంగ్‌లోనిజపనీస్ పిపస్ట్రెల్‌రకం గబ్బిలాల్లో గుర్తించినట్లు చైనా పరిశోధకులు వెల్లడించారు. ఇపుడు చేస్తున్న అధ్యయనాలప్రకారం హెచ్‌కెయు5-కోవ్-2 నేరుగా లేదా మాధ్యమ జీవులసాయంతోమనుషులకు వ్యాపించే అవకాశం ఎక్కువని అన్నారు. అయితే కొవిడ్‌తోపోలిస్తే ఈవైరస్ సామర్థ్యం తక్కువేనని చెప్పారు.

## కెటిఆర్, ముఠా గోపాల్ పిటిషన్లపై విచారణ వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి21:** బంజారాహిల్స్, ముషీరాబాద్ పీఎస్‌లలో నమోదైన కేసులపై విచారణను కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు, ఎమ్మెల్యే ముఠా గోపాల్ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి సీఎం రేవంత్ రెడ్డి రూ. 25 వందల కోట్లు వసూలు చేసి ఢిల్లీకి పంపారని కేటీఆర్ ఆరోపించారు. కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ కార్యకర్త శ్రీనివాస్ రావు ఫిర్యాదుతో బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో విచారణను కొట్టివేయాలని కేటీఆర్, ముఠాగోపాల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై విచారణను హైకోర్టు మార్చి 18వ తేదీకి వాయిదా వేసింది.

# గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లుల విడుదల ఇంకెప్పుడు?

### బిల్లుల విడుదలయ్యాకే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలి

### సర్పంచ్ సంఘం నాయకులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కులగణ అనంతరం ఎన్నికలు అనంతరం స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయని భావించిన వారికి నిరాశే ఎదుం˘యింది. ఇందుకు సంబంధించిన గణను సక్రమంగా జరలేదని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించడమే కాకుండా స్వపక్ష నుంచి కూడా కొంత వ్యతిరేకత వ్యక్తం కావడంతో ప్రభుత్వం చేసేది ఏమీ లేక ఆ ప్రక్రియను మరి కొంత కాలం పొడగించింది. దీంతో స్థానిక ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది. ఇప్పటికే స్థానిక ఎన్నికలు సకాలంలో జరగక పోవడం అవి అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. గ్రామపంచాయితీల పాలనకు గడువు తీరి కార్యదర్శుల చేతిలోకి పోయింది. గతంలో చేసిన అభివృద్ధి పనులకుగాను బిల్లులు పెండింగ్‌లో ఉంటంతో కొంత మంది సర్పంచ్‌లను ఆత్మహత్యలకు పాల్పడగా మరి కొంత మంది అప్పుల పాలయ్యారు.ప్రస్తుతం గ్రామంచాయితీల పాలన కార్యదర్శులు చేతిలోకి పోవడం, కేంద్ర రాష్ట్రాల నుంచి నిధులు విడుదల కాక పోవడంతో చేసేదీమీ లేక పోవడంతో కొంత మంది గ్రామపంచాయితీ పనులకు గ్రామ కార్యదర్శులుతమ సొంత వేతన నాల నుంచి చెల్లిస్తూ పోతుంటే మరి కొంత మంది చేసేదేమీ లేక మౌనంగా ఉంటున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీలు నిధుల సమస్యలను ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రానికి స్టేట్‌ఫైనాన్స్ కమిషన్‌కు నుంచి కూడా సకాలంలో నిధులు అందక పోవడంతో వాటి పరిస్థి మరింత దారుణంగా తయారైంది. వాస్తవానికి సకాలంలో నిధులు విడలయితనే వాటి పర్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. సంవత్సరాల తరబడి నిధులు విడుదల కాక పోవడంతో గ్రామ పంచాయితీలు ఆర్థిక సమస్యలు మరింత దారణంగా మారాయి. పలు రకాల పన్నుల రాబడి ఉన్న మేజర్ గ్రామంచాయితీల పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా, ఏ మాత్రం ఆదాయం లేని సుమారు 5500 చిన్న గ్రామపంయితీలకు చిల్లగవ్వ ఆదాయం కూడా లేకపోవడంతో వాటి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. 2011లో జనాభా ప్రాదిపదికన రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామాలకు కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రతినెలా సుమారు రూ.180 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.120 కోట్లు విడుదల చేయాల్సి ఉంటుంది.కాని గత రెండు సంవత్సరాల నుంచి ఈ మొత్తం నిధులు ఆగి పోవడంతో వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

**ట్రాక్టర్ డీజిల్‌కు కష్టం అవుతోంది..**

గ్రామల్లో పేరుకు పోయిన చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలంటే తప్పని సరిగా డీజిల్ ఉపయోగించాలి, కానీ ట్రాక్టర్ కోసం డీజిల్ కొనడమే కష్టంగా మారింది. అదే విధంగా వేసవి కాలంలో నీటి ఎద్దడిని నివారిచేందుకు ఉపయోగించే మోటర్ల మరమ్మతులకు వచ్చినా వాటిని కూడా బాగు చేయించిలేని పరిస్థితి నెలకొంది. అంతే కాదు నెలలా వచ్చేవిద్యుత్ బిల్లులను కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది.

పల్లెల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నా, అపరిశుభ్ర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నా, కొనాలన్నా చేతిలో డబ్బులు లేని పరిస్థితిలో ఉన్నట్లు కార్యదర్శులు చెబుతున్నారు.పనులు నిలిచిపోకుండా ఉండేందుకు సర్దుబాటు చేయాల్సి వస్తోంది. గ్రామ పంచాయితీల్లో తాత్కాలిక పనుల కోసం జీతం డబ్బులు ఖర్చు చేస్తుండటంతో కుటుంబాల్లో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నామని కొందరు అధికారులు వాపోతున్నారు. అప్పలు చేసి పంచాయితీలను నిర్వహించాల్సి వస్తోందని ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని చెప్పుకోలేక పోతున్నామనివారు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు ఎప్పుడు వస్తాయాని అన్నివిభాగాల అధికారులు ఎదురు చూస్తున్నట్లు వారు తెలిపారు గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పోవడంతో అనేక చోట్ల సిబ్బందికి వేతనాలు చెల్లించలేని పరిస్థితి. దీంతో రోజు వారి పనులు చేసేందుకు కూడా కార్మికులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. గత ప్రభుత్వం గ్రామ పంచాయితీల్లోని ప్రతి 500 జనబాకు ఒక మల్టీ పర్పస్ కార్మికుడిని నియమించింది.వీరు విద్యుత్ లైట్లు, పారిశుద్ధ్యం,మురుగు కాల్వలో పూడిక తొలగింపు, చెత్త ట్రాక్టర్ నడపడం,, మంచి నీటి సరఫరా వంటి పనులు చేయాల్సి ఉంటుంది. అసలే చాలీ చాలని వేతనంతో పని చేస్తున్న వీరికి కూడా గత కొద్దికాలంగా వేతనాలు అందడం లేదని తెలిసింది.

పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాతీల బిల్లులు చెల్లించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని సర్పంచ్‌ల సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించడలేదని, కనీం ప్రస్తుత పభుత్వం అన్నా పెండింగ్ బిల్లులు చెల్లిస్తుందని ఎంతో సంవత్సరం పైగా ఎదురు చూస్తున్నామని, ఈ కాని ఈ ప్రభుత్వం కూడా పెండింగ్ బిల్లుల సమస్యలను పట్టించకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఇప్పటికే అనేక మంది మంత్రులతో పాటు గవర్నర్‌ను కూడా కలిసి వినతి పత్రాలు అందించామని ఇంతటి వరకు ఇందుకు సంబంధించిన నిధులు విడుదల కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వాన్నే కూల్చేసినోణ్ణి

### నన్ను తేలిగ్గా తీసుకోవద్దు.. షిండే హెచ్చరికలు



**ముంబయి, ఫిబ్రవరి 21:** మహారాష్ట్రలోని అధికార మహాయుతికూటమిలో విభేదాలు తీవ్రం అయ్యాయని ఊహాగానాలు వినిపిస్తున్న వేళ డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్‌షిండే కీలక వ్యాఖ్యలు మరోసారి దుమారంరేపాయి. తనను తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. సీఎం దేవేంద్రఫడ్నవిస్ సమావేశాలకు ఇటీవల దూరంగా ఉంటున్న షిండే 2022లో ప్రభుత్వాన్న పడగొట్టిన విషయాన్ని తాజాగా ప్రస్తావించారు. షిండే హయాంలో ఆమోదించిన ఒకప్రాజెక్టునుప్రభుత్వం నిలిపివేసిన నేపత్యంలో సేవసేన నేత పైవ్యాఖ్యలుచేసారు. నేను ఒక సాధారణ పార్టీ కార్యకర్తను. అంతేకాదు బాబాసాహెబ్ అడుగుజాడల్లో నడిచిన వ్యక్తిని. ప్రతిఒక్కరూ అర్థంచేసుకోవాలి. 2022లో అందరూ నన్ను తేలిగ్గా తీసుకున్నపుడు నాడు అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని పడగొట్టా అని మీడియాతోనే ఏక్‌నాథ్‌షిండేఅన్నారు. తర్వాత విధానసభలోచేసిన మొదటిప్రసంగంలో ఫడ్నవిస్‌కు 200 కంటే ఎక్కువసీట్లు వస్తాయని చెప్పానని 232 సీట్లువచ్చాయన్నారు. అందుకే తనను తేలిగ్గా తీసుకోవద్దని ఇది ఎవరిని ఉద్దేశించి చెపుతున్నాననో వారు అర్థంచేసుకుంటారని భావిస్తున్నట్లు షిండే అన్నారు. సీఎం ఫడ్నవిస్ సమావేశాలకు షిండే హాజరుకాకపోవడం, షిండేవర్గం ఎమ్మెల్యేలకు భద్రతను తొలగించడం, సచివాలయంలో వైద్యసహాయ కేంద్రాలు ఇద్దరు వేరువేరుగా ఏర్పాటుచేసుకోవడం వంటి సంఘటనలు వీరిమధ్య దూరాన్ని పెంచాయని తెలుస్తోంది. అభివృద్ధిని అడ్డుకునేవారితో నాపోరాటం నిరంతరం కొనసాగుతుందన్నారు.

# 'ఓ భామ అయ్యో రామ' హరీష్ శంకర్ గెస్ట్ రోల్


వైవిధ్యమైన చిత్రాలలో ప్రేక్షకులను అలరిస్తున్న యువ కథానాయకుడు సుహాస్, మరో అందమైన ప్రేమకథా చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నాడు. ఈ చిత్రంలో ప్రతి ఫ్రేమ్‌లో ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తూ అందరిని అలరించడానికి సిద్ధమయ్యాడు హీరో సుహాస్. ఓ భామ అయ్యో రామ అనే ఈ ప్రేమకథలో మలయాళ నటి మాళవిక మనోజ్ కథానాయికగా పరిచయమవుతోంది. ఈ సినిమాను



రామ్‌గోధల తన తొలి ప్రయత్నంగా దర్శకత్వం చేస్తున్నారు. వి ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ కథానాయకుడు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. కాగా ఈ చిత్రంలో ప్రముఖ మాస్ దర్శకుడు హరీష్ శంకర్ ఓ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడు. సినిమాలో ఆయన గెస్ట్ రోల్ అందరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. ఈ పాత్ర ఆయన చేస్తేనే బాగుంటుందని భావించిన మేకర్స్ హరీష్ శంకర్‌ను ఒప్పించి ఆయన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను ఇటీవల పూర్తిచేశారు. నిర్మాత మాట్లాడుతూ, సుహాస్ కెరీర్‌కు మైలురాయిగా నిలిచే చిత్రంగా ఇది ఉంటుంది. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఓ బెస్ట్ క్వాలిటీ సినిమాను అందించబోతున్నాం. ఈ చిత్రంలో సున్నితమైన ప్రేమ భావోద్వేగాలతో పాటు అంతకు మించిన ఫన్ ఉంటుంది. ఈ చిత్రంలోని వినోదం ఆడియన్స్‌ను ఎంతో ఎంటర్‌టైన్ చేస్తుందనే నమ్మకం వుంది. హరీష్ శంకర్ గారు అడ్గగానే మా చిత్రంలో అతిథి పాత్రను చేసినందుకు ఆయన కృతజ్ఞులు. ఈ వేసవిలో ఓ భామ అయ్యో రామ బెస్ట్ ఎంటర్ టైనర్ చిత్రంగా నిలుస్తుందనే నమ్మకం ఉందిఖి అన్నారు. అంతేకాకుండా, కథలో మరిన్ని అంశాలను అందించేందుకు సీనియర్ నటి అనితా హాసనందిని మరియు ప్రముఖ నటుడు అలి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి అత్యుత్తమ సాంకేతిక బృందం పనిచేస్తోంది – మనికందన్ సినిమాటోగ్రఫీ చేయగా, రధన్ సంగీతాన్ని అందిస్తున్నారు. భవిన్ షా ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టగా, బ్రహ్మ కదలి ప్రొడక్షన్ డిజైన్‌ను సమకూరుస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం 2025 వేసవి లో ప్రేక్షకుల ముందుకు రానుంది. నటీనటులు: సుహాస్, మాళవిక మనోజ్, అనితా హాసనందిని, అలి, బబ్లూ పృథ్వీ రాజ్, రవీందర్ విజయ్, మొయిన్, సాంకేతిక నిపుణులు: రచయిత, దర్శకుడు: రామ్ గోధల, నిర్మాత: హరీష్ నల్ల
బ్యానర్: వి ఆర్ట్స్, సంగీతం: రధన్
సినిమాటోగ్రఫీ: మనికందన్ ఎస్
ఎడిటింగ్: భవిన్ షా
ప్రొడక్షన్ డిజైన్: బ్రహ్మ కదలి
కాస్ట్యూమ్స్: అశ్వంత్ అండ్ ప్రతిభ
పిఆర్ఒ: ఏలూరు శ్రీను మడూరి మధు

# 'నాగబంధం' కోసం డ్యాన్స్ సాంగ్ షూట్

విరాట్ కర్ణ హీరోగా, అభిషేక్ నామా దర్శకత్వంలో, కిషోర్ అన్నపురెడ్డి నిర్మాతగా ఎన్ఐకె స్టూడియోస్, ఇన్ అసోసియేషన్ విత్ అభిషేక్ పిక్చర్స్ పాన్ ఇండియా ఫిల్మ్ 'నాగబంధం' సినిమా నిర్మాణం భారీ సెట్‌లో హీరో విరాట్ కర్ణ, హీరోయిన్స్ నభా నటేష్, ఐశ్వర్యమీనన్‌పై గణేష్ ఆచార్య మాస్టర్ కొరియోగ్రఫీలో అదిరిపోయే డ్యాన్స్ సాంగ్ షూటింగ్ జరుగుతోంది. యంగ్ హీరో విరాట్ కర్ణ హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియా మూవీ 'నాగబంధం'. ప్యాషనేట్ ఫిల్మ్ మేకర్ అభిషేక్ నామా దర్శకత్వం వహి స్తున్న ఈ చిత్రం గ్రాండ్ స్కేల్‌లో రూపొందుతోంది. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ లుక్ మంచి బజ్ క్రియేట్ చేసింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ నానక్ రామ్ గూడ రామానాయుడు స్టూడియోలో జరుగుతోంది. హీరో విరాట్ కర్ణ, హీరోయిన్స్ నభా నటేష్, ఐశ్వర్య మీనన్‌పై ఓ గ్రాండ్ సాంగ్‌ని షూట్ చేస్తున్నారు. ఈ సాంగ్ కోసం ఓ భారీ సెట్ నిర్మించారు. మ్యూజిక్ డైరెక్టర్ అభే ఓ బ్లాక్ బస్టర్ నెంబర్‌ను కంపోజ్ చేశారు. కాలభైరవ, అనురాగ్ కులకర్ణి, మంగ్లీ తమ ఎనర్జిటిక్ వోకల్స్ ఆలపించిన ఈ సాంగ్‌కి కాసర్ల శ్యామ్ అద్భుతమైన లిరిక్స్‌ని రాశారు. కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్య మాస్టర్ డ్యాన్స్ మూమెంట్స్ ఇందులో స్పెషల్ ఎట్రాక్షన్‌గా వుండబోతున్నాయి. మెస్మరైజింగ్ డ్యాన్స్ మూమెంట్స్‌తో ఈ సాంగ్ అలరించబోతోంది. 'ది సీక్రెట్ ట్రెజర్' అనే ట్యాగ్‌లైన్‌తో 'నాగబంధం' ఒక ఎపిక్ అడ్వెంచర్‌గా రూపుదిద్దుకుంటోంది. అభిషేక్ నామా కథ, స్క్రీన్‌ప్లే రెండింటికీ తనదైన విజన్‌ను తీసుకు వస్తున్నారు. ఎన్ఐకె స్టూడియోస్ ఆధ్వర్యంలో కిషోర్ అన్నపురెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా గర్వంగా సమర్పిస్తున్నారు. ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరో, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ హీరోయిన్స్, జగపతి బాబు, రిషభ్ సహానీ, జయప్రకాష్, జాన్ విజయ్, మురళీ శర్మ, అనసూయ, శరణ్య, ఈశ్వరిరావు, జాన్ కొక్కిన్, అంకిత్ కొయ్య, సోనియా సింగ్, మాథ్యూ వర్గీస్, జాసన్ షా, బి.ఎస్.అవినాష్, బేబి కియరా కీలక పాత్రల్లో నటించారు. పాన్ ఇండియన్ ఫిల్మ్ నాగబంధం ఒక పురాణ ఇతిహాసాల నుంచి తీసుకున్న కథాంశాన్ని మిళితం చేస్తూ పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ దేవాలయాల వద్ద ఇటీవల కనుగొనబడిన గుప్త నిధుల నుంచి ప్రేరణ పొంది, ఆధ్యాత్మిక సాహసోపేతమైన ఇతివృత్తాలతో వుంటుంది. ఈ పవిత్ర స్థలాలను రక్షించే నాగబంధం పురాతన ఆచారాలపై దృష్టి సారించి, భారతదేశంలోని విష్ణు దేవాలయాల చుట్టూ ఉన్న రహస్యాన్ని నాగబంధంలో అద్భుతంగా ప్రజెంట్ చేస్తున్నారు. ఈ చిత్రం అసాధారణమైన నిర్మాణ విలువలు, అత్యాధునిక విఎఫ్ఎక్స్ హై - ఆక్టేన్ అడ్వెంచర్‌కి ప్రామిస్ చేస్తోంది. ఈ చిత్రానికి సౌందర్ రాజన్ ఎస్ డీవోపీగా పనిచేస్తున్నారు. అభే సంగీత దర్శకుడు. కళ్యాణ్ చక్రవర్తి డైలాగ్స్ రాయగా, ఆర్‌సీ ప్రణవ్ ఎడిటర్, అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైనర్, స్క్రిప్ట్ డెవలప్‌మెంట్ శ్రా1, రాజీవ్ ఎన్ కృష్ణ. నాగబంధం 2025లో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఏకకాలంలో పాన్ ఇండియా లెవల్‌లో విడుదల కానుంది. తారాగణం: విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతి బాబు, రిషభ్ సహానీ, జయప్రకాష్, జాన్ విజయ్, మురళీ శర్మ, అనసూయ, శరణ్య, ఈశ్వరిరావు, జాన్ కొక్కిన్, అంకిత్ కొయ్య, సోనియా సింగ్, మాథ్యూ వర్గీస్, జాసన్ షా, బి.ఎస్.అవినాష్, బేబి కియరా, కళ్యాణి, కేశవ్ దీపక్ తదితరులు. సాంకేతిక సిబ్బంది: బ్యానర్: ఎన్ఐకె స్టూడియోస్ అండ్ అభిషేక్ పిక్చర్స్, సమర్పణ: లక్ష్మి ఐరా అండ్ దేవాన్ష్ కథ, స్క్రీన్‌ప్లే అండ్ దర్శకత్వం: అభిషేక్ నామా, నిర్మాత: కిషోర్ అన్నపురెడ్డి
డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ: సౌందర్ రాజన్ ఎస్
సంగీతం: అభే, సీఈవో: వాసు పోతిని
ప్రొడక్షన్ డిజైనర్: అశోక్ కుమార్.



# అందరికి నచ్చే మూవీ 'బాపు'


వెర్సటైల్ యాక్టర్ బ్రహ్మాజీ లీడ్ రోల్‌లో ఒకరిగా ఆమని, బలగం సుధాకర్ రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్న డార్క్ కామెడీడ్రామా బాపు. ఈ చిత్రానికి దయా దర్శకత్వం వహిస్తున్నారు. కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అథీరా ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై రాజు, సిహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా ఫెబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా బ్రహ్మాజీ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**బాపు జర్నీ ఎలా స్టార్ట్ అయ్యింది?**
డైరెక్టర్ దయ రెండేళ్ళ క్రితం కథ చెప్పారు. పాయింట్ చాలా కొత్తగా వుంది. క్యారెక్టర్ కూడా డిఫరెంట్‌గా వుంది. ఒరిజినల్‌గా కనిపించే అవకాశం ఇచ్చే స్క్రిప్ట్. అయితే దీనికి బడ్జెట్ లేదు. ఎలా చేద్దామని అనే చర్చ జరుగుతున్నప్పుడు నాకు రెమ్యునరేషన్ వద్దు. లాభాలు వస్తే కొంత మనీ ఇమ్మని చెప్పి అలా స్టార్ట్ చేశాం. తర్వాత అందరూ తగ్గించి చేయడం, లొకేషన్‌లో కార్వాన్ లేకుండా అదే ఊర్లో ఉంటూ అక్కడే సర్దుకుపోవడంతో ఇది చేయగలిగాం. కథపై ఇష్టం నమ్మకంతోనే ఇది సాధ్యపడింది.

**కథలో నచ్చిన ఎలిమెంట్ ఏమిటి?**
చాలా యూనిక్ కాన్సెప్ట్. రైతులు ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుంది. అలా నా క్యారెక్టర్ సూసైడ్ కి ట్రై చేసినప్పుడు ఏమోతుందనేది సినిమాలో చూడాలి.

**ఆమని క్యారెక్టర్ గురించి?**
ఆమని చాలా నేచురల్ యాక్టర్. చాలా మంచి సినిమాలు చేసిన మంచి ఆర్టిస్ట్. ఆమెతో కలసి వర్క్ చేయడం మంచి ఎక్స్‌పీరియన్స్. ఇందులో ఆమని క్యారెక్టర్ స్ట్రాంగ్‌గా వుంటుంది.

**ఫైనల్ కాపీ చుసినప్పుడు ఏమనిపించింది?**
సినిమా చాలా బావుంది. ఇప్పుడు చిన్న సినిమాలకి ఓటీటీ అవ్వడం లేదు. మా అదృష్టం. ఈ సినిమాని హాట్ స్టార్ వాళ్ళు తీసుకున్నారు. థియేటర్ ఆడియన్స్ ఖచ్చితంగా కనెక్ట్ అవుతారు.




**బలగం సుధాకర్ రెడ్డి క్యారెక్టర్ గురించి?**
ఆయనదే టైటిల్ రోల్. కథలో ఆయనే మెయిన్. ఆ క్యారెక్టర్‌తో ఆడియన్స్ చాలా కనెక్ట్ అవుతారు.

**ఈ సినిమాకి అవార్డులు ఆశిస్తున్నారా?**
అవార్డులు గురించి ఆలోచన లేదు. మంచి సినిమా చేయాలనేది మా ప్రయత్నం. అవార్డ్స్ వస్తే హ్యాపీ.

**సినిమాకి ఇండస్ట్రీ నుంచి ఎలాంటి సపోర్ట్ వుంది?**
ఈ సినిమాకి ఇండస్ట్రీలో వున్నవారంతా హెల్ప్ చేశారు. రానా ఫస్ట్ లుక్ రిలీజ్. ట్రైలర్ లాంచ్‌కి అప్పటికప్పుడు పిలిచినా వచ్చారు. ఆయన ఇలాంటి చిన్న సినిమాలకి చాలా సపోర్ట్ ఇస్తారు. రష్మిక టీజర్ రిలీజ్ చేసింది. మొన్న ఈవెంట్‌కి అందరూ పిలవగానే వచ్చారు. అందరి సహకరంతో ఈ సినిమా జనాల్లోకి వెళ్ళగలుగుతుంది.

**బాపు మ్యూజిక్ గురించి?**
ఈ సినిమాకి సాంగ్స్ చాలా హెల్ప్ అయ్యాయి. రెండు పాటలు బాగా పాపులర్ అయ్యాయి. చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది.

**డైరెక్టర్ దయ గరించి?**
దయ చాలా మొండి డైరెక్టర్. విన్నట్లు నటిస్తాడు కానీ వినడు. ఆయనకి అనిపించింది చేస్తాడు.(నవ్వుతూ) తనలో చాలా క్లారిటీ వుంది. డైరెక్షన్ మీద పట్టుంది. చాలా నాలెడ్జ్ వున్న పర్సన్.

**బాపు సినిమాకి వచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్?**
ఇప్పటివరకూ సినిమా చూసి ప్రతిఒక్కరూ చాలా బావుందని ఫోన్ లు చేస్తున్నారు. జనరల్ ఆడియన్స్ చాలా బాగా కనెక్ట్ అవుతున్నారు. డైరెక్టర్ చంద్రశేఖర్ యేలేటికి సినిమా చూపించాను. ఆయనకి చాలా నచ్చింది.

**ఈ సినిమాని చాలా మంది బలగంతో పోల్చుతున్నారు?**
అది మంచిదే కదా. అందులోనూ బలగం సుధాకర్ గారు వుండటంతో ఆ పోలిక మరింతగా వస్తోంది. అయితే బలగం సినిమాకి దీనికి ఏ మాత్రం పోలిక లేదు. ఆ కథ వేరు.. ఈ కథ వేరు.

**మీకు డ్రీమ్ రోల్ ఉందా?**
సూపర్ డీలక్స్‌లో విజయ్ సేతుపతి చేసిన క్యారెక్టర్ చాలా ఇష్టం. ఆలాంటి క్యారెక్టర్స్ వస్తే చేయాలని వుంది. మీ సినిమాల ఎంపిక ఎలా వుంటుంది కథ బావుండాలి. అందులో నా పాత్ర బావుండాలి. ప్రతి సినిమాతో ఏదో కొత్తదనం వుండాలి.

# 24న 'హిట్: ది థర్డ్ కేస్' టీజర్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని హైలీ యాంటిసిపేటెడ్ క్రైమ్ థ్రిల్లర్ హిట్: ది థర్డ్ కేస్ ట్యాలెంటెడ్ డైరెక్టర్ శైలేష్ కొలను దర్శకత్వంలో హిట్ సిరీస్‌లో మూడవ భాగంగా రాబోతున్న ఈ చిత్రం ఇప్పటికే గ్లింప్స్, పోస్టర్‌లకు అద్భుతమైన స్పందనతో భారీ అంచనాలను నెలకొల్పింది. వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై ప్రశాంతి తిపిర్నేని, నాని యూనిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ వేగంగా జరుగుతోంది. ఈ చిత్ర టీజర్‌కు సంబంధించిన అప్‌డేట్‌తో మేకర్స్ వచ్చారు. ఈ చిత్రం ఇంటెన్స్ టీజర్‌ను ఫిబ్రవరి 24న నాని పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నారు. ఈ చిత్ర ప్రధాన కథాంశం, నాని పోషిస్తున్న ఫెరోషియస్ అర్జున్ సర్కార్ క్యారెక్టర్ తో పాటు మిగతా పాత్రల గురించి కీలక వివరాలను ఆవిష్కరించడానికి టీం సిద్ధంగా ఉంది. టీజర్ పోస్టర్‌లో నాని చేతిలో గొడ్డలి పట్టుకొని, తన పాదాల దగ్గర పడిపోయిన మనుషులతో కమాండింగ్ పొజిషన్ లో కనిపిస్తున్నారు. ఈ బోల్డ్ ఇమేజ్ అతని పాత్ర యొక్క ఫెరోషియస్ అండ్ ఇంటెన్స్ నేచర్‌ని తెలియజేస్తోంది. ఈ చిత్రంలో నానికి జోడిడా శ్రీనిధి శెట్టి కథానాయిక పాత్రలో నటించింది. ఈ మూవీకి ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం వర్క్ చేస్తున్నారు. సాను జాన్ వర్గీస్ డీవోపీ, మిక్కీ జె. మేయర్ సంగీతం అందిస్తున్నారు, కార్తీక శ్రీనివాస్ ఆర్ ఎడిటర్, శ్రీ నాగేంద్ర తంగల ప్రొడక్షన్ డిజైనర్. హిట్ 3 మే 1, 2025న థియేటర్లలోకి రానుంది.



తారాగణం: నాని, శ్రీనిధి శెట్టి, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: డా. శైలేష్ కొలను, నిర్మాత: ప్రశాంతి తిపిర్నేని బ్యానర్లు: వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్ డీవోపీ: సాను జాన్ వర్గీస్ సంగీతం: మిక్కీ జె మేయర్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం (వెంకట్) సౌండ్ మిక్స్: సురేన్ జి, లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధదపు, చీఫ్ కోడైరెక్టర్: వెంకట్ మద్దిరాల, కాస్ట్యూమ్ డిజైనర్: నాని కమరుసు, ఎస్ఎఫ్ఎక్స్: సింక్ సినిమా, విఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్: విఎఫ్ఎక్స్ డిటిఎం, డిఐ: బి2హెచ్ స్టూడియోస్, కలరిస్ట్: ఎస్. రఘునాథ్ వర్మ, పీఆర్వో: వంశీ శేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో.

# 28న 'బందీ'

వాతావరణ పరిరక్షణపై సామాజిక సందేశాన్ని ఇస్తూ ఆదిత్య ఓం చేసిన చిత్రం 'బందీ'. రఘు తిరుమల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పలు అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించారు. ప్రతిష్టాత్మక చలన చిత్రోత్సవాలలో బంధీ చిత్రానికి అనేక ప్రశంసలు దక్కాయి. భారత దేశపు మొట్టమొదటి పర్యావరణ నేపథ్యంతో కూడిన థ్రిల్లర్‌గా బందీ రికార్డు క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో ఆదిత్య ఓం పాత్ర ఎదుర్కొనే పరిస్థితులు, వాతావరణ సమస్యలపై పోరాడే తీరు ఇతర విదేశాల్లోని అనేక అటవీ ప్రాంతంలో రియల్ లొకేషన్స్ మధ్య బందీ చిత్రాన్ని తెరకెక్కించారు. అద్భుతమైన విజువల్స్‌ను ఈ చిత్రంలో చూడబోతున్నాం. పర్యావరణ ప్రేమికులందరినీ కదిలించేలా ఈ చిత్రం ఉండనుంది. ఎంతో డెడికేటెడ్ యాక్టర్ అయిన ఆదిత్య ఓం బందీ చిత్రంలో ఎన్నో రియల్ స్టంట్స్ చేశారు. అటవీ ప్రాంతంలో అనేక ఛాలెంజ్‌లు ఎదుర్కొంటూ అద్భుతంగా నటించారు. టీజర్, విడుదలపై మరింత ఉత్కంఠ నెలకొంది. బందీ చిత్రాన్ని ఫిబ్రవరి 28న గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్లు సిద్ధంగా ఉన్నారు. ఫిబ్రవరి 28న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. ఈ మూవీ కోసం మేకర్లు ఓ వ్యూహాన్ని రచించారు. ముందుగా ఈ చిత్రాన్ని కొన్ని పరిమిత స్క్రీన్లలో రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. నిర్మాతలు వెంకటేశ్వర్ రావు దగ్గు, రఘు తిరుమల ఈ చిత్ర ప్రమోషన్స్ కోసం ఎన్‌జిఒలు, సామాజిక సంస్థలతో కలిసి ప్రమోషన్స్ చేస్తున్నారు.



# ఏప్రిల్‌లో 'ఎర్రచీర- ది బిగినింగ్'

బేబి దమరి సమర్పణలో శ్రీ పద్మాయల ఎంటర్టైన్మెంట్స్ శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "ఎర్రచీర ది బిగినింగ్". ఈ సినిమాలో నటుడు రాజేంద్రప్రసాద్ ముద్దుల మనవరాలు బేబీ సాయి తేజస్విని నటిస్తోంది. "ఎర్రచీర ది బిగినింగ్" మూవీకి సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ఒక ముఖ్య పాత్ర పోషించారు. మదర్ సెంటిమెంట్, హార్రర్, యాక్షన్ కథతో ఈ సినిమా తెరకెక్కింది. శివరాత్రి కానుకగా "ఎర్రచీర ది బిగినింగ్" గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కావలసి ఉంది. అయితే టెక్నికల్ కారణాలతో సినిమా రిలీజ్ వాయిదా వేశారు. వేసవి కానుకగా ఈ సినిమాని ఏప్రిల్ నెలలో ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సుమన్ బాబు మాట్లాడుతూ సినిమా చూసిన వారందరూ అద్భుతంగా ఉందని కొనియాడారని అన్నారు. సినిమా ఆలస్యం కావచ్చు కానీ కంటెంట్ మాత్రం కంటెంట్ ఖతర్నాక్‌గా ఉందని చూసినవారు అందరూ అంటున్నారు అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. నటీనటులు.. బేబి సాయి తేజస్విని, సుమన్ బాబు, శ్రీరామ్, కమల్ కామరాజు, కారుణ్య చౌదరి, అయ్యప్ప పి శర్మ, సురేష్ కొండేటి, రఘుబాబు, తదితరులు.



# 'రారాజు' నుంచి రిలీజ్ డేట్ పోస్టర్

శ్రీమతి పద్మ సమర్పణలో శ్రీ పద్మిణి సినిమాస్ బ్యానర్ మీద బి.శివ ప్రసాద్ తెరకెక్కించిన చిత్రం 'రా రాజా'. ఆర్టిస్టుల్ని చూపించకుండా కేవలం కథ, కథనాల మీదే నడిచే సినిమా ఇది. అసలు మొహాలు చూపించకుండా సినిమాను తీయడం అనేది మామూలు సాహసం కాదు. ఇలాంటి అద్భుతమైన ప్రయోగం చేసి మెప్పించేందుకు రెడీ అయింది 'రా రాజా' టీం. ఈ చిత్రానికి బూర్లే హరి ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, కిట్టు లైన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా రిలీజ్ చేసిన ఈ ట్రైలర్‌ను తమ్మారెడ్డి భరద్వాజ్ వీక్షించి అభినందించారు. అనంతరం రిలీజ్ డేట్ పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ, 'రా రాజా మూవీ టైటిల్‌ను గమనిస్తే ఏదో ప్రేమ కథలా అనిపిస్తుంది. కానీ ఈ చిత్రంలో ఓ మొహం కూడా కనిపించదు. అసలు మొహాలు చూపించకుండా సినిమా తీసి దర్శకుడు శివ ప్రసాద్ ధైర్యం చేశాడు. డ్యూయెల్ అని స్పీల్ బర్గ్ తీసిన చిత్రంలోనూ మొహం కనిపించదు. అలానే ఈ చిత్రంలోనూ మొహాలు కనిపించవని అంటున్నారు. ఇది చాలా పెద్ద ప్రయోగం. ఇది కనుక సక్సెస్ అయితే ఇండస్ట్రీ మొత్తం మారిపోతుంది. అసలు హీరోలు, స్టార్లతో పని లేకుండా అద్భుతమైన చిత్రాలు, ప్రయోగాలు చేయొచ్చని అంతా ముందుకు వస్తారు. హీరో హీరోయిన్ల కోసం సినిమాలకు వస్తుంటారు. కానీ ఇందులో మొహాలు కూడా కనిపించవు. కథే ముందుకు వెళ్తుంటుంది. ఇది అద్భుతమైన ఐడియా. ట్రైలర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. శేఖర్ చంద్ర మ్యూజిక్ బాగుంది. మార్చి 7న ఈ చిత్రం రాబోతోంది. ఈ మూవీని అందరూ చూసి సపోర్ట్ చేయండ'ని అన్నారు. దర్శకుడు శివ ప్రసాద్ మాట్లాడుతూ, 'మా ట్రైలర్‌ను చూసి, రిలీజ్ డేట్ పోస్టర్‌ను రిలీజ్ చేసి, అభినందించిన తమ్మారెడ్డి భరద్వాజ్ గారికి థాంక్స్. మా చిత్రంలో ఆర్టిసుల మొహాలు కనిపించవు. కథ, కథనమే ముఖ్యం అని మేం ఈ మూవీని తీశాం.





# లక్ష్యమే ఆలంబనగా..

**పేదవాళ్లకు పెద్ద కలలు ఎందుకు... అని నిన్నటితరం అనుకుంటే... ఉన్నది ఒక్కటే జీవితం ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అంటోంది నేటితరం. లక్ష్యం దిశగా కష్టపడితే ప్రోత్సాహం, సహకారం తప్పక దొరుకు తాయనీ నమ్ము తోంది. నమ్మకంలేదా... అయితే పైలట్ వేల్పుల నవ్య కథ తెలుసుకోవాల్సిందే!**

తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు విమానం గురించి వినడమే కానీ వాళ్లు ప్రత్యక్షంగా దగ్గర నుంచి చూసింది. వాళ్ల కూతురేమో ఏకంగా పైలట్ అవ్వాలనుకుంది. చివరకు ఆర్థిక అడ్డంకులను అధిగమించి లక్ష్యాన్ని నెరవేర్చుకుంది.



కరీంనగర్ జిల్లా, గంగాధర మండలం గర్శకుర్తికి చెందిన పద్మ, రవి దంపతులకు... నవ్య, లక్ష్మి మనిరూప్ సంతానం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివింది నవ్య జగిత్యాల సాంఘిక సంక్షేమ శాఖ కళాశాలలో బీఎస్సీ, హైదరాబాద్ ప్రభుత్వ సిటీ కళాశాలలో ఎంఏ ఆంగ్లం పూర్తిచేసింది. డిగ్రీలో ఉండగానే విమాన పైలట్ కావాలనుకుంది. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మొదట్లో వెనకడుగు వేసింది. ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్న అప్పటి తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్కుమార్ సలహా మేరకు పట్టు విడవకుండా ప్రయత్నించింది. సొంతంగానే సన్నద్ధమై అర్హత పరీక్షలో విజయం సాధించింది.

**ఆర్థిక పరిస్థితులు నెపక్కి లాగినా....** ఉపకార వేతనం కోసం రాష్ట్రవ్యాప్తంగా 400 మంది విద్యార్థులు పరీక్ష రాయగా... ఎంపికైన నలుగురిలో నవ్య ఒకరు. అలా టీఎస్ ఏవియేషన్ అకాడమీలో కమర్షియల్ పైలట్ శిక్షణకు అర్హత సాధించారు. ఫ్లయింగ్ శిక్షణకు రూ.36 లక్షలకుగాను ప్రభుత్వం బ్యాంకు ద్వారా మొదటి విడతలో రూ.18 లక్షలు అందించింది. గ్రౌండ్ శిక్షణకు అదనంగా రూ.3 లక్షలు అవసరం. అప్పటికే బ్యాంకులో రుణం లేదు. తమవల్ల కాదని తల్లిదండ్రులు చెప్పడంతో నిరాశకు గురైంది నవ్య. 2023లో ఆమె పరిస్థితిని వివరిస్తూ ఈనాడులో కథనం ప్రచురిత మవ్వగా, అప్పటి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మరికొందరు దాతలు ఆర్థిక చేయూతనిచ్చారు. దీంతో టీఎస్ఏ బేగంపేటలో అడ్మిషన్ వచ్చింది. నేవిగేషన్, రెగ్యులేషన్, టెక్నికల్ జనరల్... ఇతర పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి నవంబరులో మొదటిసారి శిక్షణలో భాగంగా పైలట్ సీట్లలో కూర్చొని నవ్వుతుంది. 200 గంటలు విమానం నడపాల్సి ఉండగా ఇప్పటివరకు 30 గంటలు నడిపింది. మరో తొమ్మిది నెలల్లో శిక్షణ పూర్తి కానుంది. విమానం నడిపిన మొదటిరోజు భయమేసింది... కెప్టెన్ పరీక్షి త్రెడ్డి ప్రోత్సాహంతో ఆ భయం మర్నాడే పోయింది తల్లిదండ్రులను విమానంలో ఎక్కించుకుని తిప్పాలనేది నా కోరిక శక్తిమేరకు ప్రయత్నం చేస్తే ఎవరైనా లక్ష్యం సాధించవచ్చు అని నవ్వుతోంది. □

# కుంకుమపువ్వు విదేశీ ఛాయ



సుగంధద్రవ్యాల్లో అత్యంత విలువైంది కుంకుమ పువ్వు ఈ పంటకు కావాల్సిన వాతావరణ పరిస్థితు లను కల్పించ డంతోపాటు ఆధునిక పద్ధతుల్లో పండించింది. అస్తిక నరులా, ఆ పంటను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయి కలిగింది. ఢిల్లీ యూనివర్శిటీ నుంచి పట్టా పుచ్చుకుని వచ్చింది ఇలాంటి అనవసర ప్రయోగాలు 'చేయడానికేనా' అంటూ ఆస్తికను విమర్శించాడుతా, కుంకుమపువ్వు పంటపై పరిశోధర చేస్తున్నప్పుడు ఎదురైన ఈ విమర్శలను పట్టించు కోలేదుమె లుధియానాలో ఓ రైతు కుటుంబంలో పుట్టింది ఆస్తిక ఉద్యోగంలో రోజూ 8-10 గంటలపాటు పనిచేయడం ఆస్తికు నచ్చలేదు. సొంతంగా, వ్యవసాయానికి అను బంధంగా ఉండేది ఏదైనా చేయాలనుకుంది. ఇంట్లో మద్దతు ఇవ్వడంతో ఢిల్లీ నుంచి సొంతూరుకొచ్చింది.

**నూతన విధానాలతో....** మార్కెట్లో డిమాండ్ ఉన్న ఉత్పత్తిని పండించాలనుకుందీమె. దీనికోసం ఇంట్లో వెతికేటప్పుడు. కుంకుమపువ్వు ఖరీదు, దేశవ్యాప్తంగా అక్కడక్కడ మాత్రమే దీన్ని పండిస్తున్నట్లు తెలుసు కుంది.. "దాన్ని పండిస్తే ఎలా ఉంటుందని ఆలోచించింది. ఆపై ఏడాదిన్నరపాటు అధ్యయనం చేపట్టింది. ఆయా ప్రాంతాల కెళ్లి పరిశీలించింది. రైతులను కలిసి వాళ్లు పాటిస్తున్న విధానాలను తెలుసుకుంది.. ఆ తర్వాత అందరూ అనుసరించే పద్ధతిని కాకుండా నూతన సాంకేతికతతో అడుగు ముందుకు వేయాలనుకుంది. 2010-11లో కశ్మీరు నుంచి మార్కెట్ కొచ్చే కుంకుమపువ్వు ఎనిమిది టన్నులు కాగా, ప్రభుత్వగణాంకాల మేరకు గతేడాదికి ఈ పువ్వు దిగుమతి 28 టన్నులకు తగ్గింది. పంపిణీ అవుతున్నదాంట్లో నాణ్యతలేక 67 శాతం తిరస్కరణకు గురవుతోంది. ఈ కారణంగానే గదుల్లోనూ పలువురు దీన్ని పండించడం మొదలుపెట్టారు. నేను కూడా ఇదే పద్ధతిని ఎంచుకున్నా. 600 చదరపుటడుగులున్న ఓ గదిలో మొదట పంటకు కావాల్సిన వాతావరణ పరిస్థితులను ఏర్పాటు చేశాం. ఈ పంటకు ముఖ్యంగా ఉష్ణోగ్రత, తేమ, కార్బన్‌డయాక్సైడ్, కాంతి అవసరమవుతాయి. పగలంతా తగినంత వేడిల్లో మంచు కురుస్తున్నట్లుగా వాతావరణం పరిస్థితులను ఏర్పాటుచేశాం. ఈ పంటకు ముఖ్యంగా ఉష్ణోగ్రత, తేమ, కాంతి అవసరమవుతాయి. పగలంతా తగినంత వేడి, రాత్రివేళల్లో మంచు కురుస్తున్నట్లుగా వాతావరణం ఉండాలి. ఉష్ణోగ్రత స్థాయుల నిర్వహణకు చిల్లర్స్, వెలుతురుకు గ్రోలైట్స్, లెడ్‌లైట్స్ ఏర్పాటు చేశాం. అలాగే తేమ స్థాయిని నియంత్రించ డానికి హ్యూమిడఫైయర్ ఉండాలి. అలా రూ.50 లక్షల పెట్టుబడితో పని మొదలు పెట్టాం. కుంకుమ పువ్వు విత్తనాలను కొనుగోలు చేసి ట్రేలలో నాటాం' అనే ఆస్తికకు తమ్ముడి సాయం కూడా అందింది.





**లాభదాయకంగా...** రెండువారాలు పూర్తయ్యేసరికి విత్తనాలు మొలకెత్తడం, ఏడు వారాల్లో పూలు పూయడం వరకు గది వాతావరణాన్ని పంటకు తగ్గట్లుగా మారుస్తూ వచ్చింది. దిగుబడి బాగా వచ్చింది. దాంతో రెండోసారి కాస్త పెద్ద స్థాయిలో నాటారు. పండిన కుంకుమ పువ్వును ఆన్‌లైన్‌లో విక్రయించడం కూడా ప్రారంభించింది ఆస్తిక, అలా చిన్నగదిలో మొదలు పెట్టిన పంటను అభివృద్ధి చేస్తూ ప్రస్తుతం ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలకు కేజీ రూ.8లక్షల చొప్పున ఎగుమతి చేస్తోంది. కుంకుమ పువ్వుతోపాటు, ఆ రేకలను ఫుడ్ కలర్, పెర్ఫ్యూమ్, సౌందర్యోత్పత్తుల తయారీ సంస్థలకూ విక్రయించడంతో లాభాలను పొందగలిగా, నచ్చింది చేస్తేనే విజయాన్ని ఆస్వాదించొచ్చు అంటోన్న ఆమె తనలాంటివారికి మార్గదర్శకురాలిగానూ నిలిచింది. □

# అలనాటి ఫ్యాషన్ నేటి తరం



రెట్రో ఫ్యాషన్... కాలేజీ, ఆఫీసు, తాజాగా ఇంటి వేడుకల్లోనూ దీనికి చోటివ్వడం చూస్తున్నాం. అంతా కలిసి దశాబ్దాల క్రితం నాటి ఫ్యాషన్లలో మెరిసిపోతుంటే చూడటానికి ముచ్చటగానూ ఉంటుంది. ఇదంతా సరదా సంగతి. కానీ తన జీవితంలో ముఖ్య ఘట్టమైన పెళ్లిళ్లకే నవవధువులు అమ్మమ్మలు, బామ్మల ఫ్యాషన్ వైపే చూస్తున్నారు. అలనాటి ఫొటోలు ఎప్పుడైనా చూశారా? బ్లాక్ అండ్ వైట్‌లో ఉన్నా వాటి అందమే వేరు. బ్లవుజు వెనక మెడ కాస్త పైకి... ముందేమో 'యు' లేదా 'వీ' నెక్. ఇక చేతులేమో పట్టు అంచుతో మోచేతులకు కాస్త పైకి ఉంటాయంతే. సాదా అయినా కుచ్చులతో బుట్ట చేతులే పెట్టినా చీర అందాన్నంతా బ్లవుజే నిర్ణయిస్తున్నట్లు ఉంటుంది. చిన్న చిన్న బుటీలతో వచ్చే ఆకర్షణ మరింత ప్రత్యేకం. ఆ బ్లవుజు, దానికి తగ్గ పట్టు చీర కట్టిన యువతి చూసిన వారెవరైనా బుట్ట బొమ్మలా ఉంది అనాల్సిందే! మరి ఇంతటి వైభవాన్ని కోరుకోని అమ్మాయి. ఉంటుందా? అందుకే లక్షల ఖర్చు చేసే భారీ వర్క్ ను కాదంటున్నారు. చేయించినా మెడకే పరిమితం చేస్తున్నారు. ఇక బ్లవుజంతా బుటీలే! అలాంటి కొన్ని డిజైన్లే ఇవి. అచ్చమైన భారతీయ అందం ఉట్టిపడుతున్నట్లు లేదా?



ఫ్యాషన్ ఫ్యాషన్









# తాంబూలం ఇలా..

నోములు, పెళ్లి వేడుకల్లో ముత్తైదువులకు తాంబూలం, వాయనం ఇచ్చి పంపడం మన అనవాయితీ. 'మా ఆహ్వానాన్ని మన్నించి, మీరు మా ఇంటికి వచ్చారు. వచ్చి మమ్మల్ని అనుగ్రహించినందుకు కృతజ్ఞతలు' అన్నదానికి ప్రతీకగా ఈ తాంబూలం ఇస్తాం. దానిలో తమలపాకులు, పండ్లు, వక్క ప్రధానం. తరచుగా దక్షిణని పెడుతుంటారు కొందరు పసుపు కుంకుమలు, పూలు, గాజులు, జాకెట్ ముక్క వంటివాటితోపాటు గిఫ్ట్ జోడిస్తుంటారు. తాహతు, ఇంటి సంప్రదాయం బట్టి, ఒక్కొక్కరూ ఒక్కోలా ఇస్తుంటారు. ఈమధ్య వాటి నీ అందంగా ఇవ్వడం సాధార ణం అయిపోయింది. ఈ



విధంగా పసుపు ప్లాస్టిక్ తమలపాకులతోపాటు కాస్త, కుంకుమల్ని విభిన్న ఆకారాల్లో చేసిన బొమ్మల్లో ఇస్తున్నారు. చూడటానికి ఆకట్టుకునేలా ఉంటాయన్నది వాస్తవమే వాటిని ఎదుటివారు ఉపయోగించుకోగలుగుతున్నారా అన్నదీ గమనించుకోవాలి. వాటిని ఉపయోగించుకోనూలేరు వెంటనే పారేయనూలేరు. కొన్నాళ్లకైనా అవి చేరేది చెత్తలోకే! అంటే డబ్బు వృథా పర్యావరణానికి హాని కలిగిస్తున్నాం. మనం ఇచ్చిన తాంబూలంలోనివన్నీ అవతలివారు ఉపయోగించుకుంటేనే దానికి సార్థకత. కాబట్టి, కొనేముందు వినియోగించుకునేలా ఉన్నాయా అని గమనించుకోండి. ఆ తరవాతే ఇవ్వండి. □

# క్షయ వ్యాధి - ఆహారం -2

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

టీలో పాలీఫెనోలిక్ సమ్మేళనాలుండడం వల్ల ఆరోగ్యం కోసం బ్లాక్ టీ గ్రీన్ టీ తీసుకోవాలి. **సెలీనియం**, జింక్ ఉన్న పొద్దుతిరుగుడు విత్తనాలు, పుట్ట గొడుగులు, బీన్స్, చియా గింజలు, గుమ్మడి కాయగింజలు, నువ్వులు, అవిసె, చికెన్, చేపలు, నత్తలు, చిలగడ దుంపలు తీసుకోవాలి. **ఆపిల్** జ్యూస్‌లో రోగనిరోధక శక్తిని పెంచే ఆంటిఆక్సిడెంట్స్ ఉండడం వల్ల ఆరోగ్యానికి మంచిది. **ఒమేగా-3** ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల రక్త ప్రసరణ మరియు గుండె ఆరోగ్యానికి మద్దతునిస్తుంది. **జాగ్రత్తలు ....** క్షయరోగులు పసుపు పాలు తీసుకోవడం మంచిది. పెరుగు-ప్రోబయెటిక్స్ ఉన్న పెరుగుని తీసుకోవడం వల్ల జీర్ణక్రియకు తోడ్పడి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. **ఖిచిడీ** - మాంసకృతులు మరియు అవసరమైన పోషకాల్ని అందిస్తుంది. బచ్చలికూర - ఇందులో ఐరన్,విటమిన్స్ ఎక్కువగా ఉండి హీమోగ్లోబిన్ స్థాయిల్ని పెంచి అలసటని తగ్గిస్తాయి. **బాదం :** ఇవి ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, శక్తి కోసం విటమిన్ ఇ ఉన్న బాదం ముఖ్యం రోజూ 4-5 బాదంని తీసుకోవాలి. **ఉసిరి...** దీనిలోని విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. **వెల్లుల్లి :** దీనిలోని ఆంటీ బాక్టీరియల్ గునాలు ఇన్ఫెక్షన్లతో పోరాడడంలో సహాయపడుతుంది. అంతేగాకుండా వ్యర్థ పదార్థాల్ని తగ్గించి లింఫాటిక్ (శోషరస) వ్యవస్థని మెరుగుపరుస్తుంది., ఇది శక్తివంతంగా ఉంటుంది. రోజూ 3-6 గ్రాములు తీసుకోవచ్చు. **బెల్లం :** ఇది శరీరానికి ఇనుమును అందిస్తుంది. శరీరానికి శక్తి స్థాయిల్ని అందిస్తుంది. **నిమ్మరసం :** దీనిలోని విటమిన్‌సి రోగ నిరోధకశక్తిని పెంచుతుంది. **తాజాపండ్లు :** ఆంటీ ఆక్సిడెంట్ల కోసం నారింజ జామ, బొప్పాయి, అరటి, ఆరెంజెస్ పండ్లను తీసుకోవచ్చు. ఇవేగాకుండా వెజిటబుల్ ఉప్మా, కొత్తిమీర, మొలకెత్తిన గింజల ఛాట్ రాజ్మా, జీరారైస్, కరివేపాకు, ఆవాలు, నానపెట్టిన అత్తిపండ్లు, కర్జూరాలు, తులసీ, పుదీనా వంటి ఆహారపదార్థాల్ని కూడా ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు. వీటిని మితంగా కొద్దికొద్దిగా తీసుకోవాలి. కడుపుతిప్పి, వాంతులు, విరేచనాలు వంటివి ఉండడం వల్ల జీర్ణకాని ఆహారాన్ని తీసుకోరాదు. శరీరం హైడ్రేట్‌గా ఉండడానికి నీరు, కొబ్బరినీరు, మజ్జిగ, నిమ్మరసం, పండ్లరసాలు కొద్ది కొద్దిగా ఎక్కువసార్లు తీసుకోవచ్చు. మసాలా, జిడ్డుగల ఆహారం, ప్రాసెస్ట్‌ఫుడ్, క్రొవ్వు ఎక్కువగా ఉన్న పదార్థాలు కుకీస్, కేక్‌లు, పాస్ట్రీలు, స్నాక్స్, జింక్‌ఫుడ్ తీసుకోరాదు. తీసుకుంటే గట్‌హెల్త్ దెబ్బతింటుంది. ప్రోటీన్, ఐరన్ లోపం లేకుండా కాలీఫ్లవర్, బ్రకోలీ, క్యారట్, సోయాబీన్, రాజ్మా, పన్నీర్ తీసుకోవాలి. తగినంత నిద్ర, క్రమమైన వ్యాయామం, చేస్తూ ఒత్తిడికి దూరంగా ఉండాలి. సోయాబీన్ టి.బి. బాక్టీరియాతో పోరాడుతుంది. పనీర్ కండరాల్ని నిర్మించి బలాన్ని అందిస్తుంది. ఆల్కహాల్, పొగాకు మానివేయాలి. కెఫిన్, శుద్ధిచేసిన చక్కెర, పిండి, సాస్‌లకి దూరంగా ఉండాలి. పేస్ట్రీలు, కేకులు, పిజ్జా, బర్లర్లు, వైట్‌బ్రెడ్, వైట్‌రైస్, వెన్న వంటి వాటికి దూరంగా ఉండాలి. క్రొవ్వు,కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్న రెడ్‌మీట్‌కు దూరంగా ఉండాలి. చిరుతిండ్లు మానివేయాలి. నూనె వస్తువులు ప్రాసెస్ చేసిన ఆహారాలు తీసుకోరాదు. రోజూ 1-2 లవంగాలు తీసుకోవడం మంచిది. బీట్‌రూట్‌రసం ఫ్రూట్ మిల్క్‌షేక్ రుచికరంగా ఉండా పోషకశక్తిని పెంచుతాయి. పాలు, సూప్‌లు ఉడికించిన ఆహారాల్ని ఎక్కువగా తీసుకోవచ్చు. క్షయరోగి తన ఇష్టానుసారం ఎటువంటి ఆహారమైనా తీసుకోవచ్చు. ప్రత్యేకమైన ఆహార పథ్యాలు అంటూ ఏమీ లేవు. శరీర తత్వానికి సరిపోనీ ఆహారం తీసుకోకుండా వుంటే సరిపోతుంది. పౌష్టికా హారం తీసుకుంటే కొంతవ్యాధినిరోధకశక్తి పెరుగుతుంది. తద్వారా ఆరోగ్యం చేకూరుతుంది. □

# ఆదర్శ మార్గాలు



ఆదర్శ మార్గాలు కాలాన్ని దైవంగా భావిస్తూ సాగడానికి, కుటుంబ వ్యవస్థ సవ్యంగా నడపటానికి రామాయణ, భారత, భాగవతాది ఇతిహాస పురాణాల్లో ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. రాముడు సోదరులతో సఖ్యంగా ఉన్న తీరు, తమ్ములు అన్నను గౌరవించిన తీరు. ఇవన్నీ ప్రతి తరంలోనూ పెద్దలు ముందు తాము తెలుసుకుని, అనుసరించి చిన్నలకు చెబుతుండాలి. యాగరక్షణకు శ్రీరాముణ్ణి మాత్రమే పంపమని విశ్వామిత్రుడు దశరథుణ్ణి కోరితే.. లక్ష్మణుడు స్వచ్ఛందంగా అన్న సేవకోసం అడవులకు బయల్దేరాడు. కైకేయి ఆదేశం మేరకు శ్రీరాముడు అరణ్యాలకు వెళ్తుంటే.. సొంత సుఖాలను వదులుకొని లక్ష్మణుడు పద్నాలుగేళ్లు అన్నను వెన్నంటే ఉన్నాడు. మహా భారతంలో యక్ష ప్రశ్నల సందర్భం కూడా సోదర బంధాన్ని ప్రతిబింబిస్తుంది. యక్షమాయ వల్ల భీమార్జున నకుల సహదేవులు మరణించినప్పుడు ధర్మరాజు యక్షప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పాడు. దానికి మెచ్చిన యక్షుడు మరణించిన వారిలో ఒక్కరిని మాత్రమే బతికిస్తానన్నాడు. ధర్మరాజు నకులుణ్ణి కోరుకున్నాడు. అంతులేనిబలపరాక్రమవంతులైన భీమార్జునులను కాదని,నకులుణ్ణే ఎందుకు కోరావని-యక్షుడు అడిగాడు. కుంతికి జన్మించిన వారిలో తాను బతికే ఉన్నానని, సవతి తల్లి మాద్రి కొడుకుని కూడా బతికించడం తన బాధ్యత కనుక అలా కోరానన్నాడు ధర్మరాజు. ఆయన మాటల్లో ధర్మం కుటుంబానికి ఇచ్చిన ప్రాధాన్యత, సోదరబంధ సౌందర్యం కనిపించడంతో.. యక్షుడు సంతోషించాడు, అందరినీ బతికించాడు. ఇవి కొన్ని ఉదాహరణలే ఇలా కుటుంబసభ్యులందరూ ఒకరి కష్టంలో ఒకరు పాలు పంచుకోవటం, సుఖసంతోషాల్లో కలిసి ఆనందించటం అనే తత్త్వం ప్రపంచవ్యాప్తంగా పెరగాలి. కాలం విలువను తెలుసుకుని జీవితాన్ని సార్థకం చేసుకోవాలననదే ఆధ్యాత్మిక వేత్తల లక్ష్యం. ఈ లక్ష్య సాధనలోనే అనంతమైన ఆనందం,విశ్వశాంతి ఇమిడి ఉన్నాయి. □

ఆధ్యాత్మికం

# సలాడ్ డిటాక్స్



**శరీరంలో పెరిగిన కొవ్వు, పిండి పదార్థాలు లేదా చక్కెరను తగ్గించకపోతే పలు అనారోగ్యసమస్యలు దరిచేరతాయి. అలాగే శరీరంలో పేరుకున్న మలినాలను బయటకు పంపితేనే ఆరోగ్యంగా ఉంటాం. ఇందుకోసం 'సలాడ్ డిటాక్స్' మంత్రం పాటిద్దామా !**

సలాడ్స్ అంటేనే... పోషకాల పవరస్లు తక్కువ క్యాలరీలున్న వీటితో ఎక్కువ శక్తినీ పొందొచ్చు. రుచిగానూ చేసుకోవచ్చు. శరీరంలోని మలినాలను తేలికగా బయటకు పంపే బచ్చలి, పాలకూర తదితర ఆకుకూరలు, క్యారెట్, క్యాబేజీ, బ్రాకలీ వంటివి సలాడ్స్కు మంచిది. వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగానూ ఉంటాయి. వీటిలోని పీచు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. సలాడ్స్ గుమ్మడి, పొద్దు తిరుగుడు గింజలతోపాటు మొలకెత్తిన విత్తనాలను కలిపితే విటమిన్లు, ఖనిజలవణాలను పొందొచ్చు. ఇవి కాలేయ సామర్థ్యాన్ని పెంచుతాయి. రక్తంలో చక్కెర స్థాయులను స్థిరీకరించడానికి సాయపడతాయి, ఆవిరిపై ఉడికించిన చికెన్, గుడ్లు, శనగలు వంటి లీన్ ప్రోటీన్లను సలాడ్కు ఉపయోగిస్తే మరిన్ని పోషకాలను పొందొచ్చు. అవకాడో, దానిమ్మ గింజలు, నారింజ ముక్కలు, వాల్నట్స తోపాటు రెండుమూడు చుక్కల ఆలివనూనె కలిపితే చాలు. ఆరోగ్యకరమైన కొవ్వులు అంది హృద్రోగసమస్య ఉండదు. ఆకు కూరలు, టొమాటోలు, కీర కలిపిన సలాడ్లోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. ఒమేగా 3 కోసం గింజధాన్యాలను సలాడ్లో చేర్చుకుంటే మంచిది, కొత్తిమీర, తులసి వంటివి మంచి ఫ్లేవర్ నిస్తాయి. ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయి. డ్రైఫ్రూట్స్ ముక్కలతో యాంటీ ఆక్సిడెంట్లు అందుతాయి. కీరదోస, క్యారెట్, బెల్ పెపర్లోని పీచు మెరుగైన జీర్ణశక్తినిస్తుంది.

అందంలో.. తగినంత నీరు అంది చర్మం పొడిబారదు. విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని మెరిసేలా వేస్తాయి. చర్మకణాల పునరుత్పత్తికి ఆకుకూరల్లోని విటమిన్‌ఎ తోడ్పడితే, నిమ్మ రసంలోని సీవిటమిన్ కొల్లజెన్ ఉత్పత్తికి సాయపడుతుంది. ముందస్తు వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తుంది. జుట్టు ఆరోగ్యానికి కావాల్సిన ఇనుము, బయోటిన్ సహా అవసరమైన విటమిన్లు, ఖనిజాలను సలాడ్స్ నుంచి పొందొచ్చు. వారంలో కనీసం ఒక రోజు పూర్తిగా సలాడ్స్ తీసు కుంటే డిటాక్స్ తో అధిక బరువు సమస్యను దూరం చేసుకోవచ్చు. అందంగానూ మెరిసిపోవచ్చు. □

# కొల్హాపురి మసాలా

ఏ కూరలోనైనా ఉల్లి తరుగు, టొమాటో గుజ్జు వేసినంతలో సరిపోదు. పల్లీపొడి, కొబ్బరికోరు, లవంగాలు, దాల్చినచెక్క స్థిర జోడిస్తేనే అవి మరింత రుచిగా ఉంటాయి. కూరల్లో కాస్తంత కొల్హాపురి మసాలా గనుక దట్టించామంటే ఘుమఘుమలాడుతూ ఎప్పుడెప్పుడు తిందామా అనిపిస్తుంది. ఈ మసాలా ఇంట్లోనే చేయొచ్చు. దీనికి ఏమేం దినుసులు కావాలంటే ధనియాలు, ఎండుకొబ్బరి ముక్కలు రెండు టేబుల్‌స్పూన్ల చొప్పున, గసగసాలు, జీలకర్ర, నువ్వులు టేబుల స్పూన్ చొప్పున, మెంతులు అర చెంచా, మిరియాలు చెంచా, దాల్చినచెక్క అంగుళం ముక్క లవంగాలు ఆరేడు, యాలకులు, నల్ల బిర్యానీపువ్వులక్ తీసుకోవాలి.ఎలా చేయాలంటే పైన చెప్పిన అ ఒప్పందం ప్యాన్‌లో వేసి మీడియం ఫ్లేమ్ మీద రెండు నిమిషాలు వేయించాలి. చల్లారిన తర్వాత జార్లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి, అంతే.. కొల్హాపురి మసాలా సిద్ధం. దీన్ని తడి లేని, గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి. ఈ పాళ్లను అనుసరించి ఇంకొంచెం ఎక్కువ పరిమాణంలోనూ చేయొచ్చు. □



# ఛాంపియన్స్ ట్రోఫీలో.. ఎవరి బలం ఎంత?




**న్యూఢిల్లీ:** మినీ వరల్డ్ కప్‌గా భావించే ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఎడిషన్‌కు సంబంధించిన సమరం నాలుగో రోజులోకి ప్రవేశించింది. ఈ టోర్నీలో 8 జట్లు పాల్గొంటున్నాయి. వీటిలో ప్రధాన జట్ల మధ్యే హోరాహోరీ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో ఏజట్టు బలం ఎంతెంత అనేదానిపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. అయితే ఇది వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్ 8 టీమ్స్ పాల్గొనే టోర్నీ, కాబట్టి ఏ జట్టునూ తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు. ఇప్పటికే న్యూజిలాండ్ చేతిలో ఆతిథ్య పాకిస్తాన్, టీమిండియా చేతిలో బంగ్లాదేశ్ ఓటమి చవిచూసింది. ఇక ఎప్పటిలాగే టీమ్‌ఇండియా టైటిల్ ఫేవరెట్లలో ఒకటి అనడంలో ఎలాంటి సందేహం లేదు. స్వదేశంలో రీసెంట్‌గా ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన టీమ్‌ఇండియా ఊపు మీదుంది. ఈ సిరీస్ తోనే సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఫామ్ అందుకోవడంతో రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. గిల్, అయ్యర్, రాహుల్ నిలకడైన ప్రదర్శన కలిసొచ్చే అంశం. అయితే బుమ్రా లేడనే ఆందోళన తప్పా, టమిండియా అన్ని రంగాల్లో బలంగానే కనిపిస్తోంది. ఇక 2023లో వన్డే వరల్డ్ కప్ చేజారడంతో ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీనైనా దక్కించుకోవాలని రోహిత్ సేన ఉవ్విళ్లూరుతోంది. ఇప్పటికే బంగ్లాదేశ్‌తో జరిగిన తన తొలి మ్యాచ్‌లో భారత్ విజయంతో బోణీ కొట్టింది.

## వీటి మధ్యే హోరాహోరీ

ఇక ఉప ఖండేతర జట్లలో భారీ అంచనాలున్నది న్యూజిలాండ్ జట్టుపైనే. ఐసిసి టోర్నీల్లో కివీస్ ఎప్పుడూ నిలకడగా ఆడుతుంది. ఇటీవల ఆతిథ్య పాకిస్థాన్‌ను రెండుసార్లు ఓడించి ట్రై సిరీస్ గెలవడం ఆ జట్టు విశ్వాసాన్ని పెంచేదే. బ్యాటింగ్‌లో విలియమ్సన్, కాన్వే, ఫిలిప్స్, మిచెల్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో శాంట్నర్, బ్రాస్‌వెల్, హెన్రీ, ఒరూర్క్ నిలకడగా రాణిస్తున్నారు. ఇప్పుడున్నఊపులో ఫైనల్‌చేరగలదనే ధీమ కివీస్‌లో కన్పిస్తోంది. అలాగే ఆస్ట్రేలియా ఎల్లప్పుడూ ఐసిసి టోర్నీల్లో ఫేవరెట్ల లిస్ట్‌లో కచ్చితంగా ఉంటుంది. కానీ, ఈసారి మాత్రం కంగారూలపై పెద్దగా అంచనాలు లేవు. కెప్టెన్ కమిన్స్‌తో పాటు హేజిల్‌వుడ్, మిచెల్ మార్ష్, స్టార్క్, స్టాయినిస్ అందుబాటులో లేక ఆసీస్ బలహీన పడింది. తాత్కాలిక కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కు తోడు లబుషేన్, మ్యాక్స్‌వెల్, షార్ట్, ఇంగ్లిస్, అబాట్, స్పెన్సర్ జాన్సన్, ఎలిస్ లాంటి ప్రతిభావంతులతో కూడిన కంగారూ జట్టు టోర్నీలో ఎక్కడిదాకా వెళ్తుందో చూడాలి. అలాగే ఫార్మాట్ ఏదైనా ఇంగ్లాండ్ ప్రస్తుతం ప్రపంచ మేటి జట్లలో ఒకటి. అయితే భారత పర్యటనలో టీ20, వన్డే సిరీస్‌లు కోల్పోవడం ఇంగ్లాండ్ ఆత్మవిశ్వాసాన్ని కొంత దెబ్బ తీసేదే. అయినా సరే, సాల్ట్, డకెట్, బట్లర్, బ్రూక్, రూట్, లివింగ్‌స్టన్‌తో ఇంగ్లాండ్ బ్యాటింగ్ పటిష్ఠంగా కనిపిస్తుంది. రషీద్ రూపంలో మేటి స్పిన్నర్ అందుబాటులో ఉన్నా అతడికి సహకరించే స్పిన్నర్లు లేరు. ఆర్చర్, సకిబ్ మహమూద్, వుడ్‌లతో కూడిన పేస్ విభాగం కూడా సరైన ఫామ్‌లో లేదు. ఇక దురదృష్టాన్ని వెంటబెట్టుకుని ఐసిసి టోర్నీలకు వస్తుందని పేరున్న సౌతాఫ్రికా ఈసారి కథ మార్చాలనుకుంటోంది. ఇటీవలే అరంగేట్రం చేసిన బ్రీట్జ్‌కే ఫామ్‌లో ఉన్నాడు. మార్‌క్రమ్, వాండర్ డసెన్, క్లాసెన్, మిల్లర్ లాంటి సీనియర్లు బ్యాటింగ్‌లో ఆ జట్టుకు పెద్ద అండ. పేస్‌లో రబాడ మీదే జట్టు ఎక్కువ ఆశలు పెట్టుకుంది. ఎంగిడి ఫామ్‌లో లేదు. స్పిన్నర్లు కేశవ్ మహరాజ్, షంసి రాణించడం ఎంతో కీలకం.




## పింక్ లేడీస్ కప్‌లో.. భారత్ మహిళల జట్టు శుభారంభం

### జోర్డాన్‌పై 2-0తో విజయం

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక పింక్ లేడీస్ కప్-2025లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు శుభారంభం చేసింది. షార్జాలో జరిగిన తమ తొలి పోరులో స్వీటీ దేవీ సారథ్యంలోని భారత జట్టు 2-0 గోల్స్ తేడాతో జోర్డాన్స్‌పై విజయం సాధించింది. భారత్ తరఫున ప్రియాంక దేవి (23వ నిమిషంలో), మనీషా (54వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. మ్యాచ్ ఆరంభం నుంచే భారత మహిళల జట్టు దూకుడు కనబర్చింది. తొలి అర్ధభాగంలో వచ్చిన అవకాశాన్ని ప్రియాంక దేవి సద్వినియోగ పర్చుకుంటూ జోర్డాన్ గోల్ కీపర్‌ను బోల్తా కొట్టించి భారత్ ఖాతా తెరిచింది. కాసేపటికే స్కోరు పెంచే అవకాశం వచ్చినా దాన్ని మనీషా సరిగ్గా వినియోగించుకోలేక పోయింది. ద్వితీయార్థంలో ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా మనీషా గోల్ కొట్టి జట్టుకు విజయం ఖాయం చేసింది. క్రిస్పిన్ ఛెత్రి భారత మహిళల కోచ్ ఎంపికైన అనంతరం భారత్ జట్టుకు ఇదే తొలివిజయం కావడంవిశేషం.

జోర్డాన్ పదేపదే ప్రతి దాడులకు ప్రయత్నించినా, స్వీటీ దేవి, పుర్ణిమ కస్తూరితో కూడిన రక్షణ శ్రేణి వాటిని సమర్థవంతంగా అడ్డుకుంది. తెలంగాణ అమ్మాయి గుగులోతు సౌమ్య ఆకట్టుకుంది. ఈ మ్యాచ్ ద్వారా భారత యంగ్ ప్లేయర్ లిషమ్ బబీనాదేవి అంతర్జాతీయ అరంగేట్రంచేసింది. తదుపరిపోరులో ఈనెల 23న రష్యాతో భారత్ తలపడుతుంది.



## ఖతర్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో.. సెమీస్‌కు భారత్ స్టార్ బాంబ్రీ జంట

**న్యూఢిల్లీ:** ఖతర్ ఓపెన్ ఎటిపి-500 టెన్నిస్ టోర్నీలో భారత డబుల్స్ స్టార్స్ యూకీ బాంబ్రీ, రోహన్ బోపన్నలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. దోహాలో జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జోడీ ఏకంగా ప్రపంచ నంబర్‌వన్, టాప్‌సీడ్ జంటను బోల్తా కొట్టించి సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లగా, రోహన్ బోపన్న (భారత్)- నునో బోరెజెస్ (పోర్చుగల్) ద్వయం క్వార్టర్ ఫైనల్లో ఇంటిదారి పట్టింది. ప్రపంచ నంబర్వన్ జంట మార్సెలో అరెవాలో (ఎల్ సాల్వడార్)-మాట్ పావిక్ (క్రొయేషియా)లతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో యూకీ-డోడిగ్ 2-6, 6-3, 10-8తో విజయం సాధించింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-డోడిగ్ ఆరు డబుల్ ఫాల్ట్లు చేసింది.అయితే సూపర్ టైబ్రేక్‌లో యూకీ-డోడిగ్ ద్వయం పైచేయి సాధించింది. జూలియన్ క్యాష్-లాయిడ్ గ్లాస్పూల్ (బ్రిటన్)లతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోపన్న-బోర్జెస్ 4-6, 7-6 (7/5), 7-10తో సూపర్ టైబ్రేక్స్‌లో ఓటమి పాలయ్యారు.

## రంజీ ట్రోఫీలో.. ప్రతీకారం తీర్చుకున్న విదర్భ



### ముంబైపై గెలిచి ఫైనల్లోకి ఎంట్రీ

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ-2024-25 చివరి అంకానికి చేరింది. ఈ సీజన్లో తొలి ఫైనల్ బెర్త్ అధికారికంగా ఖరారైంది. రెండో సెమీ ఫైనల్లో ముంబైని ఓడించి విదర్భ వరుసగా రెండో సీజన్‌లో ఫైనల్‌కు చేరింది. గత సీజన్ ఫైనల్లో ముంబై చేతిలో ఎదురైన పరాభవానికి విదర్భ ఈ సీజన్ సెమీస్‌లో ప్రతీప్రకారం తీర్చుకుంది. నాగపూర్‌లోని క్రికెట్ మైదానంలో జరిగిన సెమీ ఫైనల్లో ముంబైపై విదర్భ 80 పరుగుల తేడాతో గెలుపొందింది. విదర్భ నిర్దేశించిన 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబై 325 పరుగులకు ఆలౌటైంది. హర్ష్ దూబే5, యశ్ ఠాకూర్, పార్థ్ రేఖడే తలో 2 వికెట్లు తీసి ముంబైని దెబ్బకొట్టారు. ముంబై ఇన్నింగ్స్‌లో ఎవ్వరూ భారీస్కోర్లు చేయలేదు. ముంబై ఓటమి ఖరారైన తర్వాత శార్దూల్ ఠాకూర్ (66) అర్ధ సెంచరీ సాధించాడు. షమ్స్ ములానీ (46)సాయంతో శార్దూల్ ముంబైని గట్టెక్కించే ప్రయత్నం చేశాడు. స్టార్ బ్యాటర్లు అజింక్య రహానే (12), శివమ్ దూబే (12), సూర్య కుమార్ యాదవ్ (23) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో ఆకాశ్ ఆనంద్ ఈ సారి 39 పరుగులకు ఔటయ్యాడు. యువ ఆటగాళ్లు ఆయుశ్ మాత్రే (18), సిద్దేశ్లాడ్ (2) నిరాశపరిచారు. ఆఖర్లో తనుశ్ కోటియన్ (26), మోహిత్ అవస్తి (26), రాయ్‌స్టన్ డయాస్ (23) కంటితడుపు చర్చగా బ్యాట్స్ ఝులిపించారు. అక్షయ్ వాడ్కర్ (34) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. అథర్వ తైడే 4, పార్థ్ రేఖడే 23, హర్ష్ దూబే 18, భూటే 11, యశ్ ఠాకూర్ 3 పరుగులు చేసిఔట్ కాగా, దర్శన్ నల్కండే 12 పరుగులతో అజేయంగా నిలిచాడు. ముంబై బౌలర్లలో శివమ్ దూబే 5 వికెట్లతో రాణించగా, షమ్స్ ములానీ, రాయ్‌స్టన్ డయాస్ తలో 2, శార్దూల్ ఠాకూర్ ఓ వికెట్ తీశారు. అనంతరం బరిలోకి దిగిన ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 270 పరుగులకే ఆలౌటైంది. స్టార్ బ్యాటర్లు, టీమిండియా ప్లేయర్లు అజింక్య రహానే (18), సూర్యకుమార్ యాదవ్ (0), శివమ్ దూబే (0) దారుణంగా విఫలమయ్యారు. ఆకాశ్ ఆనంద్ (106) అద్భుతమైన పోరాటపటిమ కనబర్చి సూపర్ సెంచరీతో ముంబైపరువు కాపాడాడు.విదర్భ బౌలర్లలో పార్థ్ రేఖడే4, యశ్ ఠాకూర్, హర్ష్ దూబేతలో 2, దర్శన్ నల్కండే, భూటేచెరో వికెట్ పడగొట్టారు.

## అంగరంగ వైభవంగా ఫార్ములావన్

### మార్చి 16 నుండి మెల్‌బోర్న్‌లో కార్ల రేసింగ్



**న్యూఢిల్లీ:** ఫార్ములావన్ 75వ వార్షికోత్సవ సీజన్ ఆరంభ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. నలుపు రోడ్డుపై వాయువేగంతో కార్లు నడుపుతూ అభిమానులను అలరించే రేసర్లు ఈ ఈవెంట్లో రెడ్ కార్పెట్‌పై అభిమానులకు చేతులూపుతూ దర్శనమిచ్చారు. 24రేసులతో కూడిన 2025 ఫార్ములావన్ సీజన్ మార్చి 16న మెల్‌బోర్న్‌లో జరిగే ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రితో మొదలవుతుంది. ఈ సందర్భంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ ఆరంభ కార్యక్రమంలో 2025 సీజన్లో పోటీపడే 20 మంది డ్రైవర్లు తమ కార్లతో పాటు పాల్గొన్నారు. ఏడుసార్లు ప్రపంచ ఛాంపియన్ లూయిస్ హామిల్టన్ స్టేజి మీదకు వచ్చిన సమయంలో ప్రేక్షకుల హర్షధ్వానాలతో ఆడిటోరియం మార్మోగిపోయింది. సుదీర్ఘ ఎఫ్1 చరిత్రలో ఇలాంటి వేడుక జరగడం ఇదేతొలిసారి కాగా, ఇందులో భాగంగా బ్రిటన్ సింగర్ కేన్ బ్రౌన్ మ్యూజిక్ షో ఆహుతులను కట్టిపడేసింది. కనీవినీ ఎరగని రీతిలో కళ్లు మిరుమిట్లు గొలిపేలా సాగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ కళాకారులు పాల్గొన్నారు. ఫార్ములావన్ మరింత విస్తరించడంలో భాగంగానే హాలీవుడ్ సినిమా స్థాయిలో ఈ వేడుకు నిర్వహించారు. దీనిపై హామిల్టన్ స్పందిస్తూ 'చాలా ఉత్సాహంగా ఉంది. కొత్త సీజన్లో మరింత వేగంగా దూసుకెళ్లాలని చూస్తున్నా. అందుకు కావాల్సిన శక్తి ఉంది. కొత్త జట్టులో భాగం కావడం ఆనందంగా ఉంది. ఇదే ఉత్తేజంతో ముందుకు సాగుతా' అని అన్నాడు.

# వాణిజ్యం

## ఫోన్‌పే ఐపిఒకు సెబి గ్రీన్ సిగ్నల్

**ముంబై, ఫిబ్రవరి 21:** గడచిన కొన్ని రోజులుగా దేశీయంగా స్టాక్ మార్కెట్లలోకి వస్తున్న క్రేజీ ఐపీవోల సంఖ్య భారీగా తగ్గిపోయింది. ఈ క్రమంలో మార్కెట్లు ఒడిదొడుకుల్లో ఉండటం కూడా రిటైల్ పెట్టుబడిదారులను మార్కెట్లకు కొంత దూరంగా ఉండేలా చేస్తోంది. ఈ క్రమంలోనే కొత్త కంపెనీలు తమ ఐపీవో ఫ్లోటింగ్ ప్లాన్స్ రివీల్ చేస్తున్నాయి. అమెరికా రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ యాజమాన్యంలో పనిచేస్తున్న 'ఫోన్‌పే' సంస్థ చాలా కాలంగా తన ఐపీవోను తీసుకురావటం కోసం అవసరమైన సన్నాహాలను చేస్తున్న సంగతి తెలిసిందే. చివరిగా 2023లో ఇన్వెస్టర్ల నుంచి ఫండింగ్ అందుకున్న కంపెనీ విలువ అప్పట్లో 10 బిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది. అయితే ప్రస్తుతం డిజిటల్ చెల్లింపులు విస్తరించటంతో ఈ విలువ మరింతగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కంపెనీ మార్కెట్లో పేటీఎం, నావీ, గూగుల్ పే వంటి ఇతర పోటీదారులను కలిగి ఉంది. వాస్తవానికి సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ 2022 డిసెంబరులో తన బిజినెస్ ఆపరేషన్స్ ఇండియాకు మార్చేసింది. దీని కారణంగా కంపెనీ దాదాపు 8000 కోట్ల మేర భారీ పన్ను చెల్లింపులను చేపట్టాల్సి వచ్చింది. దీని కారణంగా నాన్ పేమెంట్ సేవలను కంపెనీ పూర్తిగా స్వాధీనంలోకి తెచ్చుకుంది. అయితే ప్రస్తుతం దేశీయ స్టాక్ మార్కెట్లో ఐపీవో ఫ్లోట్ చేయటానికి అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో కంపెనీ తన ప్లాన్ ముందుకు తీసుకెళ్లాలని చూస్తోంది. కంపెనీ తన ఐపీవోకి సంబంధించి సన్నాహక చర్యలను ప్రారంభించినట్లు ఫోన్‌పే ఒక ప్రకటనలో తెలిపింది.




దీని ద్వారా కంపెనీ తన వ్యాపారాన్ని భారతీయ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయాలని యోచిస్తోంది. ఈ ఏడాది కంపెనీ తన వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభించి 10వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ ఐపీవో ప్లాన్ మంచి మైలురాయిగా నిలుస్తుందని తెలుస్తోంది. కంపెనీ తన డిజిటల్ సేవల ద్వారా ప్రస్తుతం దేశంలో కోట్ల మంది ప్రజలకు సేవలను అందిస్తూ దగ్గరైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆర్థిక ఫలితాలు ప్రస్తుతం కంపెనీ దేశీయ స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించటానికి అనుకూలంగా ఉన్నట్లు యాజమాన్యం భావిస్తోంది. 2024 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 73 శాతం వృద్ధిని నమోదు చేసింది. దీంతో కంపెనీ మెత్తం ఆదాయం రూ.5064 కోట్లుగా నమోదైందని బెంగళూరు టెక్ కంపెనీ వెల్లడించింది. ఈ క్రమంలో కంపెనీ తన నికర ఆదాయం రూ.197 కోట్లుగా నమోదు చేసి నష్టాల నుంచి బయటకు వచ్చింది.

## చాట్‌జిపిటి యాక్టివ్ యూజర్లు 400 మిలియన్లు

**ముంబై, ఫిబ్రవరి 21:** ఓపెన్‌ఎఐకి చెందిన ఎఐ చాట్‌బాట్ చాట్‌జిపిటి వినియోగించే వారి సంఖ్య రోజురోజులూ పెరుగుతోంది. ఈ విభాగంలో పోటీ ఇచ్చేందుకు ఇప్పటికే పలు సంస్థలు ముందుకొస్తున్నా చాట్‌జిపిటికి ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. గతేడాది డిసెంబరుతో పోలిస్తే ప్రస్తుతం ఉన్న యూజర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ విషయాన్ని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బ్రాడ్ లైట్‌క్యాప్ వెల్లడించారు. తమ సేవలు చాలా మందికి చేరువైనట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఓపెన్‌ఎఐ చాట్‌బాట్‌కు వారానికి 400 మిలియన్ల మంది యాక్టివ్ యూజర్లు ఉన్నారు. డిసెంబరులో ఈ సంఖ్య 300 మిలియన్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్యలో చాలా పెరుగుదల నమోదైంది. చాట్‌జిపిటిని కేవలం వ్యక్తులు మాత్రమే కాదు, కంపెనీలు కూడా వినియోగిస్తున్నాయి. వీటి సంఖ్య దాదాపు 2 మిలియన్ల వరకు ఉంది. సెప్టెంబరుతో పోలిస్తే ఈ సంఖ్య రెట్టింపైంది. ఉబెర్, మోర్గాన్ స్టాన్లీ, టి-మొబైల్స్ వంటి పెద్ద పెద్ద కంపెనీలు ఓపెన్ ఎఐని వినియోగిస్తున్న సంస్థల జాబితాలో ఉన్నాయి. చాలా మంది డెవలపర్లు ఓపెన్‌ఎఐకి చెందిన ఎఐ మోడళ్లను వారి సొంత యాప్‌లలో వినియోగిస్తున్నారు. దీంతో ఈసేవల్ని వినియోగించే డెవలపర్ల సంఖ్య ఆరు నెలల్లో రెట్టింపైంది. అదే సమయంలో ఓపెన్‌ఎఐ అడ్వాన్స్‌డ్ రీజనింగ్ మోడల్ వినియోగం ఏకంగా ఐదు రెట్లు పెరిగిందని కంపెనీ తెలిపింది. ఇదిలా ఉండగా, కృత్రిమ మేధ విభాగంలో ఇప్పటికే పోటీ నెలకొంది. చైనాకు చెందిన ఎఐ కంపెనీ డీప్‌సీక్‌ను ఒక్కసారిగా మార్కెట్‌లోకి దూసుకొచ్చి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. మరోవైపు ఎలాన్ మస్క్‌కు చెందిన గ్రోక్ కూడా తన ఎఐ సేవల్ని మెరుగుపరుస్తూ వస్తోంది. అయినప్పటికీ, చాట్‌జిపిటికి మాత్రం తన యూజర్ల సంఖ్యను ఏ మాత్రం కోల్పోకుండా పెంచుకుంటుండడం విశేషం.




## కియా '1380 ఇవి6' కార్లు రీకాల్

**ముంబై, ఫిబ్రవరి 21:** ప్రముఖ వాహన తయారీ సంస్థ కియా మోటార్స్ తన 'ఇవి6' కోసం స్వచ్ఛందంగా రీకాల్ ప్రకటించింది. 2022 మార్చి 3 నుంచి 2023 ఏప్రిల్ 24 మధ్య తయారైన మొత్తం 1,380 యూనిట్లలో సమస్య ఉన్నట్లు గుర్తించి ఈ రీకాల్ ప్రకటించడం జరిగింది. కియా 'ఇవి6' ఎలక్ట్రిక్ కార్లలో ఇంటిగ్రేటెడ్ ఛార్జింగ్ కంట్రోల్ యూనిట్‌లో 12వి బ్యాటరీ పనితీరును ప్రభావితం చేసే లోపం కారణంగా రీకాల్ ప్రకటించింది. ఈ సమస్య కారణంగా 2024లో కూడా కంపెనీ 1138 యూనిట్లకు రీకాల్ ప్రకటించింది. ఇప్పుడు మరోమారు రీకాల్ జారీచేసింది. ఇంటిగ్రేటెడ్ ఛార్జింగ్ కంట్రోల్ యూనిట్‌లోని సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ 12వి బ్యాటరీ ఛార్జింగ్, పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది కారులోని లైట్స్, వైపర్లు, మ్యూజిక్ సిస్టమ్ వంటి వాటికి శక్తిని ఇస్తుంది. కార్లలో ఈ లోపాన్ని కంపెనీ ఉచితంగానే పరిష్కరిస్తుంది. అయితే సంబంధిత వాహనాల యజమానులను నేరుగాసంప్రదించి వాటిని అప్‌డేట్ చేస్తామని కంపెనీ పేర్కొంది. ప్రభావిత వాహనాల కస్టమర్లు అపాయింట్‌మెంట్ షెడ్యూల్ చేసుకోవడానికి, సంబంధిత కియా డీలర్‌షిప్‌లను సంప్రదించవచ్చు. ఇతర వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబర్‌కి కాల్ చేయవచ్చు.



## ట్రంప్‌తో ఆపిల్ సిఇఒ భేటీ

**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆపిల్ సిఇఒ టిమ్‌కుక్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వైట్‌హౌజ్‌లో సమావేశమయ్యాయి. చైనాలో ఆపిల్ తన తయారీ ప్లాంట్ నుంచి భారీగానే వివిధ దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. అందులో కొంతభాగం అమెరికాకూ ఎగుమతి అవుతోంది. అయితే ఇటీవల అమెరికా-చైనాల మధ్య సుంకాల విషయంలో తీవ్ర చర్చ సాగుతున్న నేపథ్యంలో టిమ్ కుక్ ట్రంప్‌తో భేటీ అవ్వడం చర్చనీయాంశం అయింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్ని చైనా దిగుమతులపై 10శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇది చైనాలో ఉత్పత్తి అవుతూ అమెరికాలోకి వస్తున్న ఆపిల్ ఉత్పత్తులను నేరుగా ప్రభావితం చేస్తుంది. ఇది కంపెనీ ఉత్పత్తుల ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ఈ సుంకాల నుంచి ఆపిల్ ఉత్పత్తులను రక్షించడం తన ప్రాథమిక లక్ష్యంగా కుక్ భావించారు. దాంతో ట్రంప్‌ను ప్రత్యక్షంగా కలిసి టారిఫ్ మినహాయిం పులు కోరినట్లు తెలిసింది. అయితే గతంలో మాదిరి కాకుండా ఈ సారి ఆపిల్‌కు ఎలాంటి మినహాయింపులు ఉండవని ట్రంప్ సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. వాణిజ్య సమస్యలతో పాటు ఆపిల్ గోప్యతా విధానాలపై ట్రంప్, టిమ్‌కుక్‌ల మధ్య చర్చ జరిగింది. సమర్థంగా చట్టాలను అమలు చేసేందుకు న్యాయబద్ధమైన సంస్థల కోసం కొన్ని ఐఫోన్లను అన్‌లాక్ చేయాలని ప్రభుత్వం ఎప్పటి నుంచో వాదిస్తోంది. ట్రంప్ ఈ అంశాన్ని లేవనెత్తడంతో కుక్ వినియోగదారుల గోప్యతకు కట్టుబడి కన్నట్లు తెలియ చేశారని తెలిసింది.



## సెన్సెక్స్, నిఫ్టీలకు నాలుగో రోజూ నష్టాలే..

**ముంబై, ఫిబ్రవరి 21:** దేశీయ స్టాక్ మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ముఖ్యంగా ఆటో స్టాక్స్‌లో విక్రయాల కారణంగా సూచీలపై ఒత్తిడి పెరిగింది. మహీంద్రాఅండ్ మహీంద్రా 6శాతం టాటా మోటార్స్ షేర్లు 2.46 శాతం చొప్పున నష్ట పోయాయి. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్ బెంచ్ మార్క్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా నాలుగో రోజూ నికిపైగా నష్టాల్లో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 75,612.61 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 75,112.41 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరిన సూచి, చివరికి 424.90 పాయింట్ల నష్టంతో 75,311.06 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 117.25 పాయింట్ల నష్టంతో 22,795.90 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలోరూపాయి విలువ 7 పైసలు నష్టపోయి రూ.86.71 వద్ద నిలిచింది.మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, సన్‌ఫార్మా, పవర్ గ్రిడ్ కార్పొరే షన్ వంటి షేర్లు నష్టపోయాయి. టాటా స్టీల్, లార్సెన్ అండ్ టూబ్రో, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఏసియన్ పెయింట్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వంటి షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 75.90 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 2944 డాలర్ల వద్ద ట్రేడయింది.




## కొత్త 'ఇవి' పాలసీ వదంతులు ..టాటా, మహీంద్రా షేర్లు డౌన్

**ముంబై, ఫిబ్రవరి 21:** ప్రముఖ కార్ల తయారీ సంస్థలైన టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విదేశీ కార్ల తయారీ కంపెనీలకు ఆహ్వానం పలికేందుకు కేంద్రం కొత్త 'ఇవి' పాలసీని తీసుకురాబోతోందన్న వార్తల నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆయా కంపెనీల షేర్లు ఆరు శాతం వరకు నష్టపోయాయి. దేశంలోకి అమెరికా కార్ల తయారీ సంస్థ టెస్లా ఎంట్రీ దాదాపు ఖరారైంది. అయితే సుంకాలు మరింత తగ్గించాలని ఆ కంపెనీ కోరుతోంది. ఈ నేపథ్యంలో టెస్లా కోసం ప్రభుత్వం కొత్త 'ఇవి' పాలసీని మరింత సులభతరం చేస్తూ తీసుకురాబోతోందంటూ వార్తలు వస్తున్నాయి. దిగుమతి సుంకాన్ని తగ్గిస్తే విదేశీ కార్లు దేశీయ మార్కెట్లో ప్రవేశించేందుకు వీలు పడుతుంది. అప్పుడు దేశీయ కార్ల తయారీ కంపెనీలకు గట్టి పోటీ ఏర్పడుతుంది. ఈ భయాల నేపథ్యంలో ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో నిఫ్టీ ఆటో సూచి 2శాతం మేర నష్టపోయింది. మహీంద్రా అండ్ మహీంద్రా 6శాతం, టాటా మోటార్స్ 2 శాతా ట్రేడవుతున్నాయి. ప్రస్తుతం 'ఇవి' కార్ల మార్కెట్లో ఈ రెండూ మెజారిటీ వాటా కలిగి ఉన్నాయి.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.